

టంగుటూరులో బాణసంచా కాల్చుతున్న టీడీపీ శ్రేణులు

పదవుల్లో పెద్దపీట

కూటమి ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల తొలి జాబితాలో జిల్లాకు సముచిత స్థానం దక్కింది. నిబద్ధతతో పార్టీల్లో కష్టపడి పనిచేస్తున్న నాయకులను ప్రోత్సహిస్తూ చైర్మన్ పదవులను అప్పగించారు. అవన్నీ చాలా ప్రాధాన్యం ఉన్న సంస్థలు కావడం విశేషం. ఉమ్మడి జిల్లాకు మొత్తం నాలుగు కార్పొరేషన్ చైర్మన్ పదవులు లభించాయి. అందులో మూడు టీడీపీ నేతలకు, ఒకటి బీజేపీ నేతకు దక్కాయి. జనసేనకు ఒక డైరెక్టర్ పోస్టు లభించింది. ఈ పదవుల పంపకంపై టీడీపీ శ్రేణుల్లో సంపూర్ణ సానుకూలత వ్యక్తమతోంది. బీజేపీ, జనసేనల్లో మిశ్రమ స్పందన కనిపిస్తోంది.

'నామినేటెడ్'లో జిల్లాకు సముచిత స్థానం

- నిబద్ధతతో పనిచేసిన వారికి అందలం
- పిన్నవయసులోనే దామచర్ల సత్యకు గుర్తింపు
- టీడీపీ నుంచి నూకసాని, మాణిక్యాలరావుకు చైర్మన్ పోస్టులు
- బీజేపీ నుంచి లంకా దినకర్‌కు అవకాశం
- జనసేన నుంచి గౌతంరాజుకు డైరెక్టర్ పదవి



దామచర్ల సత్య



నూకసాని బాలాజీ



పిల్లి మాణిక్యాలరావు



లంకా దినకర్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి జిల్లాకు కార్పొరేషన్ పదవుల విషయంలో కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసింది. నాలుగు చైర్మన్ పదవులు ఇచ్చింది. చిన్న వయసులోనే తెలుగుదేశం పార్టీలో మంచి గుర్తింపు పొందిన ఆపార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ దామచర్ల సత్యన్నారాయణ (సత్య)కు ప్రాధాన్యం ఉన్న బోర్డు చైర్మన్ పదవి దక్కింది. ఆంధ్రప్రదేశ్ పోర్టులు, హార్బర్ల నిర్వహణ సంస్థ (ఏపీ మారిటైం బోర్డు) చైర్మన్‌గా సత్య నియమితులయ్యారు. అలాగే టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడిగా ఉన్న యాదవ సామాజికవర్గానికి చెందిన నూకసాని బాలాజీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ ఇద్దరిదీ కొండపి నియోజకవర్గం. బీజేపీ నుంచి ఆపార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధిగా ఉన్న ఒంగోలుకు చెందిన లంకా దినకర్‌ను 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్‌గా నియమించారు. చీరాలకు చెందిన దళిత ఉద్యమ కారుడు, టీడీపీ అధికార ప్రతినిధి అయిన పిల్లి మాణిక్యాలరావు లిడ్ క్యాప్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఎర్రగొండపాలెంనకు చెందిన జనసేన నాయకుడు డాక్టర్ పాకనాటి గౌతంరాజు ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

టీడీపీలో ఆచితూచి ఎంపికలు..

పదవుల కేటాయింపులో తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం పలు జాగ్రత్తలు తీసుకున్నట్లు కనిపిస్తోంది. అనేక మంది నాయకుల పేర్లను పరిశీలించినప్పటికీ ప్రధానంగా గత వైసీపీ ప్రభుత్వంలో, ఆ తర్వాత ఎన్నికల సమయంలో నిబద్ధతతో పనిచేసిన వారికి ఈ జాబితాలో అవకాశం ఇచ్చారని ఆ పార్టీశ్రేణులు భావిస్తున్నాయి. సామాజికవర్గాల సమీకరణకు తగు ప్రాధాన్యం ఇచ్చారు. దామచర్ల సత్య ఓసీ కాగా నూకసాని బాలాజీ యాదవ సామాజిక వర్గానికి చెందినవారు. మాణిక్యాలరావు దళిత ఉద్యమం నుంచి వచ్చిన నాయకుడు. దివంగత మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు మనుమడైన సత్య 2012 నుంచి కొండపి నియోజకవర్గ టీడీపీ బాధ్యతల నిర్వహణలో కీలక భూమిక పోషించారు. నారా లోకేష్ నిర్వహించిన యువగళంలో తెర వెనుక కీలకపాత్ర పోషించిన వారిలో సత్య కూడా ఒకరు. ఇంజనీరింగ్ పూర్తిచేశారు. ఉత్తరాంధ్రతో ఉన్న సంబంధాలు ఉమ్మడి జిల్లాలోని రామాయపట్నం పోర్టు నిర్మాణం జరుగు తున్న నేపథ్యంలో సత్యకు మారిటైం బోర్డు చైర్మన్ పదవి దక్కడం పట్ల ప్రత్యేకంగా చర్చించు కుంటున్నారు.

బీజేపీ, జనసేన...

బీజేపీ, జనసేనలకు సంబంధించి ఒక్కో పదవి దక్కినప్పటికీ ఆ పార్టీ శ్రేణుల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కీలకమైన 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్‌గా నియమితులైన బీజేపీ నేత లంకా దినకర్ ఒంగోలు వాసి. చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తూ టీడీపీ కుటుంబం నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ఆయన తొలుత టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా, ఆతర్వాత పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా పనిచేశారు. 2019 తర్వాత బీజేపీలో చేరిన ఆయన ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకుల్లో మంచి గుర్తింపు పొందారు. బీజేపీ రాష్ట్ర ముఖ్యఅధికార ప్రతినిధిగా పొలిటికల్ ఫీడ్ బ్యాక్ ప్రముఖ్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆయన విజయవాడ కేంద్రంగా పనిచేస్తున్నప్పటికీ జిల్లా కోటాలోనే పదవి దక్కింది. జనసేన నుంచి జిల్లాకు ఒక డైరెక్టర్ పదవి మాత్రమే లభించింది.. అదీ ఎర్రగొండపాలెంనకు చెందిన డాక్టర్ పాకనాటి గౌతంరాజుకు దక్కింది.

బీసీ నేతకు కీలక చైర్మన్ పదవి

టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడిగా ఉన్న నూకసాని బాలాజీ 2019కు ముందు వైసీపీలో జడ్పీ చైర్మన్‌గా కొంతకాలం పనిచేశారు. ఆతర్వాత టీడీపీలో చేరిన ఆయన పార్టీలో చురుకైన పాత్ర పోషించారు. అది గమనించిన గత టీడీపీ ప్రభుత్వం ఆయనకు యాదవ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇచ్చింది. బాలాజీ తొలుత టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా పనిచేశారు. 2020 నుంచి ఆపార్టీకి జిల్లా అధ్యక్షుడిగా ఉంటూ బలహీనవర్గాలను సమీకరించే పనిలో ముందడుగు వేశారు. ఎంఏ అర్థశాస్త్రంలో ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తిచేశారు. లిడ్ క్యాప్ చైర్మన్‌గా నియమితులైన పిల్లి మాణిక్యాలరావు దళిత నేత. చీరాల విజయనగర్ కాలనీకి చెందిన ఆయన టీడీపీలో చేరిన దగ్గర నుంచి పార్టీకి చీరాలలో అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలువురు నేతలను పరిగణనలోకి తీసుకున్న అధిష్ఠానం అనేక వడపోతల అనంతరం ఈ ముగ్గురికి తొలి జాబితాలో సముచిత స్థానం కల్పించింది.

నమ్మకం వమ్ముకాకుండా పనిచేస్తా : సత్య

పార్టీలో అంకితభావంతో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఎప్పుడూ ఉంటుందనేందుకు ఈ నియామకాలు దర్పణమని దామచర్ల సత్య వ్యాఖ్యానించారు. చిన్న వయస్సుల్లోనే మంచి కార్పొరేషన్ పదవిని అప్పగించిన అగ్ర నేతలకు, సహకరించిన జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు, లోకేష్‌ల నమ్మకం వమ్ముకాకుండా పెద్దాయన ఆంజనేయులు పేరు చెడకుండా కొండపి నియోజకవర్గ ప్రజలు, టీడీపీ కార్యకర్తలకు అండగా పనిచేస్తానని హామీ ఇచ్చారు.

బీసీలకు టీడీపీలోనే సముచిత స్థానం : బాలాజీ

తెలుగుదేశం పార్టీలోనే బడుగు, బలహీనవర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందనేందుకు పదవుల తొలి జాబితానే దర్పణం పట్టిందని నూకసాని బాలాజీ వ్యాఖ్యానించారు. నిజాయితీగా పనిచేసి కార్పొరేషన్‌కు గుర్తింపు తెస్తూ, పార్టీ కోరుకున్న విధంగా బలహీనవర్గాల ప్రజలను టీడీపీలోకి సమీకరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. చంద్రబాబు, లోకేష్, మంత్రులు స్వామి, రవి, సత్యప్రసాద్, రవీంద్ర, బీసీ జనార్దన్‌రెడ్డితోపాటు జిల్లాలోని టీడీపీ నాయకులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.



చౌటపాలెం ఎస్సీ కాలనీలోని ఓ ఇంటికి 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్‌ను అంటిస్తున్న మంత్రి స్వామి

ఉత్సాహంగా.. ఊరూరా

'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు, వివిధ శాఖల సిబ్బంది

- వంద రోజుల పాలనలో విజయాల వివరణ
- చౌటపాలెంలో పాల్గొన్న మంత్రి డాక్టర్ స్వామి
- ఇతర చోట్ల టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు

ఒంగోలు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 'ఇది మంచి ప్రభుత్వం' ప్రచార కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ఊరూరా టీడీపీ కేడర్, క్షేత్రస్థాయిలోని ప్రభుత్వశాఖల సిబ్బంది పాల్గొంటున్నారు. వంద రోజుల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను, విజయాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తున్నారు. అదే సమయంలో జిల్లాలో మంత్రి డాక్టర్ స్వామి ఇతర ఎమ్మెల్యేలు, కీలక నేతలు తమ పరిధిలోని గ్రామాల్లో ఈ కార్యక్రమంలో పాల్గొని మరింత ఉత్సాహపరుస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఈనెల 20 నుంచి 26 వరకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిన విషయం విదితమే. అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డులలో ఎక్కడికక్కడ క్షేత్రస్థాయి ప్రభుత్వ సిబ్బంది, టీడీపీ కేడర్ కార్యక్రమంలో పాల్గొంటోంది. మండలానికి రెండేసి గ్రామాలలో సభలు నిర్వహిస్తున్నారు. వారంరోజులపాటు జరిగే ఈ కార్యక్రమం ఐదో రోజైన మంగళవారం మరింత జోరుగా సాగింది. కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు మండలం చౌటపాలెంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి పాల్గొన్నారు. ఒంగోలు రూరల్ మండలం వలేటివారిపాలెంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొనగా చీమకుర్తి మండలం బూసరపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నెరవేర్చిన హామీల గురించి వివరించారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పెద్దనాగులవరం గ్రామంలో పాల్గొనగా, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కంభం మండలం తురిమెళ్లలో, వైపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పుల్లలచెరువు మండలం ఐటీవరంలో జరిగిన సభల్లో పాల్గొన్నారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఉత్సాహంగా కార్యక్రమం కొనసాగింది.



ఆసుపత్రిలోని తల్లీబిడ్డ సురక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

వైద్యరంగానికి ప్రాధాన్యం

- కనిగిరి ఆసుపత్రి అభివృద్ధికి ఎమ్మెల్యే సహకారం అభినందనీయం
- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- వైద్యశాల సందర్శన

కనిగిరి, సెప్టెంబరు 24: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నదని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. మంగళవారం ఆమె కనిగిరి ప్రాంతంలో పర్యటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో కలిసి స్థానిక ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. డాక్టర్ ఉగ్ర తన సొంత నిధులతో ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డును అభివృద్ధి చేస్తున్న తీరును చూసి ప్రశంసించారు. ఆసుపత్రి అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అప్పుడే పుట్టిన చిన్నారులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆధునిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలను కలెక్టర్ చూశారు. వీటి కోసం ఇప్పటికే రూ11 లక్షలు వెచ్చించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. తల్లీబిడ్డ సంరక్షణే ధ్యేయంగా కనిగిరి ప్రభుత్వాసుపత్రి రాష్ట్రంలోనే ముందంజలో ఉండాలన్నదే తన సంకల్పమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ వార్డులను కలెక్టర్ పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యులు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఆర్డీవో జాన్‌ఇర్విన్, మునిసిపల్ చైర్మన్ గఫార్, సూపరింటెండెంట్ అబ్దుల్ కలాం, టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, యడవల్లి శ్రీనివాసులురెడ్డి, గాయం తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం

కనిగిరి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే సమక్షంలో కలెక్టర్ అన్సారియాకు అందజేశారు. అసుపత్రి అభివృద్ధి కోసం ఎమ్మెల్యే తీసుకుంటున్న చొరవ, పడుతున్న తపన తనను కదిలించిందని వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు.

బాబు చెప్పారు.. గోరంట్ల చేశారు

- శ్రీహర్షిణిలో మద్దిరాలపాడుకు చెందిన ఇద్దరు విద్యార్థులకు ఉచిత విద్య

ఒంగోలు (విద్య), సెప్టెంబరు 24 : మద్దిరాలపాడులో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేద తల్లిదండ్రులకు వారి పిల్లల చదువుపై ఇచ్చిన హామీని మంగళవారం శ్రీహర్షిణి విద్యాసంస్థల అధిపతి గోరంట్ల రవికుమార్ నెరవేర్చారు. మద్దిరాలపాడులో ఖాజావలి, బీబీసారాల ఇద్దరు పిల్లల భవిష్యత్‌కు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి చదువు బాధ్యతను రవికుమార్ చూసుకుంటారని సీఎం చెప్పారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ దంపతులు తమ కుమార్తె పఠాన్ రజియాను ఒంగోలులోని శ్రీహర్షిణి జూనియర్ కళాశాలలో చేర్పించారు. కుమారుడిని మార్టూరులోని శ్రీహర్షిణి స్కూలులో పదో తరగతిలో చేర్పించబోతున్నారు. ఈ ఇరువురికీ చంద్రబాబు హామీ మేరకు ఉచిత విద్య, హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు రవికుమార్ తెలిపారు. తమ పిల్లల భవిష్యత్‌కు భరోసా ఇచ్చిన సీఎం చంద్రబాబుకు, పిల్లలకు ఉచిత విద్యను అందిస్తున్న రవికుమార్‌కు ఖాజావలి, బీబీసార కృతజ్ఞతలు తెలిపారు.



పఠాన్ రజియాకు ప్రవేశపత్రాన్ని అందిస్తున్న రవికుమార్



వెల్లంపల్లి వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్, పక్కన ఎమెల్యే విజయ్‌కుమార్

గుండ్లకమ్మ గేట్ల పనులు వేగవంతం

- కూటమి ప్రభుత్వంలో రూ.8 కోట్లు కేటాయించాం
- త్వరలోనే కాల్వల్లో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి
- మంత్రి గొట్టిపాటి రవికుమార్

మద్దిపాడు,సెప్టెంబర్ 24 : 'జిల్లాలోని కీలకమైన గుండ్లకమ్మ గేటు కొట్టుకుపోయినా నాటి వైసీపీ పాలకులు చోద్యం చూస్తుండిపోయారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రాజెక్టుకు రూ.8కోట్లు నిధులు కేటాయించింది. ప్రస్తుతం గేట్ల మరమ్మతులు వేగంగా జరుగుతున్నాయి' అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వివరించారు. మంగళవారం వెల్లంపల్లి పొగాకు బోర్డుకు చేరుకున్న మంత్రి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. పూర్తిస్థాయిలో రైతుల పంట కొనుగోలుకు అధికారులను ఆదేశించారు. ఈక్రమంలో గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్ల మరమ్మతుల విషయాన్ని స్థానిక రైతు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు. ప్రాజెక్టుల వారీగా నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా వైసీపీ నాయకులు గడిచిన మూడేళ్ల నుంచి గుండ్లకమ్మలో చుక్కనీరు కూడా నిలబెట్టలేకపోయారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 1.75 టీఎంసీల నీరు నిల్వ చేశామని పేర్కొన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు కింద ఉన్న కాల్వల్లో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులపై సంబంధిత శాఖ మంత్రి రామానాయుడుతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మంత్రి రవికుమార్ పొగాకు కొనుగోళ్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్షుడు అబ్బూరి శేషగిరిరావు, నారిపెద్ది వరహాల చౌదరి, రావి ఉమామహేశ్వరరావు మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు జయంతి బాబు, మండవ గోపీనాథ్, నాగన్నపాలెం సర్పంచ్ కాకర్ల విజయ్‌కుమార్, వెల్లంపల్లి ఎంపీటీసీ సభ్యురాలు అద్దేపల్లి గంగాభవాని పాల్గొన్నారు.

భారీగా పంచాయతీ కార్యదర్శులు, ఈవోఆర్‌డీలు బదిలీ

- నేడో, రేపో ఉత్తర్వులు ఇచ్చే అవకాశం

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 24: జిల్లా పంచాయతీ కార్యాలయ పరిధిలో పనిచేస్తున్న మండల స్థాయి ఈవోఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శుల బదిలీలు భారీగా జరగనున్నాయి. ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో తదనుగుణంగా జిల్లా పంచాయతీ కార్యాలయంలోనూ ఆ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. జిల్లావ్యాప్తంగా 30మందికిపైగా ఈవోఆర్‌డీలు స్థానచలనం కానున్నారు. కార్యదర్శులు 400మంది వరకూ మారనున్నట్లు తెలిసింది. ఇప్పటికే జిల్లా పంచాయతీ కార్యాలయ అధికారులు బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆ ఫైలుపై ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. నేడో, రేపో ఆమె సంతకం చేయనున్నారు ఆ వెంటనే అందరికీ ఆర్డర్లు జారీ చేయనున్నారు.

జాబ్‌మేళాలో 54 మందికి ఉద్యోగాలు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 24 : స్థానిక త్రోవగుంటలోని శివసాయి ఐటీఐలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 54 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జాబ్ మేళాకు 63 మంది విద్యార్థులు హాజరు కాగా 49 మంది, బీఎస్సీ, బీ ఫార్మసీ, ఎంఫార్మసీ విద్యార్థులు 9 మంది హాజరు కాగా ఐదుగురు ఉద్యోగాలకు ఎంపికయ్యారు ఐటీఐ వారికి రూ.15వేలు, బీఎస్సీ, బీఫార్మసీ వారికి రూ.20వేలు, ఎం.ఫార్మసీ వారికి రూ.24వేలు నెల జీతంతో ఎంపికయ్యారని కరస్పాండెంట్ కే శ్రీనివాసరావు తెలిపారు. ఐటీఐ జిల్లా కన్వీనర్ నాగేశ్వరరావు, కృష్ణమూర్తి, కంపెనీ ప్రతినిధులు హరికృష్ణ, అమర్‌నాథ్‌లు పాల్గొన్నారు.

3 నుంచి బ్యూటీపార్లర్‌పై ఉచిత శిక్షణ

ఒంగోలు నగరం, సెప్టెంబరు 24 : రూడ్‌సెట్ సంస్థలో అక్టోబరు మూడో తేదీ నుంచి మహిళలకు బ్యూటీపార్లర్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ మహిళల కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన 18 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగిన వారు శిక్షణ పొందేందుకు అర్హులని తెలిపారు. రేషన్, ఆధార్ కార్డులు కలిగిన వారు అర్హులని, 30 రోజుల పాటు సాగే ఈ శిక్షణలో ఉచిత భోజనంతో పాటు వసతి సౌకర్యం కూడా కల్పిస్తారని వివరించారు. ఆసక్తి ఉన్న వారు 9573363141 నంబర్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

29న గిరిజన ఉద్యోగుల సంఘం సంబరాలు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 24 : అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఏర్పడి 60ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 29వ తేదీన ఒంగోలులో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం డైమండ్ జూబ్లీ సంబరాలు నిర్వహిస్తున్నట్లు గిరిజన ఉద్యోగుల సంఘం నాయకుడు డాక్టర్ బాలాజీ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంఘం ఏర్పాటుకు అనేక మంది మహనీయులు అహర్నిశలు శ్రమించి కష్టనష్టాలను అనుభవించారని పేర్కొన్నారు. జూబ్లీ సంబరాల్లో గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో పాటు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు పేస్ విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న శ్రీధర్

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 24 : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చదువుతున్న షేక్ ఫాతిమా ఈ నెల 26నుంచి 30వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి లా క్రాస్ పోటీలకు ఎంపికయ్యారు. కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన ఫాతిమా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో మంగళవారం నిర్వహించిన అభినందన సభలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ క్రీడాకారిణి ఫాతిమాను అభినందించి రూ.10వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీ.వీ.కె. మూర్తి, డీన్ సి.వి. సుబ్బారావు, ఆర్ వీరాంజనేయులు, సుబ్బారావు, రవీంద్ర పాల్గొన్నారు.

'రైజ్' అధ్యాపకులకు అవార్డులు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 24 : స్థానిక రైజ్ ఇంజనీరింగ్ కళాశాలకు, అక్కడ పనిచేస్తున్న అధ్యాపకులకు జాతీయ స్థాయి గుర్తింపు పొందిన కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపెటెన్సీస్ సంస్థ అవార్డులు అందజేసిందని సెక్రటరీ శిద్దా హనుమంతరావు తెలిపారు. రైజ్ కృష్ణసాయి గ్రూపు విద్యా సంస్థల్లో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఏ భాస్కరరావుకు ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు, ప్రొఫెసర్ సిహెచ్. వేణుగోపాల్‌రెడ్డికి ఎక్సలెంట్ లీడర్‌షిప్ అవార్డు, భార్గవి గోపిరాజుకు ఉత్తమ డెడికేషన్ డైనమిక్ లెర్నింగ్ ఎన్విరాన్‌మెంట్ అవార్డు, రఘుబాబుకు ఉత్తమ ప్లేస్‌మెంట్ అవార్డు దక్కిందని కళాశాల కోశాధికారి శిద్దా భరత్ తెలిపారు. అవార్డులు సాధించిన అధ్యాపకులను కళాశాల గౌరవ ఛైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్ అభినందించారు.

స్కూలు గేమ్స్ పోటీలకు హెచ్‌పీఎస్ విద్యార్థులు



విద్యార్థులతో కరస్పాండెంట్ జగదీష్

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 23 : స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర స్థాయి పోటీలకు ఒంగోలులోని హైదరాబాద్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్ 14 విభాగంలో 9వ తరగతి విద్యార్థి సామ్యుయేల్, 8వ తరగతికి విద్యార్థిని జైత్రలు ఎంపికయినట్లు స్కూలు కరస్పాండెంట్ జగదీష్ తెలిపారు. ఈ సందర్భంగా స్కూలు వ్యాయామోపాధ్యాయులు సాయికార్తీక్, అనీల్‌ను స్కూలు యాజమాన్యం అభినందించింది.

జిల్లా పంచాయతీ కార్యాలయ ఏవోగా రాజేంద్రప్రసాద్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 24 : జిల్లా పంచాయతీ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో)గా రాజేంద్రప్రసాద్‌ను నియమిస్తూ ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులిచ్చారు. నెల్లూరు డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న రాజేంద్రప్రసాద్‌ను జిల్లా పంచాయతీ కార్యాలయ ఏవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు ఇక్కడ ఏవోగా పనిచేస్తున్న శివప్రసాద్‌ను కందుకూరు డీఎల్‌పీవో కార్యాలయ ఏవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారి కేసులో వీడిన మిస్టరీ

ఒంగోలు(క్రైం)సెప్టెంబరు 24 : జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారి పోలిశెట్టి రాజశేఖర్ కళ్లలో కారం కొట్టి కర్రలతో దాడి చేసిన కేసులో ఎట్టకేలకు పోలీసులు కీలకమైన ఆధారాలు సేకరించారు. ఈనెల 11న రాత్రి స్థానిక అంబేద్కర్‌భవన్‌రోడ్డులో ఘటన జరిగింది. దీనిపై చీఫ్ సెక్రటరీ వాకబు చేశారు. ఎట్టకేలకు పోలీసు పురోగతి సాధించారు. సీసీ ఫుటేజి ఆధారంగా దాడిలో పాల్గొన్నది ఎవరనేది నిర్ధారణకు వచ్చారు.నిందితులను అదుపులోకి తీసుకుంటే అనేక విషయాలు బయిటకు వచ్చే అవకాశం ఉంది. నిందితులు ఐదుగురు పాల్గొన్నటు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. వారి కోసం వేట ప్రారంభమైంది.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 24 : జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ కలిశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నూకసాని బాలాజీతో కలిసి కలెక్టర్‌ను కలిశారు. ఉద్యోగుల బదిలీలతో పాటు ఒంగోలు నియోజకవర్గ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

ఉపాధికి ఊతం... ప్రగతికి పట్టం

సంతనూతలపాడు మండలానికి

రూ.13కోట్లకుపైగా నిధుల కేటాయింపు

ఇప్పటికే గ్రామసభల ద్వారా పనుల గుర్తింపు

మారనున్న పల్లె రూపురేఖలు

సంతనూతలపాడు, సెప్టెంబరు 21 : గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలను నివారించి స్థానికంగా పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద తాజాగా మంజూరైన నిధులు అభివృద్ధికి మరింత ఊతమివ్వనున్నాయి. స్థానికంగా భారీగా పనులు కల్పించేందుకు అవకాశం ఏర్పడ్డాయి. 2014-19లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకాన్ని వినియోగించుకుని సీసీరోడ్లు, మురుగుకాలువ ఏర్పాట్లు, అంగన్‌వాడీ కేంద్రాలు ఇతర నిర్మాణాలు చేపట్టారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకం అమలుపై నిర్లక్ష్యం చూపింది. గ్రామాల్లో రహదారులు మురుగుకాలువ ఏర్పాట్లు విస్మరించి సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్ నిర్మాణాలకు మొగ్గు చూపింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామాల అభివృద్ధిపై దృష్టిపెట్టింది. పల్లెల రూపురేఖలు మార్చే దిశగా డ్వామా, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజనీరింగ్ శాఖ అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేశారు.



ఉపాధి పనిచేస్తున్న కూలీలు(ఫైల్)

పనుల గుర్తింపు, గ్రామసభలో తీర్మానం

2024-25 ఆర్థిక సంవత్సరానికి గత నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన నాయకులతో కలిసి అధికారులు గుర్తించి ప్రతిపాదనలు తయారుచేశారు. పలుపనులకు సంబంధించి మండలానికి ప్రభుత్వం 13కోట్ల 49లక్షల 47వేల901 రూపాయలను కేటాయించింది. విడతల వారీగా వచ్చే నిధులతో పనులు చేపట్టనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం గ్రామసభల్లో తీర్మానం చేసిన పనులు అధికంగా ఉండడంతో వచ్చిన నిధుల మేరకు ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టనున్నారు.

మండలంలోని గ్రామాల్లో చేసే పనులు

మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పనుల కింద చేపట్టబోయే పనులు కుంటలు, రోడ్డుపక్క మొరలు, చెరువులో పూడిక, చెక్‌డ్యామ్ పూడిక, డగ్‌అవుట్‌పాండ్స్, హార్టికల్చర్, కమ్యూనిటీ సోక్ పిట్స్, రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రెక్చర్, క్యాటిల్ షెడ్స్, క్యాటిల్ పాండ్స్ వంటిపనులు ఉపాధిహామీ సిబ్బంది, సంబంధిత శాఖ అధికారుల సమన్వయంతో చేపట్టబోతున్నారు.

కార్మికుల ఆరోగ్యంపై శ్రద్ధ : కలెక్టర్

పారిశుధ్య పనివాళ్ల సమస్యలు పరిష్కారానికి కృషి:

ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

కార్పొరేషన్ కార్యాలయంలో మెగా వైద్యశిబిరం



మాట్లాడుతున్నకలెక్టర్ అన్సారియా, పక్కన ఎమ్మెల్యే జనార్దన్, మేయర్ సుజాత

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 24 : ప్రతి నిత్యం సమాజ ఆరోగ్య రక్షణ కోరుకునే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని కలెక్టర్ తమీమ్ అన్సారీయా చెప్పారు. మంగళవారం ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్, ఒంగోలు కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారీయా, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభించారు. నగర కమిషనరు డాక్టర్ కే వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి శ్రీకారం చుట్టిన స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ప్రతి సంవత్సరం గాంధీ జయంతి రోజైన అక్టోబరు 2వ తేదీని స్వచ్ఛభారత్ దివాస్‌గా జరుపుకుంటున్నామన్నారు. అందులో భాగంగా పదిహేను రోజుల ముందు నుంచే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే జనార్దన్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం పనిచేస్తున్న ప్రతి కార్మికుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు హెల్త్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు. అలాగే ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా అమలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మేయర్ గంగాడ సుజాత, కమిషనరు వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ బుజ్జి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సురేష్, ఆస్టర్ రమేష్ సీఈవో డాక్టర్ నితిన్, ఇతర వైద్యులు పాల్గొనగా, సుమారు వెయ్యి మందికి పైగా పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాలకు జనరల్ మెడిసిన్, ఎముకులు, కీళ్లు, డెర్మటాలజీ, గైనిక్ విభాగాలలో వైద్యపరీక్షలు చేశారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న మూర్తి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 24 : జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కార్యక్రమాలు అమలు చేయడం ద్వారా విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వీసీ డీవీఆర్ మూర్తి చెప్పారు. స్థానిక ఏకేయూ సెమినార్ హాలులో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కొన్ని దేశాలలో యుద్ధ సమయంలో అవసరమైతే సైనికులకు సహాయసహకారాలుగా పనిచేసేందుకు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లను కూడా వినియోగించుకుంటున్నారని తెలిపారు. నూతనంగా ఏర్పడిన ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలో ప్రస్తుతం 58 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉన్నాయని, వీటి ద్వారా సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ హరిబాబు మాట్లాడుతూ పూర్వ కాలంలో ప్రజలకు ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు అవసరమైన ఉత్పత్తులను గ్రామాల్లోనే చేపట్టేవారన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వచ్చిన మార్పులకు అనుగుణంగా గ్రామ సీమలను అభివృద్ధి పర్చేందుకు ఎంతోగాను కృషి జరుగుతోందన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ మండే హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలామణి, డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ ఆర్. శ్రీనివాస్, డాక్టర్ పల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎన్‌లో..

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 24 : స్థానిక మంగమూరు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్/ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డిలు విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు రాజేంద్రబాబు, రాజశేఖరరెడ్డి, నిరూషా పావని, జోసఫ్, పూర్ణచంద్రరావు ఉన్నారు.

క్విస్‌లో...

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 24 : ఒంగోలులోని క్విస్ ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వేడుకలను నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ సూర్యకళ్యాణ చక్రవర్తి, నెహ్రూ యువకేంద్ర జిల్లా కో ఆర్డినేటర్ కమల్‌షా మాట్లాడుతూ విద్యార్థులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం చాలా గొప్ప విషయమన్నారు. ఈసందర్భంగా ప్రతిభ చూపిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిషోర్‌బాబు, ప్రోగ్రాం ఆఫీసర్ ధనమూర్తి, జాలయ్య, విద్యార్థులు ఉన్నారు.

నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు చౌదరి



చౌదరి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రవీంద్రనాథ్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 24 : నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు పీవీఆర్ చౌదరి అని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి వీరంద్రనాథ్ చెప్పారు. స్థానిక అద్దంకి బస్టాండులోని ఒంగోలు నగర ముఠా వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో మంగళవారం చౌదరి సంతాపసభ జరిగింది. ముందుగా పీవీఆర్ చౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్‌డీ సర్దార్ అధ్యక్షతన జరిగిన సభలో హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అంజిబాబు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, సీపీఐ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, కే అంజయ్య, సీహెచ్ వెంకటేశ్వరుల, వడ్డపాటి సుబ్బారావు, మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేసు వెంకటేశ్వర్లు, కార్యదర్శి చెక్క రాధాకృష్ణమూర్తి, కోశాధికారి బియ్యపు వరదరాజులు తదితరులు ఉన్నారు.

ఎస్‌కేఆర్ మానసిక వికాస కేంద్రం తనిఖీ

చీమకుర్తి , సెప్టెంబరు 24 : పట్టణంలోని ఎస్‌కేఆర్ మానసిక కేంద్రాన్ని దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీ అర్చన, డీఈవో సుభద్ర మంగళవారం తనిఖీ చేశారు. దివ్యాంగ విద్యార్థులతో మాట్లాడారు. వారికి అందుతున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీ.నారాయణ, శివాజి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం పోలీసులకు బదిలీల కౌన్సెలింగ్

51 మందికి స్థాన చలనం

ఒంగోలు(క్రైం)సెప్టెంబరు 24 : సచివాలయం పోలీసులకు పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించి 51 మందిని బదిలీ చేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో మంగళవారం జరిగిన బదిలీల ప్రక్రియను ఏస్పీ ఏఆర్ దామోదర్ పర్యవేక్షించారు. ఈనెల 28న మెడికల్ క్యాంప్ కార్యక్రమాన్ని సచివాలయం పోలీసులు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏవో సులోచన పాల్గొన్నారు. అనంతరం పోలీసుపెరేడ్ గ్రౌండ్‌ను పరిశీలించి పిచ్చి మొక్కలను పీకించారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ఒంగోలు(క్రైం)సెప్టెంబరు 24 : హత్య కేసులో నిందితుడి రమావత్ యేసునాయక్‌పై నేరం రుజువైనందున జీవితఖైదు, వెయ్యి రూపాయల జరిమాన విధిస్తూ న్యాయమూర్తి డి.అమ్మనరాజ తీర్పు ఇచ్చారు. మంగళవారం స్థానిక అదనపు సెషన్స్ కోర్టులో సాక్ష్యాధారాలతో నిందితుడి పైనేరం నిరూపించడంతో న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు 2016 డిసెంబరు 3న మంగమూరు రోడ్డులోని సుబాబుల్ తోటలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఒంగోలు బాలజీరావుపేటలో నివాసం ఉండే మువ్వల వెంకటసుబ్బారావు మంగమూరు రోడ్డులో సెల్‌షాప్ నిర్వహిస్తున్నాడు. అతనికి ఆటోడ్రైవర్ రమావత్ యేసునాయక్‌తో పరిచయం ఉంది. ఆ రోజున సుబ్బారావు వద్ద పెద్ద మొత్తంలో నగదు ఉండటం చూసిన యేసునాయక్‌కు దురాశ కలిగి ఎలాగైనా కాజేయాలని పన్నాగం పన్నాడు. దీంతో యేసునాయక్ ఓ మహిళను గాలం వేసి మంగమూరు రోడ్డులో గల సుబాబుల్ తోటలోకి సుబ్బారావును తీసుకెళ్లాడు. అక్కడ విచక్షణారహితంగా కత్తితో దాడి చేసి హత్య చేశాడు. మృతుని వద్ద ఉన్న నగదు సెల్‌ఫోన్, సిమ్‌కార్డులు తీసుకొని పెట్రోలు పోసి మృతదేహాన్ని తగులబెట్టాడు. ఈ మేరకు సంతనూతలపాడు పోలీసులు కేసు నమోదు చేసి అప్పటి ఒంగోలు రూరల్ సీఐ మురళీకృష్ణ దర్యాప్తు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జాలా జోస్పిన్ వాదనలు వినిపించారు. నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధించారు.

విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలి

నాగులుప్పలపాడు సెప్టెంబరు 24 : ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని ఎస్సై బి. శ్రీకాంత్ సూచించారు. అమ్మనబ్రోలు గ్రామంలోని బాలికల గురుకుల పాఠశాలలో సైబర్ నేరాలు, బాలికల స్వీయ రక్షణపై ప్రిన్సిపల్ కె. మాధవి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ గద్దే మల్లయ్య, వైస్ ఛైర్మన్ జి. రమణయ్య, ఏటీపీ సీత పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలి

సంతనూతలపాడు, సెప్టెంబరు 24 : మండలంలోని అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జ్ డీపీవో ఉషారాణి తెలిపారు. మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం హౌసింగ్, వెలుగు, రెవెన్యూ తదితర శాఖలతో సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాఘవేంద్ర, హౌసింగ్ ఏఈ వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తహసీల్దార్ ఆదిలక్ష్మి, వెలుగు ఏపిఎం సుధాకర్, ఏపీవో వాసంతి పాల్గొన్నారు.

జిల్లాలో 17 మంది తహసీల్దార్లు బదిలీలు

నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన ఐదుగురికి పోస్టింగ్‌లు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 24 : జిల్లాలో ఎంపీడీవోలను బదిలీ చేస్తూ జిల్లా పరిషత్ సీఈవో మాధురి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో పనిచేస్తున్న 17 మందిని బదిలీ చేయగా నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన ఐదుగురు ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 56 మండలాలు ఉండగా మంగళవారం రాత్రి 22 మందికి పోస్టింగ్‌లు ఇవ్వగా మిగిలిన మండలాలకు బుధవారం బదిలీలు చేసే అవకాశం ఉంది.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పీ సుజాత	కొత్తపట్నం	పొన్నలూరు
పీ శ్రీకృష్ణ	పొదిలి	కొత్తపట్నం
కే స్వరూపారాణి	చినగంజాం	జెపంగులూరు
కే రాజశేఖర్‌రావు	గుడ్లూరు	ఒంగోలు
ఏ శ్రీనివాసమూర్తి	కొనకనమిట్ల	చినగంజాం
ఎస్ జగదీష్	అర్ధవీడు	మర్రిపూడి
బీ రామాంజనేయులు	జే పంగులూరు	కొండపి
వై శ్రీనివాసరావు	మద్దిపాడు	మార్టూరు
కే నేతాజీ	చీరాల	కారంచేడు
పీ రత్నజ్యోతి	టంగుటూరు కందుకూరు	
డీ నరసయ్య	కొమరోలు	అర్ధవీడు
ఆర్ దేవసేనకుమారి	అద్దంకి	టంగుటూరు
డీ జయమణి	నాగులుప్పలపాడు	సింగరాయకొండ
ఆర్ఎల్ రాజ్యలక్ష్మీ	ఇంకొల్లు	కొరిశపాడు
ఎంవీ రమణమూర్తి	కొండపి	జరుగుమల్లి
కే సుకుమకుమారి	దర్శి	బల్లికురవ
డీ సురేష్‌బాబు	కొరిశపాడు	సంతనూతలపాడు
వీ జ్యోతి	నెల్లూరు	మద్దిపాడు
జీ శ్రీనివాసరావు	నెల్లూరు	ఇంకొల్లు
ఎం రాజేష్‌బాబు	నెల్లూరు	వేటపాలెం
బీ సింగయ్య	నెల్లూరు	అద్దంకి
రంగసుబ్బరాయుడు	నెల్లూరు	హనుమంతునిపాడు

విత్తనశుద్ధి పాటిస్తే ఎంతో మేలు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు

నాగులుప్పలపాడు సెప్టెంబరు 24 : రైతులు పంటలు సాగు చేసే ముందుగా విత్తనశుద్ధి పాటించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్. శ్రీనివాసరావు సూచించారు. మద్దిరాలపాడు గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ రమేష్‌బాబు మాట్లాడుతూ ఈక్రాప్ ద్వారా రైతులు సాగు చేసిన పంటలను రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఆత్మ డిప్యూటి ప్రాజెక్ట్ డైరెక్టర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ విత్తన శుద్ధి ద్వారా ఎండుతెగులు రాకుండా ఉంటుందన్నారు. ఏవో వెంకట్రావు మాట్లాడుతూ శనగ పంటలో ఎండుతెగులును తట్టుకునే ఎన్‌బీఈజీ 452 రకం వంగడాలు కావాల్సిన రైతులు గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో పేర్లు నమోదు చేసుకొన్న వారికి సబ్సిడీపై అందజేయనున్నట్లు చెప్పారు. ఉద్యానవన శాఖ అధికారి ప్రత్యూష మాట్లాడుతూ పండ్లతోటల విస్తరణ పథకం ద్వారా 40 శాతం రాయితీపై పండ్ల మొక్కలు అందించనున్నట్లు తెలిపారు. పశు సంవర్ధకశాఖ అధికారి అనురాధ పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 24 : ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని వెంగముక్కలపాలెం, రూరల్ మండలంలోని గుండాయపాలెంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో మేయర్ గంగాడ సుజాత, వ్యవసాయశాఖ అధికారి కిషోర్‌బాబు, పశువైద్యాధికారి వై భూపాల్‌రెడ్డి, ఏఈవోలు రామకృష్ణారెడ్డి, ఆదిమూర్తి, నాగమణి, కేశవ పాల్గొన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఆయాగ్రామాల రైతులు పాల్గొన్నారు

అల్లూరు గ్రామంలో...

కొత్తపట్నం(ఒంగోలు నగరం)సెప్టెంబరు 24 : మండలంలోని అల్లూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మోహనరెడ్డి, పశు సంవర్ధక శాఖ అధికారి శోభ, మత్స్యశాఖ సహాయకులు ఆంజనేయులు, వ్యవసాయశాఖ సహాయకులు నాగలక్ష్మి పాల్గొన్నారు.

జనరంజక పాలనపై సర్వత్రా హర్షం

అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం : బీఎన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, సెప్టెంబరు 24 : అధికారం చేపట్టిన వందరోజుల్లోనే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న పాలన జనరంజకంగా ఉందంటూ సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ చెప్పారు. మండలంలోని బూసరపల్లిలో మంగళవారం సాయంత్రం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవరావు, తక్కెళ్లపాటి రమేష్, పుట్టా బ్రహ్మయ్య, కూనంనేని శ్రీనివాసరావు, కూనంనేని లోకేష్, సింగారెడ్డి, పాల్గొన్నారు.

చీమకుర్తి టౌన్‌లో..

చీమకుర్తి మున్సిపాల్టి పరిధిలోని ఒకటో వార్డులో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాట్రగడ్డ రమణయ్య, గంగుల శివ పార్వతి, ముప్పూరి చలమయ్యయడ్లపల్లి సురేష్, అధికారులు పాల్గొన్నారు. రాంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో కందిమళ్ల గంగాధరరావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

100 రోజుల పాలన ప్రగతిపై ప్రచారం

నాగులుప్పలపాడు సెప్టెంబరు 24 : తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు ముగిసిన సందర్భంగా చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని అమ్మనబ్రోలులో పదో క్లస్టర్ ఇన్‌చార్జి ఈదర వెంకటకృష్ణారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో సచివాలయ అధికారులతో కలసి ప్రభుత్వ వంద రోజుల ప్రగతిని వివరిస్తూ, కరపత్రాలను ఇంటింటికీ అందించారు. కార్యక్రమంలో బూత్ ఇన్ చార్జి రావిపాటి శ్రీనివాసరావు, ఐటీడీపీ గ్రామ అధ్యక్షుడు ఈదర బాలాదిత్య, కట్టా హనుమంతరావు, చుంచు రాజేంద్ర, ఈదర అమరనాథ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 24 : కూటమి ప్రభుత్వం రైతుల ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని నాయినిపల్లి ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్‌లోని విద్యుత్ మోటార్ల మరమ్మతులు అనంతరం మంగళవారం ఎమ్మెల్యే కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి రైతు వెన్నెముక అన్నారు. వ్యవసాయానికి సకాలంలో నీరిందించేందుకు చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రైతులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్మశానవాటిక పనుల పరిశీలన

కొత్తపేట పంచాయతీ పరిధిలోని హిందూ శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించేందుకు చేపట్టిన పనులను మంగళవారం ఎమ్మెల్యే కొండయ్య పరిశీలించారు. శ్మశానవాటికలో అన్ని సౌకర్యాలు కల్పించడంవల్ల ప్రశాంతంగా, ఆహ్లాదకరవాతావరణంలో జరుపుకోవచ్చన్నారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదం కలుషితం ధర్మ విరుద్ధం

ఇంకొల్లు, సెప్టెంబరు 24 : కోట్లాది మంది భక్తులు మహాప్రసాదంగా భావించే లడ్డూ ప్రసాదాన్ని కలుషితం చేసి జగన్ ధర్మ విరుద్ధ చర్యలకు పాల్పడ్డారని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ పెదపూడి విజయ కుమార్ అన్నారు. ఇంకొల్లులో ఆయన మాట్లాడుతూ లడ్డూ కల్తీ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జగన్ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి శంకరశెట్టి చిరంజీవి, జిల్లా కార్యక్రమాల నిర్వహణ విభాగం కార్యదర్శి సతీష్, ఇంకొల్లు, చినగంజాం, కారంచేడు మండల పార్టీ అధ్యక్షుడు నారిశెట్టి ప్రవీణ్,సందు శ్రీనివాసరావు, సాగిరి శ్రీనివాసరావు, నాయకులు పరుచూరి వెంకటేష్, చేబ్రోలు అనిల్, నరేష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పరిశీలన

అద్దంకి, సెప్టెంబరు 24 : ప్రభుత్వ స్థలంలో నుంచి వెంచర్‌కు వేసిన సీసీ రోడ్డును చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి పరిశీలించారు. అద్దంకి పట్టణంలోని ఆటోనగర్ సమీపంలో 19 సర్వే నెంబరు నుంచి వెంచర్‌కు సీసీ రోడ్డు వేసినట్లు ఫిర్యాదులు అందడంతో ఆర్డీవో మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ భూమిని మున్సిపాలిటీకి కేటాయించగా, అందులో నుంచి సీసీ రోడ్డు వేసినట్లు గుర్తించారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ నుంచి నివేదిక కోరనున్నట్లు తెలిపారు.



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఆర్డీవో

అర్జీల పరిశీలన : తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలకు సంబంధించి 14 మంది అర్జీలను ఇచ్చారు. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

వంద రోజుల్లో..

రూ.కోట్ల అభివృద్ధి పనులు చేశాం

- ప్రతి గ్రామానికి పింఛన్ గతంలో కన్నా రెట్టింపు వస్తున్నాయి
- ఒంగోలు డెయిరీని ప్రారంభిస్తాం
- 1 నుంచి గ్రామసభలు
- బోగస్ పింఛన్లు తొలగిస్తాం
- బోగస్‌కు బాధ్యులైన అధికారులపై చర్యలు

పొన్నలూరు (కొండపి), సెప్టెంబరు24 : ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జిల్లాలో జరిగాయన్నారు. ఒక్క కొండపి నియోజకవర్గంలోనే వంద కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరిగాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని చౌటపాలెం గ్రామంలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కోట్లాది రూపాయల అభివృద్ధి పనులతోపాటు ప్రతి గ్రామానికి సంక్షేమ కార్యక్రమంలో భాగంగా పింఛన్ డబ్బులు రెట్టింపై గ్రామాలకు వస్తున్నాయన్నారు. చౌటపాలెం గ్రామానికి గత ప్రభుత్వంలో మొత్తం పింఛన్‌దారులు 297 మంది ఉంటే 6 లక్షల రూపాయలు వచ్చేవని, ఇపుడు 13 లక్షల రూపాయలు పింఛన్‌దారులకు వస్తున్నాయని అన్నారు. ఇది చాలదా? అని మంత్రి అన్నారు. వచ్చేనెల 1 నుంచి గ్రామ సభలు నిర్వహిస్తామని, బోగస్ పింఛన్లు తొలగిస్తా మన్నారు. బోగస్ పింఛన్లు ఇచ్చేందుకు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సంక్రాంతి నుంచి కాలనీ ఇళ్ల లబ్ధిదారులకు 4 లక్షల రూపాయలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్ల హామీ అమలులోకి వస్తుందన్నారు. మహిళలు కొందరు గ్రామంలో ప్రభుత్వ పాలకేంద్రం ఏర్పాటు చేయాలని కోరగా, త్వరలో ఒంగోలు డెయిరీని కూడా తెరిపించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ కొండపి నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు, పార్టీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, నాయకులు మండవ ప్రసాద్, కర్లా కోటిరెడ్డి, అనుమోలు సుధాకర్, గ్రామ నాయకులు వున్నం బాలకోటయ్య, చెన్నారెడ్డి వెంకటరావు, చెన్నారెడ్డి భరత్‌కుమార్ పాల్గొన్నారు.



చౌటపాలెంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి స్వామి

కాలనీవాసుల సమస్యలు పరిష్కరిస్తా

పొన్నలూరు : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చౌటపాలెం ఎస్సీ కాలనీలో మంత్రి స్వామి మంగళవారం పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీకి వాటర్ ట్యాంకు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ పుల్లారావుకు సూచించారు. కాలనీవాసులకు ఇళ్లస్థలాలు ఇస్తామని మంత్రి హామీనిచ్చారు. కాలనీలో సిమెంటు రోడ్లు, సైడు కాల్వలు నిర్మిస్తామని తెలిపారు. కాలనీలో రోడ్లపైన ఉన్న చెత్త, మురుగును తొలగించి తనకు ఫొటో పెట్టాలని ఈవోఆర్డీని మంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు.



బాణసంచా కాల్చుతున్న టీడీపీ కార్యకర్తలు



సత్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న రామా గోపీ, ఈదర ప్రభాకర్

తెలుగు తమ్ముళ్ల సంబరాలు

సత్య, నూకసానికి పదవుల పట్ల హర్షం

సింగరాయకొండ, సెప్టెంబరు 24 : టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య మారిటైం బోర్డు చైర్మన్‌గా, టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులవడంతో మండలంలో తెలుగు తమ్ముళ్ల సంబరాలు చేసుకున్నారు. మంగళవారం వారికి పదవులు ప్రకటించిన వెంటనే స్థానిక కందుకూరు రోడ్డు కూడలిలో బాణసంచా కాల్చి హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, ప్రధాన కార్యదర్శి చీమకుర్తి కృష్ణ, నేతలు షేక్ సంధానీబాషా, కూనపరెడ్డి సుబ్బారావు, గాంధీ చౌదరి, ఇమ్మిడిశెట్టి రామారావు, సుదర్శి చంటి, గుదే వెంకటేశ్వర్లు, మించల బ్రహ్మయ్య, గాలి హరిబాబు, నక్కా బ్రహ్మేశ్వరరావు, యస్థాని, సనావుల్లా, కళ్లగుంట నరసింహ, పసుపులేటి శేషారావు, కాకా శ్రీను, మేకల అంకమరావు, శంకర్ పాల్గొన్నారు.

టంగుటూరులో...

టంగుటూరు : దామచర్ల సత్యకు పదవి రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ టీడీపీ నాయకుడు మొలకలపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సంబరాలు చేసుకున్నాయి. అక్కడ బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

సత్యకు మంత్రి, పలువురు నేతల శుభాకాంక్షలు

దామచర్ల సత్యను ఒంగోలులోని ఆయన స్వగృహంలో మంత్రి స్వామి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టంగుటూరు మండలానికి చెందిన పలువురు నేతలు కూడా సత్యను కలిసి శుభాకాంక్షలు చెప్పారు. వారిలో టంగుటూరు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, పార్టీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ నాయకుడు దామచర్ల శ్రీధర్, కామని శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచ్ మక్కెన కోటేశ్వరరావు, యజమాని, పెద్దోడు, ఉమామహేశ్వరరావు, కుందేటి వెంకట్రావు, రామా గోపి, ఈదర ప్రభాకర్, మక్కెన వెంకట్రావు, మొలకలపల్లి శ్రీనివాసరావు, దాసరి సుబ్బారావు ఉన్నారు. సత్య తల్లిదండ్రులు దామచర్ల విజయలక్ష్మి, పూర్ణచంద్రరావు ఆశీర్వదించారు.



తల్లిదండ్రుల ఆశీర్వచనాల నడుమ సత్య

సత్యకు అభినందనల వెల్లువ

కొండపి : ఏపీ మారిటైమ్ చైర్మన్‌గా ఎంపికైన టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్యను మంగళవారం సాయంత్రం ఒంగోలులోని సత్య నివాసంలో కలిసి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. మంత్రితోపాటు కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, పొన్నలూరు మాజీ ఎంపీపీ కె. శ్రీనివాసరావు, మండల నాయకులు బత్తుల నారాయణస్వామి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, చాగంరెడ్డి కృష్ణారెడ్డి, దామా మురళి, మారెడ్డి సుబ్బారెడ్డి, పోటు శ్రీనివాసరావు, గుండపనేని రామ్మూర్తి నాయుడు పాల్గొన్నారు.



టీడీపీ సీనియర్ నాయకులతో కలిసి సత్యకు బొకేను ఇస్తున్న మంత్రి డాక్టర్ స్వామి

తెలుగు తమ్ముళ్ల సంబరాలు... సత్యకు ఏపీ పోర్టులు, హార్బర్ల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా పదవి ఇచ్చినందుకు కొండపి, పొన్నలూరు, జరుగుమల్లి మండలాల్లో తెలుగు తమ్ముళ్లు సంబరాలు నిర్వహించారు. మంగళవారం సాయంత్ర బాణా సంచా కాల్చి స్వీట్లు పంచారు. కేక్ కట్‌చేసి పంచారు.

అంచెలంచెలుగా ఎదిగిన నూకసాని

సింగరాయకొండ, సెప్టెంబరు 24 : టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ నూకసాని బాలాజీ అంచెలంచెలుగా ఎదిగారు. మండలంలోని బింగినపల్లిలో నూకసాని కోటయ్య-కామేశ్వరమ్మ దంపతులకు బాలాజీ జన్మించారు. వీరిది రైతు కుటుంబం. నూకసాని ప్రాథమిక విద్యను స్వగ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదివారు. హైస్కూల్ విద్యను పొరుగు గ్రామమైన ఊళ్లపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్తిచేశారు. ఇంటర్, డిగ్రీ కావలి జవహర్ భారతి కళాశాలలో, పీజీని ఎస్వీయూ పీజీ సెంటర్‌లో పూర్తిచేశారు. ఆ సమయంలో విద్యార్థి నాయకుడిగా చురుకుగా పనిచేసేవారు. ఆ తరువాత తిరుపతి ఎస్వీయూలో ఎంఏ ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ పొందారు. అనంతరం హైదరాబాద్‌లో డీఆర్‌డీఏలో కొంతకాలం పనిచేశారు. ఆ తరువాత ఉద్యోగానికి స్వస్తి చెప్పి స్వగ్రామానికి తిరిగి వచ్చారు. సింగరాయకొండలో ప్రైవేట్ జూనియర్ కళాశాలను ఏర్పాటుచేసి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు బోధించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి సింగరాయకొండ మండలంలో క్రియాశీలకంగా వ్యవహరించేవారు. అప్పటి కొండపి ఎమ్మెల్యే, మంత్రి దామచర్ల ఆంజనేయులతో సన్నిహితంగా మెలుగుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఉద్యానవన పాలకమండలి సభ్యుడిగా, యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. మరలా టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నూకసాని పార్టీకి చేసిన సేవలను అధినాయకత్వం గుర్తించి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించింది. బాలాజీకి రాష్ట్రస్థాయి పదవి రావడం పట్ల బలహీనవర్గాల ప్రజలు, బింగినపల్లి గ్రామస్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



సమాజసేవలో కళాకారులది ముఖ్యపాత్ర

- ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్
- విజయవాడ వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 24 : సమాజం పట్ల కళాకారులకు ఎంతో బాధ్యత ఉందని, అనేక సందర్భాలలో కళాకారులు నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమాలు అనిర్వచనీయమని శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ చెప్పారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో అఖిల ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం మంగళవారంరాత్రి ఏర్పాటుచేసిన కళారూపాల ప్రదర్శన కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సంఘ ఉపాధ్యక్షురాలు బోను దుర్గ ఆధ్వర్యంలో జరిగిన సభలో దామచర్ల మాట్లాడుతూ కళాకారులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. త్వరలో ఎన్టీఆర్ కళాక్షేత్రాన్ని అందుబాటులోకి తెస్తానని చెప్పారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త, నగర కళాకారుల సంక్షేమ సంఘ గౌరవాధ్యక్షులు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ కళాకారుల సమస్యలు తెలిసిన వ్యక్తి దామచర్ల అని తెలిపారు. నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ కళాకారులు, సాహితీవేత్తలు అనుకూలమైన ప్రభుత్వం ఉందన్నారు. తొలుత రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన కళాకారులతో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రదర్శించిన స్వరఝరి సాంస్కృతిక సేవా సంస్థచే సంగీత విభావరి, శాస్త్రీయ నృత్యం, గంటా మంగాదేవి సత్యహరిశ్చంద్ర ప్రదర్శన, గయోపాఖ్యాన ఘట్టం ప్రదర్శన, చింతామణి నాటకం నుంచి కొన్ని సన్నివేశాలు, మిమిక్రీ, ఇంద్రజాల ప్రదర్శన, లవకుశ నాటక ప్రదర్శన మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నాటక అకాడమి మాజీ డైరెక్టర్ ధేనువకొండ వెంకట సుబ్బారావు, పౌరాణిక నటులు పాల్గొన్నారు.



విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి



సీతారామయ్య (ఫైల్)

టంగుటూరు, సెప్టెంబరు 24 : టంగుటూరులోని కాలేజీ రోడ్డులో నివాసం ఉండే విశ్రాంత ఉపాధ్యాయుడు డి.సీతారామయ్య (81) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన 1965లో పసుకుదురులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయు డిగా విధుల్లో చేరారు. అనంతరం పలు గ్రామాల్లో పనిచేశారు. 2001లో రావివారిపాలెం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులున్నారు. సీతారామయ్య భౌతికకాయాన్ని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మండల గౌరవాధ్యక్షుడు చక్కా రాజేశ్వరరావు, అధ్యక్షుడు శిఖా ఇజ్రాయెల్, కోశాధికారి తలారి ఏసురత్నం, విశ్రాంత ఉపాధ్యాయుల సంఘ సభ్యులు కావలి శ్రీనివాసులు, హనుమంతరావు, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, ప్రసాదరావు, రమణయ్య సందర్శించి నివాళులర్పించారు.



రైతులు పట్టుకున్న అడవిజింక

కొత్తపట్నం పంట పొలాల్లో అడవిజింక

కొత్తపట్నం (ఒంగోలు నగరం), సెప్టెంబరు 24 : కొత్తపట్నంలోని రెడ్డిపాలెం పంట పొలాల్లో తిరుగుతున్న అడవిజింకను రైతులు మంగళవారం పట్టుకున్నారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అధికారులు వచ్చి జింకను స్వాధీనం చేసుకున్నారు. సమీపంలో ఎక్కడా అడవులు లేకపోవటం, జింక ఎక్కడ నుంచి తప్పించుకుని వచ్చిందో కూడా తెలియటం లేదని రైతులు అంటున్నారు.

పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌పై సమీక్ష

సంతనూతలపాడు, సెప్టెంబరు 24 : పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌పై తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి, తన కార్యాలయంలో రాజకీయనాయకులు, బీఎల్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల స్థితిగతులు, దెబ్బతిన్న భవనాలు, వసతులు, గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రాలు తెలపాలని, పోలింగ్ కేంద్రంలో 1500 ఓట్లకంటే ఎక్కువ ఉండరాదని ఆమె చెప్పారు.

సమాచారహక్కు చట్టంపై అవగాహన

సంతనూతలపాడు, సెప్టెంబరు 24 : మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం రైతులకు, అధికారులు సమాచారహక్కుచట్టం 2005పై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయాధికారి పి.పావని అవగాహన కల్పించారు. అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉదేశపూర్వకంగా పౌరులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవేంద్ర, జడ్పీటీసీ డి.రమణమ్మ, ఉద్యానవనశాఖ, వ్యవసాయశాఖ, మండలపరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతా హి సేవ

నాగులుప్పలపాడు సెప్టెంబరు 24 : జనశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో రాపర్ల రైల్వేస్టేషన్ వద్ద స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కుట్టుశిక్షణ నేర్చుకుంటున్న మహిళలు ప్రయాణికుల విశ్రాంతి భవనం, పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్రోగ్రాం అధికారి హరికృష్ణ, కోఆర్డినేటర్ కేవీ శివకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

వలేటివారిపాలెంలో కల్యాణ మండపం నిర్మిస్తా

ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(రూరల్), సెప్టెంబరు 24 : వలేటివారి పాలెంలో కల్యాణ మండపం నిర్మిస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చెప్పారు. ఒంగోలు మండలం వలేటివారి పాలెంలో మంగళవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామపరిధిలోని శ్మశానం అభివృద్ధితోపాటు ప్రహరీ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. వలేటివారిపాలెం, దశరాజుపల్లి గ్రామాల మధ్య ముదిగుండి వాగుపై వంతెన నిర్మించి తారురోడ్డు నిర్మిస్తానన్నారు. ఎమ్మెల్యేతోపాటు జడ్పీ మాజీ చైర్మన్ నూకసాని బాలాజీ, ఏఎంసీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, కరవది పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పోలవరపు వెంకటరామయ్య ఉన్నారు.



మాట్లాడుతున్న జయంత్‌బాబు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

టంగుటూరు, సెప్టెంబరు 24 : రైతులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు సూచించారు. మండల కేంద్రమైన టంగుటూరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన సర్పంచ్ మద్దిరాల మమత, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, టీడీపీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం జయంత్‌బాబు మాట్లాడుతూ రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలను పాటించి లాభాలు ఆర్జించాలని కోరారు. మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతుల కోసం అమలు చేస్తున్న ప్రతి పథకం వారికి అందేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తొలుత భూసార పరీక్ష, పంట సాగు హక్కు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి జి.స్వర్ణమంజరి, వెటర్నరీ వైద్యురాలు విజయమాధవి, మత్స్యశాఖ అధికారి రవికుమార్, విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణ, గ్రామ వ్యవసాయ సహాయకులు శృతి, షేక్ జహీర్, ఎస్.ప్రభాకరరావు పాల్గొన్నారు.





తురిమెళ్లలో మాట్లాడతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, పెదనాగులవరంలో ఇంటింటికి కరపత్రాలు అందజేస్తున్న కందుల నారాయణరెడ్డి, ఐటీవరంలో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

- పలు గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం'
- అభివృద్ధిని వివరించిన ఎమ్మెల్యేలు
- హాజరైన టీడీపీ శ్రేణులు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కంభం, సెప్టెంబరు 24 : రాష్ట్రంలో గ్రామాలను అభివృద్ధి చేయడమే ఎన్‌డీఏ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు కంభం మండలం తురిమెళ్ల పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజావేదికలో పాల్గొన్నారు. అంతకుముందు ఆయన రైతుసేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాటి వైసీపీ పాలనలో పంచాయతీల అభివృద్ధిని గాలికి వదిలివేసి సర్పంచ్ అధికారాలను నిర్వీర్యం చేశారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లిన దాఖలాలు లేవన్నారు. తన పాలన కాలమంతా ప్రజలను వేధించడమే లక్ష్యంగా పెట్టుకున్న జగన్ రాష్ట్రంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టలేదన్నారు. రాక్షస పాలనను అంతమొందించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 100 రోజుల్లోనే ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పింఛన్లు రూ.3 వేల నుంచి రూ.4వేలకు పెంచామన్నారు. ఉద్యోగులకు ప్రతి నెల ఒకటి తేదీనే జీతాలు వేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, సర్పంచ్ మాదా సుభద్ర, మాజీ సర్పంచ్ నారిశెట్టి వీరమ్మ, టీడీపీ మండల నాయకులు తోట శ్రీనివాసులు, కేతం శ్రీనివాసులు, ఎస్సీసెల్ రాష్ట్ర నాయకులు గోన చెన్నకేశవులు, మహిళ అధ్యక్షురాలు మహాలక్ష్మి, రైతు అధ్యక్షులు శ్రీనివాసులు, మండల ప్రత్యేకాధికారి సైమన్‌విక్టర్, ఎంపీడీవో మస్తాన్‌వలి, తహసీల్దార్ కిరణ్, పంచాయతీరాజ్ డీఈ సుబ్బారెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకులు బాలాజీనాయక్, తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : ప్రజా సంక్షేమం అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని పెద్ద నాగులవరం గ్రామంలో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజులలోనే 16 వేల ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టిందన్నారు. పెద్దనాగులవరం గ్రామంలో 40 లక్షల రూపాయలతో అభివృద్ధి పనుచేసేందుకు ప్రతిపాదనలు పంపిచామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జవ్వాజి రామాంజులరెడ్డి, మాలపాటి వెంకటరెడ్డి, కాకర్ల శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో అబ్దుల్ ఖాదర్, వెలుగు ఏపీఎం రమేష్‌బాబు, పంచాయితీ కార్యదర్శి అభిద్ హుస్సేన్, పెద్ద నాగులవరం టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

పొదిలి : ప్రజా సంక్షేమమే రాష్ట్రప్రభుత్వ ధ్యేయమని నగరపంచాయతీ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక నాలుగవ సచివాలయంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని వాటిని ప్రతి గ్రామంలో సచివాలయ సిబ్బంది ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మండలంలో ఎక్కడైనా ప్రజలకు ఏ అవ సరం వచ్చినా సిబ్బంది పరిష్కరించాలన్నారు. అదేవిధం గా పట్టణంలో ఏదైనా సమస్య ఉంటే వెంటనే తెలియజే యాలన్నారు. ప్రభుత్వ పథకాలను సిబ్బంది ఎప్పటి కప్పుడు ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావ్, టీడీపీ మండల అధ్యక్షుడు మీగడ ఓబులరెడ్డి, పట్టణాధ్యక్షుడు ఖుద్దూస్, జిల్లా ముస్లిం మైనారిటీ నాయకులు రసూల్, టీడీపీ నాయకులు ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీనివాసులు, జలాని భాష, దివ్వెల మురళీ పాల్గొన్నారు.

కొమరోలు : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే టీడీపీ పలు హామీలను నెరవేర్చిందని పలువురు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పుల్లారెడ్డిపల్లి, చింతలపల్లి గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, నరసింహులు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వృద్ధులకు, దివ్యాంగులకు ఒంటరి మహిళలకు పాత బకాయిలతో కలిపి రూ.7వేలు ఇచ్చిన ఘనత మన చంద్రబాబుదేన్ననారు. ప్రజలకు సేవలు అందించే ప్రభుత్వ ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు ఒకటవ తేదీన జీతాలు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రేపల్లి వెంకట నరసయ్య, జాను, షోడా జయరామిరెడ్డి, సీమాన్, కూరాకు అశోక్, పంచాయతీ కార్యాదర్శులు బడేమియా, సిబ్బంది పాల్గొన్నారు.

పుల్లలచెరువు : గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసి గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యం అని వై.పాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మంగళవారం పుల్లలచెరువు మండలంలోని ఐటీ.వరం గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' 100 రోజుల పాలనపై సమావేశం నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామంలో ఇంటింటికి వెళ్లి పథకాల తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధికి రూ.15 కోట్లతో సీసీ రోడ్డులు మంజూరయ్యాయన్నారు. గ్రామాల్లో రోడ్లను సుందరముగా తీర్చిదిద్దాలని అన్నారు. దీపావళి కనుకగా ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి ఉచితంగా గ్యాస్ సిలిండరు ఇస్తారని అన్నారు. వచ్చే నెల నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేస్తారని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఒక వ్యవస్థగా ఆదర్శవంతంగా పాలన సాగిస్తోందన్నారు. కష్టకాలంలో ఉన్న ఆంధ్రకు చంద్రబాబు అనుభవం పనికి వచ్చిందన్నారు. వచ్చే 5 ఏళ్లలో చంద్రబాబునాయుడు నిరంతరం పనిచేసి రాష్ట్రంలో పరిశ్రమలు, అనేక ఐటీ కంపెనీలు తీసుకొచ్చి లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని అన్నారు కార్యక్రమంలో డీఎల్‌డీవో సాయికుమార్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షులు పయ్యావుల ప్రసాద్, టీడీపీ ముఖ్య నాయకులు కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగా నారాయణ రెడ్డి, పోట్ల గోవిందు, గజ్వేల్లి భాస్కర్, ఉప్పల హనుమంతు, శామ్యూల్, జనసేన మండలాధ్యక్షుడు అచ్చయ్య, మన్నెయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతల అగ్రహారంలో ఇది మంచి ప్రభుత్వం

పెద్దదోర్నాల, సెప్టెంబరు 24: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు ఆదేశాల మేరకు మండలంలోని చింతల అగ్రహారం గ్రామంలో మంగళవారం నిర్వహించారు. క్లస్టర్ 8, 41 ఇన్‌చార్జులు షేక్ మాబు, ఈదర మల్లయ్య ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో నిర్వహించిన ప్రగతిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. గోడలకు స్టిక్కర్లు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్యాల వెంకటేశ్వరరెడ్డి, చల్లా కాశీరావు, నలబోతుల వెంకటేశ్వర్లు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం : ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తోందని, మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు అన్నారు. స్థానిక 35వ వార్డులో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. వందరోజుల పాలనలో ప్రభుత్వం ప్రజలకు అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అంతేకాక ఇంటింటికి 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్లను మున్సిపాలిటీ, సచివాలయం సిబ్బంది అంటించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాలి కొండయ్య, టీడీపీ యువ నాయకులు కందుల విఘ్నేష్ రెడ్డి, రోహిత్‌రెడ్డి, చిలకపాటి చిన్నవెంకటచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



దోర్నాల మండలంలో టీడీపీ నాయకుల ప్రచారం

మెరుగైన వైద్య సేవలందించాలి

- మార్కాపురం సబ్ కలెక్టర్ త్రివినాగ్



వైద్యశాలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

పెద్దదోర్నాల, సెప్టెంబరు 24: రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. వైద్యశాలలోని చిన్నపిల్లల వార్డు, ఎక్స్‌రేగది, వైద్యశాల పరిసరాలు నిశితంగా పరిశీలించారు. వైద్యసేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా? అని రోగులను అడిగారు. వైద్యశాలలో నీటి కొరత ఉందని, ఎక్స్‌రే ప్లాంటు, కంటి పరీక్షలకు అవసరమయ్యే వస్తుసామగ్రి తదితర అంశాలను సూపరింటెండెంట్ నాగమహేశ్వరి సబ్‌కలెక్టర్ త్రివినాగ్ దృష్టికి తెచ్చారు. అనంతరం త్రివినాగ్ ఎంపీడీవో నాసర్‌రెడ్డిని పిలిచి నీటి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. అదేవిధంగా పరిసరాలలో చెత్తాచెదారంతో పాటు చిన్న చిన్న గడ్డి మొక్కలు తొలగించి శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించాలని ఆదేశించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సంజీవ్, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీల పక్షపాతి చంద్రబాబునాయుడు

పొదిలి, సెప్టెంబరు 24 : బీసీల పక్షపాతి చంద్రబాబునాయుడని బీసీ సంఘ నాయకుడు బత్తుల వెంకటేష్ యాదవ్ అన్నారు. మంగళవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీకి నామినేటెడ్ పదవుల్లో స్థానం కల్పించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీలకోసం నిరంతరం కృషి చేసే వ్యక్తి చంద్రబాబునాయుడన్నారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు సముచితస్థానం కల్పించడం శుభపరిణామమన్నారు. టీడీపీకోసం ఐదేళ్లగా నిరంతరం కృషిచేస్తున్న నూకసాని బాలాజీని గుర్తించి ఏపీ టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. అంతే కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 90శాతం స్థానాలు వారికే కేటాయించారన్నారు. ప్రతి కార్యకర్తకు భరోసా ఇస్తూ టీడీపీ విజయానికి తనదైన ముద్ర వేసుకున్నారని చెప్పారు. నూకసాని బాలాజీకి ఇంతటి ఉన్నతమైన పదవి బాధ్యతను ఇచ్చినందుకు చంద్రబాబునాయుడికి, లోకేష్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు యాదవసంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ఉల్లిపాయల లోడ్ లారీ బోల్తా

- స్తంభించిన ట్రాఫిక్

గిద్దలూరుటౌన్, సెప్టెంబరు 24 : నల్లమల ఘాట్ రోడ్డులోని బొగదా వద్ద మంగళవారం తెల్లవారుజామున ఉల్లిపాయలలోడు లారీ రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. దీంతో ఇరువైపులా ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించింది. లారీ బోల్తా సమయంలో లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. రోడ్డుప్రమాద ఘటన గురించి తెలుసుకున్న సీఐ సురేష్ ఆ ప్రాంతానికి చేరుకుని రోడ్డుకు అడ్డంగా పడిన లారీని తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. సుమారు 7 గంటలపాటు లారీ రోడ్డుపై పడి ఉండడంతో నంద్యాల వైపు నుంచి, గిద్దలూరు వైపు నుండి వెళ్లే వాహనాలు అటూ ఇటూ భారీగా నిలిచిపోయాయి.

గౌస్‌కు సన్మానం

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 24: కొవిడ్ సమయంలో తిరుపతిలో 1600 మందికి పైగా అనాథ మృతదేహాలకు వారి ఆచారాల ప్రకారం సామూహిక అంతిమ సంస్కారాలు నిర్వహించిన గౌస్‌ను జేఐహెచ్ (జమాతే ఇస్లాం హింద్) నాయకులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో జేఐహెచ్ నాయకులు సికిందర్, మహబూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈగా లక్ష్మణ్‌నాయక్

పొదిలి, సెప్టెంబరు 24 : పొదిలి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈగా లక్ష్మణ్‌నాయక్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఉదయగిరి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో పొదిలికి వచ్చారు.. మండలంలో తాగునీటి సమస్య ఉందని అందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

కిట్స్ విద్యార్థుల స్వచ్ఛత హి సేవ

పెద్దారవీడు, సెప్టెంబరు 24: కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెన్నా కృష్ణారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో దేవరాజుగట్టు గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణ, పోలీస్‌స్టేషన్ ఆవరణ, కళాశాల ఆవరణలలో చెత్తను తొలగించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అన్నా రంగనాయకులు ఏవో ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్యం

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



పోటీలకు హాజరైన క్రీడాకారులు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 24: ఆటలతో ఆరోగ్యం చేకూరుతుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్‌ఐ నియోజకవర్గస్థాయి ఆటల పోటీల ఎంపికలు మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల మానసిక శారీరక వికాసానికి ఎంతగానో తోడ్పడతాయన్నారు. క్రీడలలో పాల్గొనడం ద్వారా అన్ని విధాలా పరిపూర్ణ వ్యక్తిత్వం అలవడుతుందన్నారు. మొదటి రోజు 500 మంది బాలబాలికలు అండర్ 14, 17 విభాగంలో పాల్గొన్నారని ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి జాహ్నవి ప్రియ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు రాందాస్ నాయక్, తుంబేటి శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ హెచ్ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆటలలో సాయి బాలాజీ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన సాయిబాలాజీ విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం మండల స్థాయిలో జరిగిన ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో శ్రీసాయి బాలాజీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రకాశ్‌రావు, ప్రిన్సిపాల్ సయ్యద్ మస్తాన్ వలిలు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడలకు ఎంపిక

గిద్దలూరు : రాచర్లలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీలలో ప్రతిభ కనపరచిన వెంకటేశ్వర్లు, తిరుమలేసు, రంగస్వామి, పవన్ అనే నలుగురు విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రమణరెడ్డి తెలిపి వారిని అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



పి.లక్ష్మీ


మార్కాపురం వన్ టౌన్ : మార్కాపురంలోని జెడ్పీ బాలికల పాఠశా లలో చదువుతున్న విద్యార్థినులు రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక య్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించి ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి మాట్లాడారు. సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన చెస్ పోటీలలో తమ పాఠశాలకు చెందిన పి.లక్ష్మీ, కె.నాగభార్గవీ లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.



కె.నాగభార్గవి

వ్యవసాయాన్ని లాభసాటిగా మారుద్దాం

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారుల సూచన



పొదిలిలో కందిపంటను పరిశీలిస్తున్న అధికారులు

గిద్దలూరు, సెప్టెంబరు 24 : వ్యవసాయం శాస్త్రీయ పద్ధతులు అవలంభించి లాభసాటిగా మారుద్దామని ఏవో విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని సంజీవరాయునిపేట, కొత్తపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగుపై చర్చ, ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచార పరిజ్ఞానాన్ని రైతులకు అందించడం, వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో అధిక ఉత్పత్తి, నికర ఆదాయం దిశగా రైతులను ప్రోత్సహిస్తు న్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్ సర్పంచ్ బుడత ఓబులమ్మ, ఉద్యానవన శాఖాధికారి విష్ణుప్రియ, పశువైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్, పట్టు పరిశ్రమ శాఖాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పొదిలి : రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రతి మంగళవారం, బుధవారాల్లో రెండు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏవో జైన్‌లుబ్దీన్ తెలిపారు. పొలంబడి కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ అధికారులు పాల్గొంటారన్నారు. పశుసంవర్థక, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొని అమలౌతున్న పథకాలు వివరిస్తారన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో టార్పాలీన్ పట్టలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

తర్లుపాడు : వరి పంటపై సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని తాడివారిపల్లె, మీర్జపేటలో పొలం పిలుస్తోంది. కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరిపంటపై ఉన్న ఆకు ముడత తెగులును గుర్తిం చామన్నారు. దీని నివారణకు జింక్ 2 గ్రాములు, సిలిఢెడ్ జింక్ సల్ఫేట్‌ను లీటర్ నీటిలో కలిపి ఐదురోజుల వ్యవధిలో పంటకు రెండు సార్లు పిచికారి చేయాలన్నారు. పశు వైద్యాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, రాయితీపై రైతులకు గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం పశువులకు గాలికుంటు, గొంతవాపు వ్యాధులకు టీకాలు వేయిస్తున్నట్లు తెలిపారు.

పొలం పిలుస్తోంది ప్రారంభం

పెద్దారవీడు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం పెద్దారవీడు రైతు భరోసా కేంద్రంలో ప్రారంభించారు. ఎంపీడీవో రాజ్‌కుమార్, టీడీపీ నాయకులు గొట్టం శ్రీనివాసరెడ్డి, ఏవో బుజ్జిబాయ్‌లు పొలం పిలుస్తోంది కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యాక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ బాలూనాయక్, వీఏఏలు ఆదిలక్ష్మి, లాలూనాయక్, రైతులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : కూటమి ప్రభుత్వంలో అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని నాయుడుపల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అధికారులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ నియోజవర్గ అభివృద్ధికోసం శాయ శక్తులా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏవో దేవిష్ట్ల శ్రీనివాసులు, ఉద్యాన అధికారి రమేష్ టీడీపీ నాయకులు జవ్వాజి రామాంజులరెడ్డి, కాకర్ల శ్రీనివాసులు, మాలపాటి వెంకటరెడ్డి, తాళ్ళపల్లి సత్యనారాయణ, నాయుడుపల్లి టిడిపి నాయకులు రైతులు పాల్గొన్నారు.

రాయితీపై గడ్డిజొన్నలు పంపిణీ

కొమరోలు : రైతులకు నూరుశాతం రాయితీపై గడ్డిజొన్న విత్తనాలను అందిస్తున్నామని ఏవో రాజశ్రీ తెలిపారు. మండలంలోని రాజుపాలెం, తాతిరెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యాక్రమంలో భాగంగా రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యాక్రమంలో ఉద్యానశాఖ అధికారి విష్ణు ప్రియ, పశుసంవర్ధకశాఖాధికారి పాలుగుళ్ళ మోహన్‌రెడ్డి, పాల్గొన్నారు.

బేస్తవారపేట : మండలంలోని జగ్గంబొట్ల కృష్ణాపురం, చెట్టిచెర్ల గ్రామంలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయాధికారి జక్కం మేర్సీ ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి పశువుల యూనిట్ 90 శాతం రాయితీపై ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మల్బరీ షేడ్‌లకు రైతులకు తగిన రాయతీలున్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి జక్కం మేర్సీజడ్‌పీటీసీ బండ్లమూడి వెంకటరాజయ్యసర్పంచ్‌లు కె.వెంకటలక్ష్మమ్మ,పి.కృష్ణారెడ్డి, సిబ్బంది ఎన్.గణేష్,షేక్.జుబేర్,డి.నాయబ్‌రసూల్,డి.రవితేజ,ఎ.వి.రంగారెడ్డి,వై.సి.హెచ్.శేషగిరి తదితరులు పాల్గొన్నారు. దోర్నాల త్రిపురాంతకం మండలాల్లోనూ కార్యక్రమం నిర్వహించారు.

అవీ..ఇవీ..

అరుణాచలం వరకు రైలును పొడిగించాలి

గిద్దలూరు, సెప్టెంబరు 24 : గుంటూరు నుంచి గిద్దలూరు మీదుగా తిరుపతికి వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలును అరుణాచలం వరకు పొడిగించాలని స్థానిక ప్రయాణికులు, భక్తులు కోరుతున్నారు. తిరుపతి వెళ్లి వచ్చే భక్తులకు ఈ రైలు ఎంతో సౌకర్యవంతంగా ఉన్నప్పటికీ తిరుపతికి వెళ్లి అక్కడి నుంచి అరుణాచలం వెళ్లాలంటే మరో రైలు మారాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రతి రోజు తెల్లవారుజామున 4 గంటల సమయానికి తిరుపతి చేరుతున్న రైలు, అదే రోజు సాయంత్రం తిరుగు ప్రయాణం అయ్యేంత వరకు అక్కడే ఉంటుంది కావున ఈ రైలును అరుణాచలం వరకు పొడిగిస్తే జిల్లాలోని మార్కాపురం, గిద్దలూరు ప్రాంతాల వారికి నేరుగా అరుణాచలం వెళ్లే అవకాశం ఉంటుందని భక్తులు కోరుతున్నారు. తద్వారా రైల్వేకు ఆదాయం వస్తుందని పేర్కొంటున్నారు.

అన్న క్యాంటీన్ తనిఖీ



అన్నక్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

గిద్దలూరు, సెప్టెంబరు 24 : పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం టిఫిన్ సమయంలో అన్నక్యాంటీన్ వద్దకు వచ్చి ఆహార పదార్థాలను పరిశీలించారు. అన్ని సమయాలలో అన్న క్యాంటీన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు.

పాఠశాలలో డీఈవో తనిఖీ

పొదిలి, సెప్టెంబరు 24 : స్థానిక జిల్లా ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న మెనూను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనాన్ని రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. గుడ్లు కొంతమంది విదార్థులు తినకపోవడాన్ని ఆమె గమనించారు. వారు తినేవిధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారంతోపాటు, విద్యను అందించాలన్నారు. అనంతరం వివిధ రికార్డులను పరిశీలించారు. ఈమె వెంట కనిగిరి, ఒంగోలు డివిజన్ ఉపవిద్యాశాఖ అధికారి చంద్రమౌళీశ్వర్, సాహు సుబ్బారావు, మండల విద్యాశాఖ అధికారి ఎం శ్రీనివాసరెడ్డి, సీఆర్పీలు ఉన్నారు.

త్రిపురాంతక క్షేత్రంలో ఎరిక్షన్‌బాబు పూజలు

త్రిపురాంతకం, సెప్టెంబరు 24: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీబాలాత్రిపుర సుందరీ దేవి అమ్మవారి ఆలయంలో ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుల స్వాగత అనంతరం ఆలయ ప్రదక్షిణలు, చినమస్తాదేవికి పూజలు చేశారు. అనంతరం బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి అర్చనలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు ఎరిక్షన్‌బాబుకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అక్టోబరు 3 నుంచి ఆలయంలో జరుగనున్న దసరా నవరాత్రులపై ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, అర్చకులు ప్రసాదశర్మ, విశ్వం, స్థానిక నాయకులు ఎం.శ్రీనివాస రెడ్డి తదితరులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

వెలిగొండను పూర్తి చేయాలని మంత్రికి వినతి



మంత్రి లోకేష్‌తో కృష్ణారావు

మార్కాపురం, సెప్టెంబరు 24: పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి పశ్చిమ ప్రకాశాన్ని సస్యశ్యామలం చేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పీవీ కృష్ణారావు సోమవారం రాత్రి రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసిన కృష్ణారావు పశ్చిమ ప్రకాశంలో నెలకొన్న సమస్యలను తెలియజేశారు. ప్రధానంగా వెలిగొండను పూర్తి చేస్తే కరవుకు శాశ్వత పరిష్కారం కల్పించినట్లే అన్నారు. అదేవిధంగా గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో సకాలంలో ప్రారంభంకాని మెడికల్ కళాశాలను కూడా త్వరగా పూర్తి చేయాలని కోరారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలను పశ్చిమానికి తీసుకురావాల్సి ఉందని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి నారా లోకేష్ అన్ని సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు కృష్ణారావు తెలిపారు.

జనసేన నాయకుల ప్రాయశ్చిత్త దీక్ష



దీక్షకు హాజరైన జనసేన నాయకులు

మార్కాపురం వన్ టౌన్, సెప్టెంబరు 24: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆ పార్టీ నాయకులు దీక్ష చేపట్టారు. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలల దీక్ష కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కాన్షీరాంసింగ్, కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం



విరాళాన్ని అందజేస్తున్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు

గిద్దలూరుటౌన్, సెప్టెంబరు 24 : ఇటీవల వరద ముంపునకు గురైన విజయవాడకు స్థానిక రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు విరాళాన్ని అందించారు. మంగళవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని కలిసి విజయవాడ వరద బాధితుల సహాయార్థం రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు రూ.70వేల చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణ కోసం సేవలను అందించి ఉద్యోగ విరమణ తరువాత కూడా స్థానికంగా, రాష్ట్రంలో ప్రజలకు సమస్య వచ్చిన వెంటనే ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు జీసీ.అంకన్న, ఎం.కోటిరెడ్డి, ఎస్.వేణుగోపాల్, మానం వెంకటరెడ్డి, సీ.హెచ్.లక్ష్మన్‌బాబు, బి.ఎన్.ప్రసాద్, ఓ.శ్రీనివాసులు, కె.వి.వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసులు, పుల్లయ్య, శివారెడ్డి, శేఖర్ తదితరులు ఉన్నారు.

అన్నా క్యాంటీన్‌కు రూ.20116లు విరాళం

పట్టణంలోని అన్నాక్యాంటీన్ నిర్వహణకు మీనాక్షి ఇటుకల బట్టీ యజమాని అనప వెంకటేశ్వర్లు రూ.20116 విరాళాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి మంళవారం అందజేశారు. ప్రభుత్వం చేపట్టిన అన్నాక్యాంటీన్ లాంటి మంచి కార్యక్రమానికి విరాళాన్ని అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గురాలమల్లి, యాసం వెంకటేశ్వర్లు, చంద్ర శివ, టీడీపీ నాయకులు కమతం శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.లక్ష వితరణ

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 24: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ప్రభుత్వం చేపడుతున్న సహాయ చర్యలకు ఊతంగా పట్టణానికి చెందిన శ్రీ సాధన విద్యాసంస్థలు లక్ష రూపాయల వితరణను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి మంగళవారం అందించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ జీఎల్ రమేష్‌బాబు, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ కె. మధుసూధన్, టి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


దామచర్ల సత్యను అభినందిస్తున్న దొనకొండ టీడీపీ నాయకులు

దామచర్ల సత్యను అభినందించిన టీడీపీ నేతలు

దొనకొండ, సెప్టెంబరు 24: రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్‌గా ఎంపికైన దామచర్ల సత్యను టీడీపీ మండల నాయకులు అభినందించారు. మంగళ వారం కామేపల్లి చెంచయ్య, వల్లపునేని వెంకటస్వామి, తాండ్ర వెంకటేశ్వర్లు, సింగమనేని హనుమంతు తదితరులు సత్యను కలిసి అభినందించారు. టీడీ పీ అభివృద్ధికి అహర్నిశలు చేసిన కృషిని గుర్తించిన అధినేత, సీఎం చంద్రబా బు కీలకమైన పోస్టు సత్యకు కేటాయించటం హర్షనీయమని వారు పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ఆనంద్

దర్శి, సెప్టెంబరు 24: దర్శి పట్టణానికి చెందిన విద్యార్థి ఇత్తడి ఆనంద్ జయకుమార్ జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. విశాఖపట్టణంలో ఈనెల 21, 22 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చిన ఆనంద్‌కుమార్ జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈసందర్భంగా ఆనంద్‌ను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తే చర్యలు

పామూరు, సెప్టెంబరు 24: పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ టి.అశోక్‌బాబు హెచ్చరించారు. పట్టణంలో స్థానిక మ మ్మీడాడీ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యపై ఆటోవాలాలకు పలు సూచనలు చేశారు. రోడ్డు మార్జిన్‌ల్లో ఎక్కడబడితే అక్కడ వాహనాలు నిలపరాదని హెచ్చరించారు. రోడ్డుప్రక్కన ఫ్రూట్స్ బండ్లు పెట్టి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించరాదన్నారు. ఆటో డ్రైవర్లందరూ లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు.

అర్హులందరికీ పక్కా గృహాలు


మాట్లాడుతున్న ఎంపీడీవో జనార్దన్, పక్కన తహసీల్దార్ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు, సెప్టెంబరు 24 : మండలంలో అర్హులైన నిరుపేదలందరికీ పక్కా గృహాలు మంజూరు చేయటం జరుగుతుందని ఎంపీడీవో ఆర్.జనార్దన్ అన్నారు. మంగళవారం మన ఇల్లు, మన గౌరవం కార్యక్రమంలో భాగంగా గృహ నిర్మాణ శాఖ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఇళ్ళు మంజూరై వివిధ కారణాలతో నిర్మించుకోని వారి జాబితాను తయారుచేసినట్టు చెప్పారు. లబ్ధిదారులు ముందుకు వచ్చినట్లయితే వారందరికీ గృహాలు నిర్మించటం జరుగుతుందన్నారు. గ్రామాల్లో సభలు నిర్వహించి అర్హులైన పేదల నుంచి అర్జీలు స్వీకరించి పక్కా గృహాలు మంజూరు చేయటం జరుగుతుందన్నారు. గృహ నిర్మాణ శాఖ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు గ్రామాలకు వెళ్ళి సర్వే చేయాలన్నారు. అలా చేసినట్లయితే పేదల జాబితా వస్తుందన్నారు. ఈనెలాఖరుకల్లా కార్యక్రమం పూర్తిచేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, హౌసింగ్ ఏఈ హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నూకసాని బాలాజీని అభినందించిన టీడీపీ నేతలు

తాళ్లూరు, సెప్టెంబరు 24: టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ ఆంధ్రప్రదేశ్ టూరిజం డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులు కావడంపట్ల తాళ్లూరు మండల తెలుగు తమ్ముళ్లు అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నూకసాని తన వంతు తోడ్పాటు నందించారన్నారు. పార్టీ అభ్యున్నతి కోసం కష్టపడిన బాలాజీని గుర్తించి సీఎం కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించటం అభినందనీయమన్నారు. అభినందనలు తెలిపినవారిలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, శాగం కొండారెడ్డి, మానం రమేష్‌బాబు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, పిన్నిక రమేష్‌బాబు, గొల్లపూడి వేణు బాబు, ఐ.శ్రీనివాసరెడ్డి, కోనేటి వెంకట్రావు, మాగంటి శ్రీను తదితరులు ఉన్నారు.

ముండ్లమూరు: రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన నూకసాని బాలాజీని మంగళవారం మాజీ జెడ్పీటీసీ కొక్కెర నాగరాజు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మట్టా సుబ్బారెడ్డి, పలు గ్రామాల నాయకులు కలిసి సన్మానించారు. బాలాజీకి సముచిత స్థానం కల్పించిన సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మారెళ్ళ హైస్కూల్ ఎస్ఎంసీ ఛైర్మన్ పూరిమెట్ల యల్లయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును కమ్మేసిన చిల్లచెట్లు తొలగింపు


తాళ్లూరు-విఠలాపురం మార్గంలో చిల్లచెట్లు తొలగింపజేస్తున్న ఎస్సై మల్లికార్జునరావు

తాళ్లూరు, సెప్టెంబరు 24: తాళ్లూరు- విఠలాపురం మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగి ప్రమాదకరంగా ఉన్న చిల్లచెట్లను ఎస్సై ఎస్.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో మంగళవారం తొలగించారు. రోడ్డు సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా ఎస్సై చిల్లచెట్లు తొలగింపజేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ఆమార్గంలో ఇరువైపులా ఏపుగా పెరిగిన చిల్లచెట్లతో నిత్యం వాహనచోదకులు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఎస్సై స్పందించారు. ఎక్స్‌కవేటర్‌తో ప్రమాదకరంగా ఉన్న చిట్లచెట్లను తొలగింపచేశారు. ఈసందర్భంగా పలువురు ఎస్సై మల్లికార్జునరావును అభినందించారు.

అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తే చర్యలు


పోలవరంలో ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్


ముండ్లమూరు, సెప్టెంబరు 24: మండలంలోని పోలవరం పంచాయతీతో పాటు ఇతర గ్రామాల్లో రైతుల భూములతో పాటు వాగులు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం పోలవరం సమీపంలోని ఇసుక రీచ్‌ని ఆయన పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. రైతుల భూములు కొనుగోలుచేసి ఇసుక తవ్వకాలు జరపటం కూడా చట్టరీత్యా నేరమన్నారు. జిల్లా మైనింగ్ శాఖ అధికారుల అనుమతి తప్పనిసరిగా పొందాలన్నారు. పోలవరం, చిలకలేరు వాగు, తమ్మలూరు, వేములబండ, చింతలపూడి, మారెళ్ళ సమీప ప్రాంతాల నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించినా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కేవలం ప్రజల అవసరాలకు మాత్రమే ఇసుకను తరలించవచ్చునని చెప్పారు. వ్యాపారం చేస్తే మాత్రం అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా గ్రామాల్లోని వీఆర్‌వోలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంట ఆర్‌ఐ ప్రసాద్, వీఆర్‌వో జాన్‌లిపి ఉన్నారు.

జూదరుల అరెస్ట్

పీసీపల్లి, సెప్టెంబరు 24: పేకాట ఆడుతున్న నలుగురిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ కోటయ్య తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని జి.లింగన్నపాలెం పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో దాడిచేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని రూ. 48,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

శిథిలావస్థలో ఓవర్‌హెడ్ ట్యాంకులు

- కాలంచెల్లి తరచూ పగులుతున్న పైపులైన్లు
- నిత్యం చెడిపోతున్న మోటార్లు
- తాగునీటి సరఫరాకు తీవ్ర ఇబ్బందులు


కూలేదశకు చేరిన ఎన్ఏపీ ఓవర్‌హెడ్ ట్యాంకు

దర్శి, సెప్టెంబరు 24: దర్శి నియోజకవర్గంలో తాగునీటి ప్రాజెక్టులు అస్తవ్యస్తంగా మారాయి. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో ఐదు సంవత్సరాలుగా ఎలాంటి మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ఓవర్‌హెడ్ ట్యాంకులు కూలేదశకు చేరాయి. కాలంచెల్లిన పైపులైన్లు తరచూ పగిలిపోతూ తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మోటార్లు నిత్యం చెడిపోతూ ఇబ్బంది పెడుతున్నాయి. దీంతో అనేక గ్రామాలకు మంచినీరు సక్రమంగా అందటం లేదు.

దర్శి ఎన్ఏపీ రక్షిత మంచినీటి పథకం కింద 120 గ్రామాలకు మంచినీరు సరఫరా కావాల్సి ఉంది. సుమారు 40 సంవత్సరాల క్రితం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకులు, పైపులైన్లు, విద్యుత్ మోటార్లు శిథిలావస్థకు చేరాయి. అనేక సంవత్సరాలుగా రక్షిత మంచినీటి పథకం అభివృద్ధి పనులకు నోచుకోలేదు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ళల్లో కనీస మరమ్మతులకు కూడా నిధులు విడుదల చేయలేదు. దీంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అధికారులు అనేకసార్లు నిధుల కోసం ప్రతిపాదనలు పంపినప్పటికీ వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకున్న నాథుడు లేడు. కనీసం ఫిల్టర్లు కూడా సక్రమంగా లేక రా వాటర్ విడుదల చేస్తున్నారు.


దెబ్బతిన్న పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన రక్షిత మంచినీటి పథకాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటారని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మంచినీటి పథకాల అభివృద్ధికి నిధుల విడుదల చేయాలని ప్రభుత్వానికి వివరాలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. వీలైనంత త్వరగా నిధులు విడుదల చేసి తాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి చేసి అన్ని గ్రామాలకు సక్రమంగా మంచినీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

రైల్వే లైన్ నిర్మాణంతో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా


గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి, సెప్టెంబరు 24: నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైను నిర్మాణంతో కనిగిరి శివారు శంఖవరం, పేరంగుడిపల్లి గ్రామస్థులకు మైనింగ్‌కు ఏర్పడిన సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో కలసి ఆయా గ్రామాల ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు. పట్టణ సమీపంలోని రైల్వేపనులతో పేరంగుడిపల్లిలో ఏడు గృహాలను తొలగించాల్సి వస్తుందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇదేసమయంలో ఆయా గృహాలకు చెందినవారు తమ ఇబ్బందులను వివరించారు. ఎంతో వెచ్చించి గృహాలు నిర్మించుకున్నామని, వాటిని తొలగిస్తే రోడ్డును పడాల్సి వస్తుందని వాపో యారు. కలెక్టర్ స్పందిస్తూ ఇళ్ళకు తగిన నష్టపరిహారం అందిస్తామని చెప్పారు. ప్రత్యామ్నాయంగా నివాస స్థలాలు కూడా మంజూరు చేస్తామ ని హామీ ఇచ్చారు. రైల్వే లైను నిర్మాణంతో మైనింగ్ ప్రాంతానికి వెళ్లేందు కు దారి సమస్యగా మారుతుందని క్వారీ యజమాలను చెప్పటంతో ఆయా ప్రాంతాలను కలెక్టర్ సందర్శించారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అందరికి ఆమోద యో గ్యంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

అక్రమ వెంచర్లను పరిశీలించిన కలెక్టర్

కనిగిరి - పామూరు రోడ్డులోని ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో అనుమతులు, కన్వర్షన్‌లు లేకుండా వేసిన వెంచర్లను కలెక్టర్ అన్సారియా పరిశీలించారు. ఆయా భూముల్లో ఉన్న కట్టడాలను పరిశీలించారు. ఆయా ప్రాంతంలో అసైన్డ్ భూములను కొనుగోలు చేసి వ్యవసాయేతర భూములుగా మార్చి 60 ఎకరాల్లో వెంచర్లు వేసినట్లు ఆర్డీవో జాన్‌ఇర్విన్ కలెక్టర్‌కు చెప్పారు.

వాటిని ప్రభుత్వానికి అవసరమైన విధంగా మార్చుకునేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆర్డీను ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, టీడీపీ నాయకులు నారపరెడ్డి(యడవల్లి) శ్రీనివాసులరెడ్డి, బాలు ఓబులురెడ్డి, గాయం తిరుపతిరెడ్డి, తహసీల్దార్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలి

- 'పొలం పిలుస్తోంది'లో వ్యవసాయాధికారుల సూచనలు


పీసీపల్లి: కంది పైరును పరిశీలిస్తున్న ఏడీఏ వెంకటరమణ తదితరులు

పీసీపల్లి, సెప్టెంబరు 24: ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ ఈవీ వెంకటరమణ అన్నారు. మండల వ్యవసాయాధికారి షారూఖ్ ఆధ్వర్యంలో మంగళవారం పీసీపల్లి, చినవరిమడుగు రైతుసేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కంది పైరును ఏడీఏ పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. .ఈక్రాప్ చేయించుకున్న ప్రతి రైతు నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో పుల్లయ్య, వీఏఏలు మనోహర్, విజయ్, ఓంకారం, రామయ్య, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

దర్శి: వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ బాలాజీనాయక్ సూచించారు మంగళవారం మండలంలోని బొట్లపాలెం, పోతకమూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పొలాలను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట విస్తరణ పథకం కింద పండ్ల తోటలకు 40శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందించనున్నట్టు చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో బాలకృష్ణ నాయక్, ఉద్యాన అధికారి ఎం.రవివెంకన్నబాబు, పశువైద్యాధికారి డాక్టర్ బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సు కోసమే 'పొలం పిలుస్తోంది'

దొనకొండ: రైతుల శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని ఆరవల్లిపాడులో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన అధికారులను క్షేత్రస్థాయిలో పొలాల్లోనే రైతులకు సూచనలుచేసే వినూత్న కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు ప్రవేశ పెట్టారన్నారు. వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడు తూ పత్తిపంట ఎక్కువగా సాగు చేస్తున్న గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభించినట్టు చెప్పారు. మైక్రో ఇరిగేషన్ అధికారి కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు 90 శాతం, ఐదు ఎకరాల పైబడి ఉన్న రైతులకు 70 శాతం రాయితీపై స్ప్రింకర్లు అందిస్తున్నట్లు చెప్పారు. అవసరమైనవారు రైతు సేవా కేంద్రాల్లో వారి వివరాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

పామూరు: పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏవో కె.రాధ రైతులకు సూచిం చారు. మంగళవారం మండలంలోని దూబగుంట, నుచ్చుపొద గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగులో ఉన్న పైర్లను పరిశీలించి రైతులకు పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌వో కుసుమ, వెటర్నరీ, అగ్రికల్చరర్ అసిస్టెంట్‌లు మాలకొండమ్మ, బి.అవినాష్, రాగిపాటి రమే ష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



కొండారెడ్డిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

హనుమంతునిపాడు(కనిగిరి), సెప్టెంబరు 24: ప్రజా మన్ననలను పొందేలా పాలన సాగించటమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మంగళవారం హెచ్‌ఎంపాడు మండలంలోని కొండారెడ్డిపల్లిలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి ప్రాంతాన్ని విద్య, వైద్యరంగంలో ముందుంచాలన్నదే తన సంకల్పమన్నారు. అందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వాధికారులు, సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. తమ గ్రామానికి కరెంటు సమస్య వస్తే పలికే నాథుడే కరువయ్యారని ఎమ్మెల్యేకు తెలిపారు. దీనిపై సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులు సమాధానం చెప్పాలన్నారు. ఏఈ కార్యక్రమానికి గైర్హాజరవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈ, లైన్‌మన్‌ను సస్పెండ్ చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎంపీడీవో లలిత, ఎంఈవో పెద్దిరాజు, టీడీపీ నాయకులు మురహరి నరసయ్య, గాయం రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, వెంకటసుబ్బారెడ్డి, కుందురు నారాయణరెడ్డి, శ్యామల చినవెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ సమస్యలపై ఎమ్మెల్యే వినతిపత్రాలు అందజేశారు.

ఆవులమందలో ఫ్లెక్సీల చింపివేత


గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

కురిచేడు, సెప్టెంబరు 24: కురిచేడు మండలం ఆవులమంద గ్రామంలో సోమవారం రాత్రి టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి వంద రోజుల పాలనపై మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన రెండు వర్గాల నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. సభ జరిగే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఒక వర్గానికి చెందిన ఫ్లెక్సీలను చింపారు. ఆలస్యంగా గమనించిన పార్టీ వారు ఈ విషయాన్ని వెంటనే లక్ష్మి దృష్టికి తీసుకెళ్ళారు. ఆందోళన పడవద్దని పోలీసులతో విచారణ చేయిస్తానని చెప్పి ఆగ్రహం తగ్గించే ప్రయత్నం చేశారు. అదేరోజు రాత్రి గ్రామంలోని మరో వర్గం వారి ఫ్లెక్సీలను సైతం గుర్తు తెలియని వ్యక్తులు చింపివేశారు. మంగళవారం త్రిపురాంతకం సీఐ హసన్, ఎస్‌ఐ శివలు గ్రామానికి వెళ్ళి ఇరువర్గాలతో మాట్లాడారు. విచారణ చేసి దోషులను పట్టుకుంటామని సర్దిచెప్పారు. తెలుగుదేశం పార్టీ నాయకులు సైతం ఇరువర్గాల నాయకులతో మాట్లాడారు. ఎవరూ ఆగ్రహావేశాలకు గురికావద్దని చెప్పారు.


పెద్దన్నపల్లి గ్రామంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

పీసీపల్లిలో భారీ వర్షం

పీసీపల్లి, సెప్టెంబరు 24: పీసీపల్లి మండలంలో మంగళవారం ఉదయం భారీ వర్షం కురిసింది. గత నాలుగు రోజులుగా ఎండతీవ్రతకు ప్రజలు ఉక్క పోతకు గురయ్యారు. మంగళవారం ఉదయం ఐదు నుంచి 6.30 గంటల వరకు వర్షం కురిసింది. 67.2మి.మీ వర్షపాతం నమోదైంది. కొండప్రాంతంలో కురిసిన వర్షానికి కొండవాగు ఉధృతంగా ప్రవహించింది. మండలంలోని పలు గ్రామాల్లో కుంటలు, చెక్‌డ్యాంలకు నీరు చేరడంతో జలకళను సంతరించుకు న్నాయి. పెద్దన్నపల్లి కుంట ఒరవ పూడికతో మేటవేయడంతో నీరు కుంటకు చేరే మార్గం లేక గ్రామంలోకి వచ్చాయి. అంతర్గత రోడ్లు జలమయమయ్యా యి. ఈ వర్షంతో కంది, మిరప పైర్లకు మేలు చేకూరింది.

జనసేనలోకి జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి?



తాళ్లూరు, సెప్టెంబరు 23: వైసీపీ కీలక నేత, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి జనసేన పార్టీలో చేరనున్నట్టు తెలిసింది. మాజీ మంత్రి బాలినేనితో పాటు ఈనెల 26న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సమక్షంలో చేరనున్నట్టు తెలిసింది. వెంకటరెడ్డి తండ్రి వెంకటసుబ్బారెడ్డి కాంగ్రెస్‌లో పలు కీలక పదవులు నిర్వహించాడు. మారం వెంకటరెడ్డి మొదటినుంచి మాజీమంత్రి బాలినేనిశ్రీనివాసరెడ్డి ప్రధానఅనుచరుడిగా కాంగ్రెస్‌లో కీలకంగా వ్యవహరించారు. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో వివిధ కీలక పదవులు నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేశాడు. 2014, 2022 ఎన్నిక ల్లో వరుసగా రెండు పర్యాయాలు వైసీపీ తరుపున తాళ్లూరు జడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. వెంకటరెడ్డితో పాటు బెల్లంకొండవారిపాలెం సర్పంచ్ పోశం సుమలత, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు జనసేనలో చేరనున్నట్టు తెలిసింది.

పలువురు అధికారుల బదిలీలు

తాళ్లూరు, సెప్టెంబరు 24: మండలంలోని పలుశాఖల అధికారులు బదిలీ అయ్యారు. ఎంపీడీవో కేవై యుగకీర్తిని గుంటూరు జిల్లాకు, తహసీల్దార్ పి.సింగారావును బాపట్ల జిల్లాకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరుజిల్లా నుంచి జిల్లాకు అలాటైన కె.నాగలక్ష్మిని తాళ్లూరు తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న అడ్మినిస్ట్రేటివ్ అధికారి వజ్జాశ్రీనివాసరావును చీమకుర్తి ఎంపీడీవో కార్యాలయానికి బదిలీచేశారు. ఆయన స్థానంలో ఒంగోలు జడ్పీలో పనిచేస్తున్న అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎస్.సత్యంను తాళ్లూరు ఎంపీడీవో కార్యాలయానికి బదిలీ చేశారు.

నకిలీ ఓట్లను తొలగించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ రజనీకుమారి

కురిచేడు, సెప్టెంబరు 24: మండలంలో నకిలీ ఓట్లను తొలగించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు తహసీల్దార్‌కు సూచించారు. ఓటర్ల నమోదు, తొలగింపులపై మంగళవారం అన్ని పార్టీల నాయకులతో తహసీల్దార్ రజనీకుమారి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు పలు సూచనలు చేశారు. రెండు ఓట్లు ఉన్నవారిని, మరణించిన వారి ఓట్లు తొలగించాలన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఆటువంటి వారి వివరాలు తెలియజేస్తే వెంటనే తొలగిస్తామని చెప్పారు. బీఎల్వోలు ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తారని, వారికి సహకరించాలని కోరారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పిడతల నెమిలయ్య, కాట్రాజు నాగరాజు, పఠాన్ రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం


ముండ్లమూరు, సెప్టెంబరు 24: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందారని ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మట్టా సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మారెళ్ళలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా కూడా పేద ప్రజలకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలబెట్టుకున్నారన్నారు. రైతులకు సంబంధించి టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేశారని చెప్పారు. వృద్ధులకు పెన్షన్ పెంచి ప్రతినెలా ఒకటో తేదీనే అందజేస్తూ సీఎం చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో హనుమంతరావు, పూరిమెట్ల యల్లయ్య, సత్యనారాయణ, గార్లపాటి కృష్ణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే 'సంక్షేమం'

పామూరు, సెప్టెంబరు 24: రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలుచేస్తుందని రాష్ట్ర విభిన్న ప్రతిభావంతు ల కమిటీ ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి అన్నారు. మంగళ వారం మండలంలోని బొట్లగూడూరులో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వం ఏర్పడి వందరోజు ల్లో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ఇంటి గోడలకు స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో కోటపాటి రాము, అనపర్తి శశి, కోటపాటి రాజా, కమ్మ నరసింహం, కాకర్ల మధు, దేవరపు చలపతి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దూబగుంటలో ఉగ్ర పర్యటన

పామూరు, సెప్టెంబరు 24: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా వంద రోజుల పాలనపై జరుగుతున్న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం బుధవారం దూబగుంట గ్రామంలో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో బి.సురేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రన రసింహారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. ఈసందర్భంగా గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని తెలిపారు.





నందం అబద్ధయ్య



పిల్లి మాణిక్యాలరావు

జడ్పీ బదిలీల్లో.. ఇష్టారాజ్యం

- వైసీపీకి అనుకూల ఉద్యోగులకు ప్రాధాన్యం
- ఎమ్మెల్యేల సిఫార్సులను పట్టించుకోని వైనం
- ఉనికిలో లేని జీవోల ఆధారంగా ఏవోల తిష్ఠ
- నరేంద్రకు వ్యతిరేకంగా పనిచేసిన అధికారికి అందలం
- 'నిమ్మగడ్డ'కు ఓటు ఇవ్వని వారికి పెదకాకాని పోస్టింగ్
- సీటుకు రేటు కట్టి మరీ వసూలు చేసిన ఓ అధికారి
- ఓ ఉద్యోగితో నగదు వసూలు చేయించినట్లు ఆరోపణలు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 24: వైసీపీ అనుకూల ఉద్యోగులకు అందలం.. అడిగినంత ఇచ్చిన వారికి ప్రాధాన్యం.. ఎమ్మెల్యేల సిఫార్సులకు దక్కని గౌరవం.. ఇదీ తాజాగా ఉమ్మడి గుంటూరు జడ్పీలో జరిగిన బదిలీల వ్యవహారం. బదిలీల్లో నిబంధనలకు తిలోదకాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. కింది స్థాయి ఉద్యోగిని మధ్యవర్తిగా ఉంచి భారీగా నగదు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. చివరకు టీడీపీ ఓటమి కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తులకు ప్రధాన కార్యాలయంలో పోస్టింగ్‌లపై సర్వత్రా విస్మయం వ్యక్తమౌతుంది. కొందరు ఎమ్మెల్యేలు ఇచ్చిన సిఫార్సు లేఖలు బుట్టదాఖలు చేశారన్న విమర్శలున్నాయి. గోప్యంగా జరిగిన బదిలీల ప్రక్రియలో జాబితాలను మళ్లీమళ్లీ మార్చినట్లు సమాచారం. బదిలీల సమయంలో అప్పటివరకు దూరప్రాంతంలో పనిచేసిన ఉద్యోగులు, అధికారులు జిల్లా కేంద్రానికి దగ్గరకు రావడానికి ఇష్టపడతారు. జడ్పీ బదిలీల్లో మాత్రం అందుకు విరుద్ధంగా గడచిన ఐదేళ్ల నుంచి గుంటూరులో తిష్ఠ వేసిన వారికి మళ్లీ ఇక్కడే ఉండే అవకాశం దక్కింది. డిప్యూటీ సీఈవో కొందరు ఏవోల కోసం ఉనికిలో లేని జీవోలను బయటకు తెచ్చినట్లు చెబుతున్నారు. వాటి ఆధారంగానే నాడు వైసీపీకి కన్ను, కాళ్ళు, చెవుల్లా పని చేసిన వ్యక్తులను మళ్లీ అందలం ఎక్కించినట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో పెదాకాకాని ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న ఓ అధికారి టీడీపీ అభ్యర్థిగా ఉన్న ధూళిపాళ్ల నరేంద్రకు వ్యతిరేకంగా పనిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో నరేంద్ర కూడా సదరు అధికారిపై ఫిర్యాదు చేశారు. ఈ బదిలీ లో ఆయనను జడ్పీ ప్రధాన కార్యాలయానికి తీసుకువచ్చారు. అందుకోసం రూ.2 లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావుకు ఓటును ఓ తహసీల్దార్ తిరస్కరించారు. సదరు తహసీల్దారు భర్త జడ్పీలో ఏవోగా ఉన్నారు. ప్రస్తుత బదిలీలో ఆయనను జిల్లా కేంద్రానికి దగ్గరలోని పెదాకాకానికి మార్చారు. పెదాకాకానిలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఓ ఉద్యోగిని అక్కడే ఉంచమని ఎమ్మెల్యే నరేంద్ర



లేఖ ఇచ్చినా దానిని పట్టించుకోకుండా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పీఏగా పనిచేసిన వ్యక్తిని ఆ స్థానానికి బదిలీ చేశారు. పెదాకాకాని సీనియర్ అసిస్టెంట్ విషయంలోనూ అదే జరిగింది. సదరు ఉద్యోగి విభిన్న ప్రతిభావంతులైనా కనికరం లేని జడ్పీ అధికారులు ఎమ్మెల్యే లేఖను లెక్క చేయకుండా బదిలీ చేశారు. తాడికొండ ఎమ్మెల్యే ఫిరంగిపురంలో ఉన్న ఓ ఉద్యోగికి లేఖ ఇచ్చినా అమరావతికి పంపారు. ఎమ్మెల్యే నరేంద్ర సొంత గ్రామానికి చెందిన ఓ ల్యాబ్ అసిస్టెంట్‌ను కూడా ఇష్టానుసారంగా బదిలీ చేశారు. జడ్పీ కార్యాలయ ఏవోల బదిలీలకు సంబంధించి ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు ఇచ్చిన లేఖలకు సరైన ప్రాధాన్యం దక్కలేదని సమాచారం. ఆయన పరిధిలోని గుంటూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయానికి కూడా వైసీపీకి అనుకూలంగా ముద్ర పడిన ఓ అధికారిని బదిలీ చేశారు. ఈ పోస్టు కోసం ఎమ్మెల్యే ఇచ్చిన లేఖను బుట్టదాఖలు చేశారు.

ఏకాభిప్రాయంతో ఇచ్చినా పట్టించుకోలేదు..

జడ్పీ ఇన్‌చార్జి సీఈవోకు పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు పలుమార్లు ఫోన్ చేసి తొమ్మిది మంది ఏవోల బదిలీ విషయంలో కీలకమైన సూచనలు చేసినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యేలు మిగిలిన వారితో మాట్లాడి ఏకాభిప్రాయంతో ఓ జాబితా తయారు చేసి పంపారు. ఆ జాబితా కూడా ఇన్‌చార్జి సీఈవో పక్కన పెట్టేశారని బదిలీల జాబితాను చూస్తే అర్థమవుతుంది. ఓ సీనియర్ ఎమ్మెల్యే, లక్ష్మీనారాయణ అనే అధికారి కోసం ఫోన్ చేసినా ఆయనకు పోస్టింగ్ ఇవ్వలేదు. వైసీపీ భక్త బృందానికి ఆయా ప్రదేశాల్లో పోస్టింగ్ ఇచ్చేందుకు పలు కారణాలు చెప్పిన అధికారులు ఎమ్మెల్యేల మాటలను తుంగలో తొక్కేశారన్న విమర్శలున్నాయి.

ఎంత వస్తే అంత..

జడ్పీ బదిలీల వ్యహారమంతా అవినీతి మయమైందన్న ఆరోపణలున్నాయి. ప్రతి పోస్టుకి రేటు కట్టి వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. ఏవో పోస్టుకి ఒక రేటు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులకి మరో రేటు అన్న పద్ధతిలో బదిలీల ప్రక్రియ జరిగినట్లు సమాచారం. ఓ అధికారి వద్ద ఉన్న కింద స్థాయి ఉద్యోగి నగదు వసూలు చేసినట్లు తెలుస్తోంది. కొందరు ఉద్యోగులు ఈ సంభాషణలను ఆడియో, వీడియో రికార్డు కూడా చేసినట్లు తెలుస్తుంది. ఓ వ్యక్తి వద్ద బదిలీ కోసం రూ.3 లక్షలు పుచ్చుకున్నారని తెలిసింది. ఇదే ఉద్యోగి తాను పనిచేసే అధికారి పేరు చెప్పి చివరకు అటెండర్ల వద్ద కూడా రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. జడ్పీ చరిత్రలో బదిలీల వ్యవహారంలో ఎప్పుడూ జరగనంత గందరగోళం ఇప్పుడు జరిగినట్లు సమాచారం. వైసీపీకి అనుకూలం అన్న అధికారి ఈ బదిలీల్లో ప్రధాన పాత్ర పోషించడంతో మొత్తం ప్రక్రియ ఆరోపణలమయంగా మారింది.

పదవుల పండుగ

- ఉమ్మడి గుంటూరుకు ప్రాధాన్యం
- పోరాడిన వారికి అధిష్ఠానం గుర్తింపు
- పిల్లి మాణిక్యాలరావుకు లిడ్‌కాప్ చైర్మన్
- పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్‌గా అబద్ధయ్య

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం పలు కార్పొరేషన్ల పాలక మండళ్లను నియమించింది. తొలి విడతగా విడుదల చేసిన జాబితాలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన పలువురు నేతలు కీలక పదవులు పొందారు. కష్టకాలంలో పార్టీ కోసం పని చేసిన వారికి, సేవలందించిన వారికి అండగా నిలుస్తామని తాజా పదవుల ఎంపికతో చంద్రబాబు నేతల్లో భరోసా కల్పించారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావుకు లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(లిడ్‌కాప్) చైర్మన్, టీడీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్యకు ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా కూటమి ప్రభుత్వం ఎంపిక చేసింది. వీరితో పాటు పలువురు నేతలకు వివిధ కార్పొరేషన్లలో సభ్యులుగా కీలక బాధ్యతలు అప్పగించింది. ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ సభ్యులుగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన రాయపాటి శైలజ, మంగళగిరికి చెందిన తోట పార్థసారథి, తెనాలికి చెందిన కేశన కోటేశ్వరరావులకు అవకాశం కల్పించింది. రాయపాటి శైలజ అమరావతి ఉద్యమంలో మహిళా నేతగా కీలక భూమిక పోషించగా, పార్థసారథి, కోటేశ్వరరావులు మంగళగిరి, తెనాలిలో కీలక బాధ్యతలు నిర్వహించారు. పద్మశాలీ కార్పొరేషన్‌లో సభ్యులుగా మంగళగిరికి చెందిన కందుల నాగార్జున, పర్వతం మధుసూదనరావు, తెనాలికి చెందిన జొన్నాదుల మహేశ్వరరావు, తాడికొండకు చెందిన బిట్రా వెంకట శివనారాయణ నియమితులయ్యారు. జనసేన పార్టీలో చేనేత వికాస విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పర్వతం మధుసూదనరావు పని చేస్తున్నారు. ఏపీ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ సభ్యుడిగా యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామానికి చెందిన టీడీపీ నేత కుర్రా అప్పారావు నియమితులయ్యారు. ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులుగా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన దాసరి రాజా మాస్టారు, జనసేనకు చెందిన వడ్రాణం మార్కండేయబాబు నియమితులయ్యారు. దాసరి రాజా మాస్టారు గతంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

అలుపెరుగని పోరాటాలే వరం..

అలుపెరుగని పోరాటాలే నేడు పిల్లి మాణిక్యాలరావుకు వరాలుగా మారాయి. ఆయన పోరాటాలను గుర్తించిన చంద్రబాబు లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని అప్పగించి గౌరవించారు. ప్రకాశం జిల్లా చీరాల మండలం కారంచేడు గ్రామానికి చెందిన దళిత కుటుంబంలో జన్మించిన మాణిక్యాలరావు 1986లో జరిగిన కారంచేడు ఘటనలో బాధితుడు. మందకృష్ణ మాదిగతో కలిసి ఎంఆర్పీఎస్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన మొదలు ఈరోజు వరకూ 25 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమ చరిత్ర ఆయనది. ఉద్యమాన్ని ఎంతో ముందుకు తీసుకెళ్లిన క్రమంలో ఆయన ఎంఆర్‌పీఎస్‌కు జాతీయ అధ్యక్షుడి స్థానాన్ని సొంతం చేసుకున్నారు. కొన్ని అంతర్గత కారణాలతో రాజీనామా చేసిన మాణిక్యాలరావు 2017లో టీడీపీలో చేరారు. 2019లో రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. 2019 లో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బాధ్యతలు స్వీకరించిన నాటినుంచి తనదైన పోరాట పంథాలో ఆయన కొనసాగారు. ఏ చిన్న సమస్య వచ్చినా అక్కడ ప్రత్యక్షమై వైసీపీ ప్రభుత్వం మీద అలుపెరుగని పోరాటం చేశారు. అధికార ప్రతినిధి హోదాలో మీడియా చర్చల్లో తన వాణిని, పార్టీ వైఖరిని బలంగా వినిపిస్తూ వైసీపీ వైఫల్యాలను, దుర్మార్గాలను ప్రజల్లో ఎండగట్టారు. 2021 ఆగస్టు 15న గుంటూరు మంగళదాస్‌నగర్‌లో రమ్య అనే దళిత విద్యార్థిని హత్య ఘటనపై పోరాటం, పరామర్శకు వచ్చిన యువనేత లోకేశ్‌పై వైసీపీ మూకలు దాడికి పాల్పడినప్పుడు ధీటుగా ఎదుర్కొన్నారు. చంద్రబాబు, పట్టాభిపై దాడి, అరెస్టు సమయంలో ఉద్యమించారు. టీడీపీ నేతలను అరెస్టు చేసి గుంటూరులోని సీఐడీ ఆఫీసుకు తరలించిన సమయంలో అక్కడ ఆందోళనలు చేయడం, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం వంటి పోరాటాలకు నాయకత్వం వహించారు. 2024 ఎన్నికల్లో ఎస్సీ నియోజకవర్గమైన ప్రత్తిపాడు ఎమ్మెల్యే టికెట్ ఆశించగా అనూహ్య పరిణామాల నేపథ్యంలో ఆ సీటు విశ్రాంత ఐఏఎస్ బూర్ల రామాంజనేయులుకు దక్కింది. ఈ నేపథ్యంలో మాణిక్యాలరావుకు నామినేటెడ్ పదవిని అప్పగించి తగిన న్యాయం చేసింది.

అంకిత భావానికి గుర్తింపు

మంగళగిరి: టీడీపీ ఆవిర్భావం నుంచి అంకితభావంతో పార్టీనే అంటిపెట్టుకున్న నందం అబద్ధయ్యను ఏపీ పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి వరించింది. టీడీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త అబద్ధయ్య మంత్రి నారా లోకేశ్‌కు కుడి భుజంగా పనిచేస్తున్నారు. సౌమ్యుడు, వివాద రహితుడిగా పేరొందిన అబద్ధయ్యకు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల్లో తొలి ప్రాధాన్యం లభించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. చేనేత సామాజిక వర్గానికి చెందిన అబద్ధయ్య 1983లో టీడీపీ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి అంచలంచెలుగా ఎదిగారు. 1984 నుంచి 1994 వరకు 21వ వార్డు అధ్యక్షుడిగా పనిచేశారు. 1999 నుంచి మూడేళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా, 2005లో 24వ వార్డు టీడీపీ కౌన్సిలర్‌గా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. 2015 నుంచి 2021 వరకు ఉమ్మడి గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులుగా పని చేసిన ఆయన 2022 నుంచి మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా కొనసాగుతున్నారు. రాజకీయంగా ఎన్నో ఆటుపోట్లను చవిచూచిన అబద్ధయ్య 74 ఏళ్ల వయస్సులోనూ విలువలతో కూడిన రాజకీయ విధానాలను అవలంబిస్తూ యువతరానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు.



● రామాపురం, కఠారివారిపాలెం మధ్య సీఆర్‌జడ్ పరిధిలో పూర్తిస్థాయి అనుమతులు లేకుండా మొదలు పెట్టిన నిర్మాణం

తీరాన్ని చెరపడుతున్నారు

- సీఆర్‌జడ్ నిబంధనలు బేఖాతరు
- అనధికార నిర్మాణాలు అడ్డుకునేవారెవరు
- ప్రారంభ దశలో చూసీచూడనట్లుగా అధికారులు
- తర్వాత నిబంధనల పేరుతో అక్రమార్కులతో రాయబేరాలు



అధికారులు కన్నెత్తి చూడక పోవడంతో కొనసాగుతున్న నిర్మాణ పనులు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 24: సముద్ర తీరాన్ని అక్రమార్కులు చెరపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సీఆర్‌జడ్ పరిధిలోనే అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. చర్యలు చేపట్టాల్సిన అధికారులు ప్రారంభ దశలో మిన్నకుంటూ, కొంత నిర్మాణం జరిగాక నిబంధనల పేరుతో రాయబేరాలు నడుపుతున్నట్లు సమాచారం. చీరాల, వేటపాలెం మండలాల పరిధిలో ఒకరిని చూచి మరొకరు నిబంధనలను గాలికి వదిలేస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. తీరం వెంట హెచ్‌టీఎల్(హై టైడ్ లైన్) నుంచి 200 మీటర్ల లోపు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. 200 నుంచి 500 మీటర్ల లోపు, ఆ తర్వాత నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలి. ముందుస్తుగా నిర్మాణం చేపట్టే స్థలానికి రెవెన్యూ శాఖకు కన్వర్షన్ రుసుం చెల్లించాలి. తర్వాత 300 స్క్వేర్ మీటర్ల లోపు అయితే పంచాయతీ నుంచి, ఆ పైన అయితే ఒడా(ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నుంచి అనుమతి పొందాలి. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇతర శాఖల నుంచి అనుమతులు పొందిన తర్వాత నిర్మాణాలు చేపట్టాలి. అయితే అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలను ప్రారంభ దశలో అడ్డుకోకుండా, తర్వాత సంబంధిత శాఖల అధికారులు రాయబేరాలు నడుపుతున్నారనే ఆరోపణలున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రాథమికంగా నిర్మాణాలకు వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ (నాళా రుసుము చెల్లించి) చేయించుకోవాలి. తర్వాత నిర్మాణ స్థల విస్తీర్ణాన్ని అనుసరించి పంచాయతీ లేదా ఒడా, ఇతర సంబంధిత శాఖల నుంచి అనుమతులు పొందాలి. అయితే నిబంధనలకు మంగళం పాడుతూ జరుగుతున్న అనధికారిక నిర్మాణాలతో వివిధ రుసుముల రూపేణా వచ్చే ప్రభుత్వ ఆదాయానిక గండి పడుతోంది.

నో సర్పంచ్.. నో ఎంపీటీసీ

● కోర్టులో కేసులతో నిలిచిన ఎన్నికలు ● 23 పంచాయతీలకు ఆగిన ఆర్థిక సంఘం నిధులు

చీరాల, సెప్టెంబరు 24: సర్పంచ్.. ఎంపీటీసీ.. పాలకవర్గాలు లేక చీరాల నియోజకవర్గంలో పలు పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయి. ప్రత్యేక అధికారులు పాలనతో అధికారుల మధ్య సంయమనం లేదనే వాదనలు సర్వత్రా వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీకి తప్ప మిగిలిన అన్ని చోట్లా ఎన్నికలకు గ్రహణం పట్టింది. పునర్విభజన చర్యలపై చీరాల మండలం వాడరేవు మాజీ సర్పంచ్, వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీకి చెందిన ఓ వ్యక్తి వేర్వేరుగా కోర్టులను ఆశ్రయించారు. దీంతో కోర్టు ఉత్తర్వుల మేరకు పంచాయతీల ఎన్నికలు నిలిచిపోయాయి. పాలకవర్గాలు లేకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు జమ కావడం లేదు. దీంతో పారిశుధ్యం పడకేస్తుంది. నిధుల వినియోగంలో కూడా పారదర్శకత లోపించిదనే ఆరోపణలు ఉన్నాయి. సిబ్బంది జీతభత్యాలు కూడా కొన్ని నెలలుగా చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తిరిగి పంచాయతీ పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. చీరాల మండలంలో 15, వేటపాలెం మండలంలో 9 పంచాయతీలు ఉన్నాయి. గత ఎన్నికలకు ముందు పంచాయతీల పునర్విభజన జరిగింది. ఆ క్రమంలో చీరాల మండలంలో 17 పంచాయతీలకు పెంచారు. వాడరేవు పంచాయతీ పరిధిలోని కీర్తివారిపాలెం గ్రామాన్ని వాడరేవు నుంచి బుర్లవారిపాలెం పంచాయతీకి మార్చారు. దీనిపై ఆ గ్రామానికి చెందిన వాడరేవు మాజీ సర్పంచ్ కోటేశ్వరమ్మ తమ గ్రామాన్ని ఎప్పటి మాదిరిగానే ఉంచాలని కోర్టును ఆశ్రయించారు. దీంతో పునర్విభజన జీవోను కొట్టి వేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వేటపాలెం మండలం విషయంలో



కోర్టు స్టే ఇచ్చింది. దీంతో ఆ మండలంలో 8 పంచాయతీలకు ఎన్నికలు నిలిచాయి. పునర్విభజన పరిధిలోకి రాని రామన్నపేట పంచాయతీకి మాత్రం ఎన్నికలు జరిగాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో మిగిలిన 23 పంచాయతీలకు సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఎన్నికల ప్రక్రియ నిలిచింది. ఈ పంచాయతీల్లో సర్పంచ్, ఎంపీటీసీలు లేరు. దీంతో అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయడం లేదనే ఆరోపణలున్నాయి. కొన్ని పంచాయతీల్లో నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయనే వాదనలు ఉన్నాయి. ఈ క్రమంలో కార్యదర్శుల బదిలీల నేపథ్యంలో కొన్ని లోపాలు వెలుగులోకి వచ్చాయి. వాటిపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. పాలకవర్గాలు లేకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. నిధుల లేమితో సిబ్బంది జీతభత్యాలు ఇవ్వడంలేదు. విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేని స్థితిలో ఉన్నాయి.

ఫిషింగ్ హార్బర్ ఎప్పటికో?

● నిర్మాణానికి తొలగని బాలారిష్టాలు

● నిజాంపట్నంలో నాడు జగన్ శంకుస్థాపన

చీరాల, సెప్టెంబరు 24: వాడరేవు ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి బాలారిష్టాలు తొలగలేదు. నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ ప్రారంభం సందర్భంగా వాడరేవు ఫిషింగ్ హార్బర్‌కు నిజాంపట్నంలో నాటి సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. అది జగన్ ప్రచార ఆర్భాటానికి పరాకాష్ఠని అప్పట్లో తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు ఎద్దేవా చేశారు. అదే నిజమైంది. ఆ తర్వాత హార్బర్ నిర్మాణానికి సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. వాడరేవు తీరంలో హార్బర్‌కు అవసరమైన భూమిని రెవెన్యూశాఖ నుంచి నిర్మాణదారులకు స్వాధీన ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. హార్బర్ నిర్మాణానికి రూ.451 కోట్లు మంజూరు అయ్యాయి. అందులో కేంద్రం, రాష్ట్రం వాటాల ప్రకారం నిధుల విడుదల జరగాలి. అయితే ఇంతవరకు స్థల సేకరణ పూర్తికాలేదు. అది ఎప్పటికి పూర్తవుతుందో, ఎప్పుడు నిర్మాణ పనులు చేపడతారో అర్థం కావటంలేదని మత్స్యకారులు అంటున్నారు. మత్స్యశాఖ అధికారులు తయారు చేసిన డీపీఆర్‌లో 20 ఎకరాల స్థలం అవసరమవుతుందని పొందుపరిచారు. 13 ఎకరాలు మాత్రమే ఉందని రెవెన్యూ అధికారులు దస్త్రాల ప్రకారం చెప్పారని, అది సీసీఎల్‌ఏలో పెండింగ్ ఉందని మత్స్యశాఖ అధికారులు చెప్తున్నారు. నిధుల విడుదల తర్వాత ఏపీఎంఐడీసీ(ఆంధ్రప్రదేశ్ మైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) బాధ్యతలు చేపట్టిందా లేదా అనే అంశంపై అధికార వర్గాల్లోనే స్పష్టత లేదు. అయితే ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి రెవెన్యూశాఖ పరంగా భూమి స్వాధీనం చేయలేదని రెవెన్యూ అధికారులు చెప్తున్నారు. ఈ క్రమంలో వాడరేవు ఫిషింగ్ హార్బర్ నిర్మాణంపై ఉన్న సందేహాలను తొలగించి, త్వరితగతిన నిర్మాణపనులు చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వాడరేవు సముద్రతీరంలో వేటకు సిద్ధం చేసిన బోట్లు



వేలాది మందికి ఉపాధి అవకాశాలు

హార్బర్ నిర్మాణం పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని మత్స్యకారులు భావిస్తున్నారు. దీంతో పాటు తాము వేటాడిన మత్స్యసంపదకు గిట్టుబాటు ధర కూడా లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్లు, ఇతర విపత్తులు సమయంలో బోట్లు దెబ్బతినకుండా లంగర్లు వేసుకునేందుకు అనువుగా ఉంటుందని చెప్తున్నారు.

ఉపఖజానా కార్యాలయంలో రికార్డుల పరిశీలన

చీరాల, సెప్టెంబరు 24 : ఉపఖజానా కార్యాలయంలో మంగళవారం బాపట్ల డీటీవో కార్యాలయ ఏటీవో అనూరాధ బృంద సభ్యులు రికార్డులను పరిశీలించారు. ఇటీవల సబ్ ట్రెజరీ కార్యాలయంలో పనిచేసే అధికారులపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో పాత వారిని బదిలీ చేసి కొత్తవారిని నియమించారు. ఈ క్రమంలో ఏటీవో అనూరాధ బృందం ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు రికార్డులను పరిశీలించారు. ఎస్టీవో ఎంవీ సుబ్బారావు వారికి రికార్డులను చూపించారు. రెండు, మూడు రోజుల్లో రాష్ట్ర స్థాయి అధికారులు ప్రత్యేక విచారణ చేపట్టనున్నట్లు సమాచారం.

లెదర్ ఇండస్ట్రీస్ చైర్మన్‌గా మాణిక్యాలరావు



చీరాల, సెప్టెంబరు 24 : లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా చీరాల మండలం విజయనగర్ కాలనీకి చెందిన టీడీపీ సీనియర్ నేత పిల్లి మాణిక్యాలరావును ప్రభుత్వం నియమించింది. మాణిక్యాలరావు సుదర్ఘీకాలంగా పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. వివిధ పదువుల్లో తనదైన శైలిని చాటుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంపట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన పలువురు మాణిక్యాలరావు నియామకంపై అభినందనలు తెలిపారు.

గ్రామాలలో ఏదీ స్వచ్ఛత?

- ఎక్కడ చూసినా చెత్త కుప్పలే
- ప్రత్యేక కార్యక్రమాల్లోనూ మెరుగుపడని పారిశుధ్యం
- పొంచి ఉన్న అంటు వ్యాధుల ముప్పు



రోడ్ల వెంబడి దర్శనమిస్తున్న చెత్త



కొప్పెరపాడులో నిలిచి ఉన్న మురుగు



నక్కబొక్కలపాడు సమీపంలో పేరుకుపోయిన వ్యర్థాలు

బల్లికురవ, సెప్టెంబరు 24 : ఒక వైపు స్వచ్ఛగ్రామాలుగా ఉండేందుకు ప్రభుత్వం ఆదేశాలతో స్వచ్ఛ హీ సేవా కార్యక్రమాలు జరుగు తున్నా గ్రామాలు మాత్రం స్వచ్ఛత నహీగా మారాయి. ఏ గ్రామంలో చూసినా రోడ్ల వెంబడి వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుకు పోయి పారిశుధ్యం అధ్వానంగా తయారయింది. క్షేత్ర స్థాయిలో అధికారులు మాత్రం ఫొటోలను తీసి పారిశుధ్య పనులు చేశామని మమ అనిపిస్తున్నారు. దీంతో అంటు వ్యాధుల ముప్పు పొంచి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్వచ్ఛ హీ కార్యక్రమంలో ఎక్కడ చెత్త ఉన్న ఫొటో తీసి పంపిస్తే గంటలో తీసి వేయిస్తామని అధికారులు ర్యాలీలలో చెప్తున్న ఎక్కడ అమలులో మాత్రం జరగడం లేదు. గ్రామాలలో రోడ్ల వెంబడి మురుగు విలయ తాండవం చేస్తోందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. స్వచ్ఛ గ్రామాలు ఎలా ఏర్పాటు అవుతాయని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారులు గ్రామాలలో పర్యటించి పారిశుధ్య కార్యక్రమాలను మెరుగు పరిచేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. బల్లికురవ మండలంలోని అత్యధిక గ్రామాలలో వ్యర్థాలు రోడ్ల వెంబడి దర్శనమిస్తున్నా యి. దేశ వ్యాప్తంగా స్వచ్ఛ కార్యక్రమాలు జరుగుతున్న గ్రామాలలో మాత్రం ఎక్కడ అమలు లో మాత్రం జరగడం లేదు. మండల కేం ద్రం లో అధికారులు ఒక ర్యాలీ చేపట్టి స్వచ్ఛ కార్యక్రమాన్ని చేపట్టినా క్షేత్ర స్థాయిలో మాత్రం చెత్త తొలగించే పనులు చేయలేదు. బల్లికురవలోనే చెరువు సమీపంలో, బస్సు స్టేషన్ ఆవరణలో రోడ్ల వెంబడి వ్యర్థాలు పెద్ద ఎత్తు న దర్శనమిస్తున్నాయి. నక్కబొక్కలపాడు, కొణిదెన, ఉప్పుమాగులూరు, కొప్పెరపాడు, వైద న, ముక్తేశ్వరం, అంబడిపూడి, కొ మ్మినేనివారిపాలెం, కొప్పెరపాలెం, మల్లాయపాలెం, వేమవరం, కూకట్లపల్లి, వెలమవారిపాలెం గ్రామా ల పరిధిలో స్వచ్ఛత అనేది కనిపించడం లేదు ఎటూ చూసిన వ్యర్థాలు, రోడ్లపై మురుగు దర్శన మిస్తున్నాయి. కొప్పెరపాడు గ్రామంలో అయితే సిమెంట్ రోడ్లపై గుండానే మురుగు పారుతుంది అని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. కొన్ని గ్రామాలలో చెత్త సంపద కేంద్రాలు ఉన్న ఆలంకార ప్రాయంగా మారాయని ప్రజలు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా గ్రామాలను స్వచ్ఛతగా ఉంచేలా ప్రజలు అవగాహన కల్పించడంతో పాటు వ్యర్థాలను వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాజేష్‌కుమార్

మార్చి 31 నాటికి గృహాలు పూర్తి చేయాలి

పంగులూరు, సెప్టెంబరు 24 : పీఎంఏవై పథకం ద్వారా మంజూరైన గృహాలను 2025 మార్చి 31లోగా పూర్తి చేసుకునేలా లబ్ధిదారుల్లో అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి రాజేష్‌కుమార్ అధికారులకు సూచించారు. గృహ నిర్మాణాలపై మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. బైటమంజులూరు, భగవాన్‌రాజుపాలెం, చందలూరు, బూదవాడ, తూర్పు తక్కెళ్లపాడు, కొప్పెరపాడు, పంగులూరు గ్రామాలలో మొత్తం 437 ఇళ్లు మంజూరైనట్లు చెప్పారు. అర్బన్ బీఎల్‌సీ కింద 21 గ్రామ పంచాయతీలలో 738 గృహాల పూర్తికి చర్యలు చేపట్టాలన్నారు. 12 ప్రత్యేక బృందాలు ఈ నెల 28న లబ్ధిదారులతో సమావేశం నిర్వహించాలన్నారు. మార్చి 31 నాటికి గృహాలు నిర్మించుకున్నవారికి మాత్రమే ప్రభుత్వ సాయం అందుతుందని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో రామాంజనేయులు, తహసీల్దార్ నాగరాజారావు, హౌసింగ్ ఏఈ కిషోర్‌కుమార్ ఇంజినీరింగ్, ఇతర విభాగాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ : అసంపూర్తిగా ఉన్న గృహాలను వెంటనే పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో రాంబాబు సూచించారు. మంగళవారం కార్యాలయంలో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న 281 మంది గృహ లబ్ధిదారులను కలిసి పనులు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఏఈ దుర్గా రమేష్ పాల్గొన్నారు.

సంతమాగులూరు : పెండింగ్‌లో ఉన్న 285 ఇళ్లను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసేలా లబ్ధిదారులు సహకరించాలని మండల ప్రత్యేక అధికారి డీఈఈ రమేష్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ సమావేశం హాలులో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈ రమణనాయక్, ఈవోపీఆర్డీ శివరాం ప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

156 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలకు హాజరైన ప్రజలు

బల్లికురవ, సెప్టెంబరు 24 : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆశీస్సులతో తెలుగు యువత ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, గుంటూరు శంకర్ నేత్రాలయం వారితో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. గ్రామ పరిసర గ్రామాలకు చెందిన 156 మందికి వైద్యాధికారి యల్లారెడ్డి బృందం కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 58 మందికి శుక్లాల ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వైద్య శిబిరంలో ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా బుధవారం శంకర్ నేత్రాలయంలో చేసి తిరిగి తీసుకు వస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మార్టూరు హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, సీహెచ్‌వో దుర్గ, టీడీపీ నేతలు అమరనేని కాశీవిశ్వనాథం, దేవినేని నరేంద్ర, వినోద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 24 : మండల పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో కొత్త పరికరాలను ఏర్పాటు చేసేందుకు బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న ఏఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అక్రమ వెంచర్ల తొలగింపు

మార్టూరు, సెప్టెంబరు 24 : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా, అనధికారికంగా ఇంటి స్థలాల వెంచర్లు వేసి అమ్మకాలు చేయాలనుకుంటున్న వ్యక్తుల ప్రయత్నాలకు గ్రామ పంచాయతీ అధికారులు అడ్డుకున్నారు. గ్రామ పంచాయతీకి రావలసిన ఆదాయానికి గండికొట్టేలా వేసిన అక్రమ లేఅవుట్లపై కొరడా ఝుళిపించారు. వారం రోజులలో మార్టూరు గ్రామ పంచాయతీ పరిధిలో కొంతమంది వ్యక్తులు వేసిన నాలుగు అనధికార లే అవుట్‌లలోని హద్దురాళ్లను పంచాయతీ అధికారులు తొలగించారు. స్థానిక నేతాజీనగర్ సమీపంలో, గన్నవరం రోడ్‌లో, నాగరాజుపల్లి రోడ్‌లో, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో దాదాపుగా 4ఎక రాలకు పైగా విస్తీర్ణంలో నాలుగు అక్రమ వెంచర్లను వేశారు. ర్లను ఏర్పాటు చేశారు. వారికి ఇష్టం వచ్చినట్లు ఇంటి స్థలాలుగా విభజించి అమ్మకానికి సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న పంచాయతీ అధికారులును ఆ వెంచర్లను తొలగించారు.

ఇసుక అక్రమ రవాణాపై కేసు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), సెప్టెంబర్ 24 : నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తిపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. అందిన వివరాల ప్రకారం చీరాల మండలం తోటవారిపాలెంకు చెందిన కాగిత పరిశుద్ధరావు ఎద్దుల బండితో అదే గ్రామ శివారులోని పొలాల్లో ఇసుకను తవ్వి అక్రమంగా రవాణాకు పాల్పడుతున్నాడు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి ఎద్దులబండిని రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

పర్చూరు, సెప్టెంబరు 24 : క్రమం తప్పకుండా గర్భిణులు, బాలింతలు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో సుభద్ర అన్నారు. మంగళవారం వీరన్నపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసి వారోత్సవాల్లో పాల్గొన్నారు. గర్భిణులకు సమతుల ఆహారాన్ని అందించడం ద్వారా పుట్టిన బిడ్డతోపాటు, తల్లి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో చెరుకూరు సెక్టార్ సూపర్ వైజర్ రాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీకి చిత్రపటాల బహూకరణ

చినగంజాం, సెప్టెంబరు 24 : చినగంజాం గ్రామ పంచాయతీ కార్యాలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు చిత్రపటాలను బహూకరించారు. గ్రామ కార్యదర్శి ఎ.మస్తాన్‌రావుకు మంగళవారం కూటమి నాయకులు ఫొటోలను అందజేశారు. జనసేన సీనియర్ నాయకుడు సందు శ్రీరామ్, టీడీపీ నాయకులు మోటుమర్రి రామసుబ్బారావు, షేక్ నబీషా చిత్రపటాలను బహూకరించారు.

ప్రకృతి వ్యవసాయంతో మంచి ఆహారం

మార్టూరు, సెప్టెంబరు 24 : ప్రకృతి వ్యవసాయం ద్వారా విష రసాయన అవశేషాలు లేని మంచి ఆహారాన్ని పొందవచ్చునని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వీ వాణిశ్రీ అన్నారు. మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై మండల సమాఖ్య కార్య నిర్వాహక సభ్యులకు మండల కాంప్లెక్స్ వద్ద వెలుగు కార్యాలయంలో శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వాణిశ్రీ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడి, తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యవంతమైన పంటలను పండించుకోవచ్చునన్నారు. అనంతరం సీనియర్ కన్సల్టెంట్ జానకమ్మ మాట్లాడుతూ మండల సమాఖ్య సమావేశాలలో ప్రకృతి వ్యవసాయాన్ని ఒక అజెండాగా చేర్చాలన్నారు. తద్వారా పొదుపు సంఘాలకు, గ్రామ సంఘాలకు దీనిపై అవగాహన కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పెరటి తోటల పెంపకానికి ప్రాధాన్యను ఇవ్వాలన్నారు. గ్రామాలలో పొదుపు గ్రూపులలోని మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం మోహన్, ఏపీఎం రాజారత్నం, ఎంటీఎల్ రాజశేఖర్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరం వద్ద బీజేపీ నేతలు

బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

అద్దంకి, సెప్టెంబరు 24 : పీఎం నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా సేవా పక్షోత్సవాలలో భాగంగా బీజేపీ నేతల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రేపల్లె రెడ్ క్రాస్ సహాయంతో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, యువ మోర్చా నాయకులు కోటిరెడ్డి, అశోక్, సురేష్ తదితరులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రామకృష్ణ, తమ్మన శ్రీనివాసరావు, బంగారుబాబు, కొల్లి కోటేశ్వరరావు, యలమందరావు, శ్రీనివాసరావు, శ్రీరామ్, రామాంజనేయరాజు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి చూపాలి

పంగులూరు, సెప్టెంబరు 24 : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడలపట్ల ఆసక్తిని చూపాలని ఎంఈవో జీ వీరాంజనేయులు అన్నారు. కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను ఎంఈవో ప్రారంభించారు. ఆరు ఉన్నత పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గెలిచిన జట్లు ఈనెల 27న నియోజకవర్గ పరిధిలో ఏల్చూరులో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అణిత, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం



వృద్ధాశ్రమానికి బియ్యం అందజేస్తున్న సెయింట్ ఆన్స్ విద్యార్థులు

చీరాల, సెప్టెంబరు 24 : సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు మాట్లాడుతూ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు అందిస్తున్న సేవా కార్యక్రమాలు హర్షనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్‌బాబు ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా ఇప్పటి వరకు చేపట్టిన సేవా కార్యక్రమాలు వివరించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు వేటపాలెం మండలం దేశాయిపేటలోని అనాథ, వృద్ధ శరణాలయంలో వృద్ధులకు రెండు బస్తాల బియ్యం, పండ్లను అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమం నిర్వాహక ప్రతినిధులు సత్రం మల్లీశ్వరరావు తదితరులు మాట్లాడుతూ సెయింట్ ఆన్స్ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల దాతృత్వం, అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల డాక్టర్ సీఎస్‌రావు అక్రిడిటేషన్స్ డైరెక్టర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ దీవి జ్యోతిస్వరూప్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య అవసరాలపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న ఫార్మసీ విద్యార్థులు

ఇంకొల్లు, సెప్టెంబరు 24 : డీసీఆర్‌ఎం ఫార్మసీ కళాశాలలో ప్రపంచ ఫార్మసీ దినోత్సవం సందర్భంగా ఆరోగ్య అవసరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఆర్‌ఎం కళాశాల డైరెక్టర్ చిలుకూరి శ్రీధరరావు ఆరోగ్య అవసరాలు తీర్చడంలో ఫార్మాసిస్టుల పాత్ర ఎంతో ఉందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ చిలుకూరి శ్రీధరరావు, ప్రిన్సిపాల్ డా.ఏ. వేణు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ హితంతోనే ఆరోగ్యం

చీరాలటౌన్, సెప్టెంబరు 24 : ప్రతి ఒక్కరూ పర్యావరణహితంగా ముందుకు సాగితేనే ఆరోగ్యంగా, సంతోషంగా జీవిస్తారని విజయవాడ దత్తోపంత్ ఠేంగ్డి జాతీయ కార్మిక విద్యా, అభివృద్ధి సంస్థ సంచాలకులు రవిశంకర్ పేర్కొన్నారు. చీరాల ఇంటిగ్రేటెడ్ పీపుల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ, విజయవాడ వారి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో స్వచ్ఛత హి సేవపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తే వ్యాధులు దరి చేరవని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌డీ మతీన్, కళాశాల ప్రిన్సిపాల్ వీపీ సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే కొండయ్య



చినగంజాంలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న అధికారులు, నాయకులు

చీరాల, సెప్టెంబరు 24 : ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని తోటవారిపాలెంలో మంగళవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలు, వారి బాగోగులను కొండయ్య తెలుసుకున్నారు. మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సాగుతున్న పౌష్టకాహార మాసోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీవో నేతాజీ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పంగులూరు, సెప్టెంబరు 24 : ప్రజల ఆకాంక్షలు, సమస్యలు తీరేలా కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు, మరోపక్క రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ అన్నారు. మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి 100 రోజుల ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎల్. సునీత, జార్లమూడి సుబ్బారావు, చిలుకూరి కోటయ్య, కాపుగారి సురేష్, తాతయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.

చినగంజాం : పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, ఎంపీడీవో కే.స్వరూపరాణి అన్నారు. మండలంలోని చినగంజాం, పల్లెపాలెం గ్రామాల్లో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను నాయకులు అందజేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఉపాధి హామీ పథకం నిధులతో చినగంజాం గ్రామంలో రూ.7లక్షల రూపాయిలు, సోపిరాల గ్రామంలోని విజయరావు బజారులో రూ.23.5లక్షల రూపాయిలు, పల్లెపాలెం గ్రామంలో రూ.17లక్షల రూపాయిలతో నిర్మించే సిమెంట్ రోడ్లకు భూమి పూజ చేసినట్లు పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు తెలిపారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలో పలు చోట్ల సిమెంట్ రోడ్లకు, డ్రైనేజీ పనులకు రూ.2కోట్ల రూ.45 లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, ఉప సర్పంచ్ చెరుకూరి రాఘవయ్య, పాలక వర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పల్లెపాలెం గ్రామ సర్పంచ్ సైకం మణి, హౌసింగ్ ఏఈ జి.రాజశేఖర్, గ్రామ కార్యదర్శులు ఎ.మస్తాన్‌రావు, నాగేంద్రబాబు, టీడీపీ కూటమి నాయకులు సయ్యద్ అబ్దుల్ కలాం అజాద్, టీ.జయరావు, సందు శ్రీనివాసరావు, మోటుమర్రి రామసుబ్బారావు, నరహరి శ్రీనివాసరావు, షేక్.జిలాని, పి.లక్ష్మీనారాయణ, డి.ఏసు నారాయణ, జి.వెంకటనారాయణ, బడుగు సామ్యే లు, షేక్ హుస్సేన్ భాష, జి.నరసింహారావు, టి.చిన్నా, సంఖ్యా శ్రీను, ఎన్‌సీ.సుబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పంగులూరులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

మేదరమెట్ల : కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు వెళ్తుందని, ఇది మంచి ప్రభుత్వం అని ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం దైవాలరావూరులో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన మాట్లాడారు. 100 రోజుల్లో జరిగిన అభివృద్ధి పనులను ఆర్డీవో వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, తహసీల్దార్ మెహతాజ్, సర్పంచ్ కోనూరి సీతామహాలక్ష్మి, టీడీపీ నాయకులు చెన్నుపాటి హరిబాబు, ఐడీసీడీఎస్ పీడీ, మండల ప్రత్యేకాధికారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

ఆధునిక పద్ధతులతోనే వ్యవసాయాభివృద్ధి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 24 : ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారానే అభివృద్ధి సాధ్యమని అద్దంకి సహాయ వ్యవసాయ సహాయకులు కె.ధనరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మవరం గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతు సేవా కేంద్రంలో గ్రామ సభ సర్పంచ్ చావల కల్యాణి అధ్యక్షతన జరిగింది. ముందుగా వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో సాంకేతికతో డ్రోన్ టెక్నాలజీతో పురుగు మందులు పిచికారీ విధానాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. చీడ పీడలు గుర్తించేందుకు సీఎల్‌ఎస్ యాప్ ప్రవేశపెట్టిందన్నారు. పశు వైద్యశాఖ ఏడీ డాక్టర్ మోహనరావు మాట్లాడుతూ రాయితీపై ఎర్ర జొన్నలు అందిస్తున్నట్లు తెలిపారు. పశువులకు టీకాలు వేసినట్లు చెప్పారు. కూరగాయల సాగు రైతులకు విత్తనాలపై ఎకరాకు రూ.8వేలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బొమ్మనంపాడు వెటనరీ అసిస్టెంట్ సర్జన్ అశోక్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఏఈవో కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు రోజీ, రైతులు పాల్గొన్నారు.

పంగులూరు : పంట సాగులో నూతన పద్ధతులను అనుసరించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని ఏవో డీ సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని రామకూరులో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ, మార్కెటింగ్ శాఖ సిబ్బంది, వీఏఏ పృథ్వీ, రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ : తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా రైతులు పంటలు సాగు చేయాలని ఏవో కుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని వేమవరం గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పొగాకు, పత్తి పైర్లను ఏవో పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి వెంకట్రావు, సర్పంచ్ దూళిపాళ్ల వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యురాలు అలివేలమ్మ, టీడీపీ నాయకులు గొట్టిపాటి మారుతి, మల్లాది వీరాంజనేయులు, వీఏఏ వెంకటేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొండయ్య చేతుల మీదుగా ప్రారంభం

వేటపాలెం : మండల పరిధిలోని తోటవారిపాలెంలో మంగళవారం వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య జెండాఊపి ప్రారంభించారు. రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏవో సుమతి, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకొల్లు : పంటల సాగులో మిశ్రమ ఎరువులు వాడడంవలన పంటలకు మేలు జరుగుతోందని వ్యవసాయాధికారి వేణుగోపాల్ సూచించారు. మండలంలోని పావులూరలో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. పత్తిసాగును పరిశీలించిన ఆయన రసం పీల్చే పురుగు నివారణపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పావులూరు గ్రామ సర్పంచ్ లూథియమ్మ, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

చెరుకూరు(పర్చూరు) : ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పంట నష్ట పరిహారం అందుతుందని వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) మోహనరావు తెలిపారు. చెరుకూరు రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఏడాదికి రూ.20వేలను రైతు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వ్యవసాయాధికారి మేరమ్మ, లైవ్ స్టాక్ అసిస్టెంట్ నాగసాయి కల్యాణ్, జడ్పీటీసీ మాజీ సభ్యులు ఉషారాణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మార్టూరు : రైతులకు వ్యవసాయంలో సాగు చేస్తున్న పంటలకు వచ్చే చీడపీడల నివారణకు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగించేందుకు ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని వ్యవసాయఅధికారి వీరగందం కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని డేగరమూడి గ్రామంలో అధికారులు పత్తిని పరిశీలించారు. అనంతరం ఉద్యాన అధికారి హనుమంతనాయక్, పశువైద్యాధికారి మాధవీలత లు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సంతమాగులూరు : సంతమాగులూరు మండలంలోని వెల్లలచెరువు గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని ఏడీఏ శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏవో అంజిరెడ్డి, ఏఈవో మాధురి పాల్గొన్నారు.





అద్దంకిలో మాట్లాడుతున్న ఏడీఏ ధనరాజ్, వేమవరంలో మాట్లాడుతున్న ఏవో, పర్చూరులో మాట్లాడుతున్న ఏడీఏ మోహనరావు



టంగుటూరులో స్వీట్లు పంచుతున్న టీడీపీ శ్రేణులు

కూటమి ప్రభుత్వం ఇచ్చిన నామినేటెడ్ పదవుల తొలిజాబితాలో జిల్లాకు సముచిత స్థానం దక్కింది. నిబద్ధతతో పార్టీల్లో కష్టపడి పనిచేస్తున్న నాయకులను ప్రోత్సహిస్తూ చైర్మన్ పదవులను కట్టబెట్టారు. అదేవిధంగా చాలా ప్రాధాన్యత ఉన్న సంస్థలు కావడం విశేషం. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు మొత్తం నాలుగు కార్పొరేషన్ చైర్మన్ పదవులు లభించగా, అందులో మూడు టీడీపీ నేతలకు, ఒకటి బీజేపీ నేతకు దక్కాయి. జనసేనకు ఒక డైరెక్టర్ పదవి దక్కింది. ఈ పదవుల పంపిణీపై తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో సంపూర్ణ సానుకూలత వ్యక్తం అవుతుండగా, బీజేపీ, జనసేనల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది.



దామచర్ల సత్య



నూకసాని బాలాజీ



పిల్లి మాణిక్యాలరావు



లంకా దినకర్

పదవుల్లో పెద్దపీట

నిబద్ధతకు అందలం

- టీడీపీ నుంచి నూకసాని బాలాజీ, మాణిక్యాలరావుకు చైర్మన్ పదవులు
- బీజేపీ నుంచి లంకా దినకర్‌కు అవకాశం
- జనసేన నుంచి గౌతంరాజుకు డైరెక్టర్ పదవి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి జిల్లాకు కార్పొరేషన్ పదవుల విషయంలో కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేసింది. నాలుగు చైర్మన్ పదవులు మనకు దక్కాయి. చిన్న వయసులోనే తెలుగుదేశం పార్టీలో మంచి గుర్తింపు పొందిన ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, ఉత్తరాంధ్ర పార్టీ కోఆర్డినేటర్ దామచర్ల సత్యన్నారాయణ అలియాస్ సత్యకు గౌరవప్రదమైన చైర్మన్ పదవి దక్కడం విశేషం. ఆంధ్రప్రదేశ్ పోర్టులు, హార్బర్ల నిర్వహణ సంస్థ (ఏపీ మారిటైం బోర్డు) చైర్మన్‌గా సత్య నియమితులయ్యారు. అలాగే టీడీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న యాదవ సామాజికవర్గానికి చెందిన నూకసాని బాలాజీ ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ ఇద్దరిది కొండపి నియోజకవర్గం. బీజేపీ నుంచి ఆ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధిగా ఉన్న ఒంగోలుకు చెందిన లంకా దినకర్‌ను 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్‌గా నియమించారు. అలాగే చీరాలకు చెందిన దళిత ఉద్యమకారుడు టీడీపీ అధికార ప్రతినిధి అయిన పిల్లి మాణిక్యాలరావు లిడ్ క్యాప్ చైర్మన్‌గా నియమితులయ్యారు. అలాగే వైపాలెంకు చెందిన జనసేన నాయకుడు డాక్టర్ పాకనాటి గౌతంరాజు ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

టీడీపీలో ఆచితూచి ఎంపికలు..

తెలుగుదేశం పార్టీ పదవుల కేటాయింపులో అధిష్ఠానం పలు జాగ్రత్తలు తీసుకున్నట్లు కనిపిస్తోంది. అనేకమంది నాయకుల పేర్లను పరిశీలించినప్పటికీ ప్రధానంగా గత వైసీపీ ప్రభుత్వంలో, ఆ తర్వాత ఎన్నికల సమయంలో నిబద్ధతతో పనిచేసిన వారికి ఈ జాబితాలో అవకాశం ఇచ్చారని ఆ పార్టీశ్రేణులు భావిస్తున్నాయి. కొండపి నియోజకవర్గానికి చెందిన దామచర్ల సత్య, నూకసాని బాలాజీలతోపాటు చీరాల నియోజకవర్గానికి చెందిన పిల్లి మాణిక్యాలరావు కూడా టీడీపీలో కీలకంగా పనిచేస్తున్నారు. సామాజికవర్గాల సమీకరణకు తగు ప్రాధాన్యం ఇచ్చారు. దామచర్ల సత్య ఓసీ కాగా నూకసాని బాలాజీ యాదవ సామాజిక వర్గానికి చెందినవారు. మాణిక్యాలరావు దళిత ఉద్యమం నుంచి వచ్చిన నాయకులు. దివంగత మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు మనుమడైన సత్య 2012 నుంచి కొండపి నియోజకవర్గ టీడీపీ బాధ్యతల నిర్వహణలో కీలక భూమిక పోషించారు. పార్టీ పట్ల నిబద్ధత, పనితీరులో చాతుర్యాన్ని గమనించి ఆయనకు ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించారు. సమర్థవంతంగా ఆ బాధ్యత నిర్వహించి అటు చంద్రబాబు, ఇటు లోకేష్ మన్ననలు పొందారు. నారా లోకేష్ నిర్వహించిన యువగళంలో తెర వెనుక కీలకపాత్ర పోషించిన వారిలో సత్య కూడా ఒకరు. ఇంజనీరింగ్ పూర్తిచేశారు. ఉత్తరాంధ్రతో ఉన్న సంబంధాలు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రామాయపట్నం నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో సత్యకు మారిటైం బోర్డు చైర్మన్ పదవి దక్కడం పట్ల ప్రత్యేకంగా చర్చించుకుంటున్నారు.

పిన్నవయసులోనే సత్యకు గుర్తింపు

బీజేపీ, జనసేనలో మిశ్రమ స్పందన

బీజేపీ, జనసేనలకు సంబంధించి ఒక్కొక్క పదవి దక్కినప్పటికీ ఆ పార్టీశ్రేణుల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కీలకమైన 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్‌గా నియమితులైన బీజేపీ నేత లంకా దినకర్ ఒంగోలు వాసి. చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తూ టీడీపీ కుటుంబం నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ఆయన తొలుత టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా, ఆ తర్వాత టీడీపీ జాతీయ అధికార ప్రతినిధిగా పనిచేశారు. 2019 తర్వాత బీజేపీలో చేరిన ఆయన పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకుల్లో మంచి గుర్తింపు పొందారు. బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధిగా పొలిటికల్ ఫీడ్ బ్యాక్ ప్రముఖ్‌గా పనిచేస్తున్నారు. ఆయా అంశాల్లో మంచి విశ్లేషకుడిగా దినకర్ గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఆయన విజయవాడ కేంద్రంగా పనిచేస్తున్నప్పటికీ జిల్లా కోటాలోనే పదవి దక్కడం విశేషం. అయితే జిల్లాకు చెందిన మరొకరికి కూడా అవకాశం లభిస్తే బాగుండేదన్న భావన బీజేపీ నాయకుల్లో వినిపిస్తుంది. జనసేన నుంచి జిల్లాకు ఒక డైరెక్టర్ పదవి మాత్రమే దక్కింది. అదీ వైపాలెంకు చెందిన డాక్టర్ పాకనాటి గౌతంరాజుకు దక్కింది. జిల్లాస్థాయిలో ఆయా నియోజకవర్గాల స్థాయిలో మొదటి నుంచి జనసేనలో పనిచేస్తున్న నాయకులు కొందరు రేసులో ఉన్నప్పటికీ అవకాశం లభించకపోవడంపై నాయకుల్లో కొంత అసంతృప్తి కనిపిస్తోంది.

బీసీ నేతకు కీలక చైర్మన్ పదవి

ఇక జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా ఉన్న బాలాజీ 2019 ముందు వైసీపీలో జడ్పీ చైర్మన్‌గా కొంతకాలం పనిచేశారు. ఆ తర్వాత టీడీపీలో చేరిన ఆయన పార్టీలో చురుకైన పాత్ర పోషించారు. అది గమనించి గత టీడీపీ ప్రభుత్వం ఆయనకు యాదవ కార్పొరేషన్ పదవి ఇచ్చింది. లిడ్ క్యాప్ చైర్మన్‌గా నియమితులైన మాణిక్యాలరావు దళిత నేత. చీరాల విజయనగర్ కాలనీకి చెందిన ఆయన చీరాల టీడీపీ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు.

నమ్మకం వమ్ముకాకుండా పనిచేస్తా : సత్య

పార్టీలో అంకితభావంతో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఎప్పుడూ ఉంటుందనేందుకు ఈ నియామకాలు దర్పణమని దామచర్ల సత్య వ్యాఖ్యానించారు. చిన్న వయస్సుల్లోనే మంచి కార్పొరేషన్ పదవిని అప్పగించిన అగ్ర నాయకులకు, సహకరించిన జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు, లోకేష్‌ల నమ్మకం వమ్ముకాకుండా పెద్దాయన ఆంజనేయులు పేరు చెడకుండా కొండపి నియోజకవర్గ ప్రజలు, టీడీపీ కార్యకర్తలకు అండగా పనిచేస్తానని హామీ ఇచ్చారు.

బీసీలకు టీడీపీలోనే సముచిత స్థానం : బాలాజీ

తెలుగుదేశం పార్టీలోనే బడుగు బలహీనవర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందనేందుకు పదవుల తొలి జాబితానే దర్పణం పట్టిందని నూకసాని బాలాజీ వ్యాఖ్యానించారు. నిజాయితీగా పనిచేసి. కార్పొరేషన్‌కు గుర్తింపు తెస్తూ, పార్టీ కోరుకున్న విధంగా బలహీన వర్గాల ప్రజలను టీడీపీలోకి సమీకరించేందుకు కృషిచేస్తానని తెలిపారు. చంద్రబాబు, లోకేష్, మంత్రులు స్వామి, రవి, సత్యప్రసాద్, రవీంద్ర, బీసీ జనార్దన్‌రెడ్డితోపాటు జిల్లాలోని టీడీపీ నాయకులందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు.

సీఐగా శేషగిరిరావు బాధ్యతల స్వీకరణ



సిఐ శేషగిరిరావు

చీరాలటౌన్, సెప్టెంబర్ 24 : చీరాల రూరల్ సీఐగా శేషగిరిరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో శేషగిరిరావు వన్‌టౌన్‌లో విధులు నిర్వహించారు. అనూహ్యంగా ఆయన్ని వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు వెలువడ్డాయి. సోమవారం రాత్రి వెలువడిన ఉత్తర్వుల్లో శేషగిరిరావుకు రూరల్ పోస్టింగ్ అందింది. అయితే ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న నిమ్మగడ్డ సత్యనారాయణకు ఇంకా పోస్టింగ్ ఎక్కడ అనేది నిర్ధారణ కాలేదు. బాధ్యతలు స్వీకరించిన సీఐకి సిబ్బంది స్వాగతం పలికారు.

రమేష్‌చంద్రకు నేతల నివాళి

అద్దంకి, సెప్టెంబరు 24 : సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మన్నె రమేష్‌చంద్ర అనారోగ్యం తో సోమవారం రాత్రి మృతి చెందారు. ముప్పవరం టీడీపీ నేత ధూళిపాళ్ల రామచంద్ర ప్రసాద్ అల్లుడు రమేష్‌చంద్ర సుదీర్ఘకాలం పాటు అమెరికాలో ఉండి మూడేళ్ల కిందట ఇండియాకు తిరిగి వచ్చారు. అనారోగ్యంతో ఉన్న రమేష్‌చంద్ర సోమవారం రాత్రి మృతి చెందగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యేలు కరణం బలరామకృష్ణమూర్తి, బాచిన చెంచుగరటయ్య తదితరులు రమేష్‌చంద్ర మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు.

విద్యుత్ అదాలత్‌లో సమస్యల పరిష్కారం

సంతమాగులూరు, సెప్టెంబరు 24 : విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కరించేందుకు విద్యుత్ అదాలత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జిల్లా విశ్రాంత న్యాయాధికారి ఎస్.విక్టర్ ఇమ్మానియేల్ తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన 22 మంది అర్జీలను అందజేశారు. వాటిలో 13 సమస్యలను వెంటనే పరిష్కరించినట్లు విద్యుత్ ఏఈ దీపక్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కే వెంకటకృష్ణ, ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, ఏ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్, సిబ్బంది బదిలీ

అద్దంకి, సెప్టెంబరు 24 : అద్దంకి తహసీల్దార్ కార్యాలయంలో పలువురు సిబ్బంది బదిలీ అయ్యారు. డిప్యూటీ తహసీల్దార్ సుధారాణి పర్చూరు బదిలీ కాగా, చీరాల నుంచి సురేష్‌బాబును అద్దంకిలో నియమించారు. సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న జీవీఎస్ రామారావు(శంకర్) ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్‌గా, ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న కృష్ణమోహన్ కొరిశపాడుకు బదిలీ అయ్యారు. టైపిస్టు జి.శ్రీనివాసరావు బల్లికురవకు బదిలీ కాగా, కొరిశపాడు నుంచి శ్వేతను నియమించారు. సాయికృష్ణను కొరిశపాడుకు బదిలీ చేశారు.

గేదెల చోరీపై రాస్తారోకో

మేదరమెట్ల, సెప్టెంబరు 24 : పాడి గేదెలే తమకు జీవనాధారమని, దొంగల నుంచి గేదెలను తమకు అప్పగించాలని పాడి రైతులు డిమాండ్ చేశారు. పలువురు పాడి రైతులు మంగళవారం మేదరమెట్ల సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. మండలంలోని కొరిశపాడులో ఎనిమిది గేదెలు, గుడిపాడులో కొన్ని గేదెలు చోరీకి గురయ్యాయి. సోమవారం రాత్రి పి.గుడిపాడులో పాడి రైతు కొస్టం వద్ద ఉన్న గేదెకు 12 గంటల సమయంలో మేత వేసి ఇంటికి వచ్చారు. అరగంటలో మళ్లీ వెళ్లి చూడగా గేదె లేదు. వెంటనే ఆ రైతు గ్రామస్థులందరికీ ఫోన్‌లో విషయం చెప్పారు. అందరూ వెతుకుతుండగా ఆటోలో గేదెను ఎత్తుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న ముగ్గురిని అడ్డుకున్నారు. ఆటో డ్రైవర్ పారిపోగా, మిగిలిన వారిలో మేదరమెట్లకు చెందిన రేగుల నాగార్జున, శ్రీనివాసరావు, తమ్మవరానికి చెందిన బట్టు గురుస్వామిని గ్రామస్థులు పట్టుకొని కొరిశపాడు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. తమ గేదులు కనిపించడంలేదని చుట్టుపక్కల గ్రామాల పాడి రైతులు పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి ఆందోళన చేశారు. కొంత సమయం ఇస్తే దొంగలను పట్టుకుంటామని ఎస్‌ఐ సురేష్ హామీ ఇచ్చారు.



చౌటపాలెం ఎస్సీ కాలనీలోని ఓ ఇంటికి 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్ అంటిస్తున్న మంత్రి స్వామి

ఉత్సాహంగా.. ఊరూరా

'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు, సిబ్బంది

ఇంటింటికి ప్రభుత్వం వంద రోజుల పాలన విజయాలు వివరణ

చౌటపాలెంలో పాల్గొన్న మంత్రి డాక్టర్ స్వామి

ఇతర చోట్ల టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు

ఒంగోలు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 'ఇది మంచి ప్రభుత్వం' ప్రచార కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ఊరూరా టీడీపీ కేడర్, క్షేత్రస్థాయిలోని ప్రభుత్వశాఖల సిబ్బంది సమన్వయంతో పాల్గొంటున్నారు. వంద రోజుల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను, విజయాలను ప్రజలకు ఇంటింటికి వెళ్లి వివరిస్తున్నారు. అదే సమయంలో జిల్లాలో మంత్రి డాక్టర్ స్వామి ఇతర ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతలు తమ పరిధిలోని గ్రామాల్లో ఈ కార్యక్రమంలో పాల్గొని మరింత ఉత్సాహపరుస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఈనెల 20 నుంచి 26 వరకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిన విషయం విదితమే. అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డులలో ఎక్కడికక్కడ క్షేత్రస్థాయి ప్రభుత్వ సిబ్బంది, టీడీపీ కేడర్ ఈ కార్యక్రమంలో పాల్గొంటుంది. మండలానికి రెండేసి గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తున్నారు. వారంరోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం ఐదవ రోజైన మంగళవారం మరింత ఉత్సాహంగా సాగింది. కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు మండలం చౌటపాలెంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒంగోలు రూరల్ మండలం వలేటివారిపాలెంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొనగా చీమకుర్తి మండలం బూసరపల్లిలో ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నెరవేర్చిన హామీల గురించి వివరించారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పెద్దనాగులవరం గ్రామంలో పాల్గొనగా, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కంభం మండలం తురిమెళ్లలో, వైపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పుల్లలచెరువు మండలం ఐటీవరంలో జరిగిన సభలో పాల్గొన్నారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఉత్సాహంగా కార్యక్రమం కొనసాగింది.



పఠాన్ రజియాకు ప్రవేశపత్రాన్ని అందిస్తున్న రవికుమార్

బాబు చెప్పారు.. గోరంట్ల చేశారు!

శ్రీహర్షిణీలో ఇద్దరు విద్యార్థులకు ఉచిత విద్య

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 24: మద్దిరాల పాడులో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేద తల్లిదండ్రులకు వారి పిల్లల చదువుపై ఇచ్చిన హామీని మంగళవారం శ్రీహర్షిణీ విద్యాసంస్థల అధినేత గోరంట్ల రవికుమార్ నెరవేర్చారు. మద్దిరాలపాడులో ఖాజావలి, బీబీసారాల ఇద్దరు విద్యార్థుల భవిష్యత్‌కు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి చదువు బాధ్యతను రవికుమార్ చూసుకుంటారని సీఎం చెప్పారు. ఈ నేపథ్యంలో మంగళవారం దంపతుల కుమార్తె పఠాన్ రజియాను ఒంగోలులోని శ్రీహర్షిణీ జూనియర్ కళాశాలలో చేర్పించారు. కుమారుడిని మార్టూరులోని శ్రీహర్షిణీ స్కూలులో పదవ తరగతిలో చేర్పించబోతున్నారు. ఈ ఇరువురికి చంద్రబాబు హామీ మేరకు ఉచిత విద్య, హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు రవికుమార్ తెలిపారు. సీఎం చంద్రబాబుకు, పిల్లలకు ఉచిత విద్యను అందిస్తున్న రవికుమార్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు ఖాజావలి, బీబీసారాలు కృతజ్ఞతలు తెలిపారు.

గుండ్లకమ్మ పనులు వేగవంతం

కూటమి ప్రభుత్వంలో రూ.8 కోట్లు కేటాయించాం

సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ

త్వరలోనే కాల్వల పూడికతీత, జంగిల్ క్లియరెన్స్

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



వెల్లంపల్లి వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

మద్దిపాడు,సెప్టెంబర్ 24 : 'జిల్లాలోని కీలకమైన గుండ్లకమ్మ గేటు కొట్టుకుపోయినా నాటి వైసీపీ పాలకులు చోద్యం చూస్తుండిపోయారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గుండ్లకమ్మ ప్రాజెక్టుకు రు.8 కోట్లు నిధులు కేటాయించింది. ఈ మొత్తంతో ప్రస్తుతం ప్రాజెక్టు గేట్లు మరమ్మతులు వేగంగా జరుగుతున్నాయి' అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వివరించారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం వెల్లంపల్లి పొగాకు బోర్డుకు చేరుకున్న మంత్రి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. పూర్తిస్థాయిలో రైతుల పంట కొనుగోలుకు అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటు రిపేరు పనులను స్థానిక రైతు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన మాట్లాడుతూ గుండ్లకమ్మ ప్రాజెక్టు కింద ఉన్న కాల్వల పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులపై సంబంధిత శాఖ మంత్రి రామానాయుడుతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి గుండ్లకమ్మ పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి రవికుమార్ పొగాకు బేళ్లను పరిశీలించారు. లోగ్రేడ్ పొగాకును కూడా వెనక్కి పంపకుండా మొత్తం కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. సాధ్యమైనంత వరకు పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా వెల్లంపల్లి రైతు సంఘం అధ్యక్షులు అబ్బూరి శేషగిరిరావు, నారిపెద్ది వరహాల చౌదరి రావి ఉమామహేశ్వరరావు మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మండవ జయంతిబాబు, మండవ గోపీనాథ్, నాగన్నపాలెం సర్పంచ్ కాకర్ల విజయ్‌కుమార్, వెల్లంపల్లి ఎంపీటీసీ సభ్యురాలు అద్దేపల్లి గంగాభవాని, క్లస్టర్ ఇన్‌చార్జ్ పాటిబండ్ల అజయ్‌బాబు, మండవ శ్రీరామమూర్తి, మారెళ్ల హరికుమార్, మండవ గోవిందరాజులు, కోనూరి ఆంజనేయులు పాల్గొన్నారు.

17 మంది తహసీల్దార్లు బదిలీలు

నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన ఐదుగురికి పోస్టింగ్‌లు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 24 : జిల్లాలో ఎంపీడీవోలను బదిలీ చేస్తూ జిల్లా పరిషత్ సీఈవో మాధురి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో పనిచేస్తున్న 17 మందిని బదిలీ చేయగా నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన ఐదుగురు ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 56 మండలాలు ఉండగా మంగళవారం రాత్రి 22 మందికి పోస్టింగ్‌లు ఇవ్వగా మిగిలిన మండలాలకు బుధవారం బదిలీలు చేసే అవకాశం ఉంది.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పీ సుజాత	కొత్తపట్నం	పొన్నలూరు
పీ శ్రీకృష్ణ	పొదిలి	కొత్తపట్నం
కే స్వరూపారాణి	చినగంజాం	జెపంగులూరు
కే రాజశేఖర్‌రావు	గుడ్లూరు	ఒంగోలు
ఏ శ్రీనివాసమూర్తి	కొనకనమిట్ల	చినగంజాం
ఎన్ జగదీష్	అర్ధవీడు	మర్రిపూడి
బీ రామాంజనేయులు	జే పంగులూరు	కొండపి
వై శ్రీనివాసరావు	మద్దిపాడు	మార్టూరు
కే నేతాజీ	చీరాల	కారంచేడు
పీ రత్నజ్యోతి	టంగుటూరు	కందుకూరు
డీ నరసయ్య	కొమరోలు	అర్ధవీడు
ఆర్ దేవసేనకుమారి	అద్దంకి	టంగుటూరు
డీ జయమణి	నాగులుప్పలపాడు	సింగరాయకొండ
ఆర్ఎల్ రాజ్యలక్ష్మీ	ఇంకొల్లు	కొరిశపాడు
ఎంవీ రమణమూర్తి	కొండపి	జరుగుమల్లి
కే సుకుమకుమారి	దర్శి	బల్లికురవ
డీ సురేష్‌బాబు	కొరిశపాడు	ఎస్ఎన్‌పాడు
వీ జ్యోతి	నెల్లూరు	మద్దిపాడు
జీ శ్రీనివాసరావు	నెల్లూరు	ఇంకొల్లు
ఎం రాజేష్‌బాబు	నెల్లూరు	వేటపాలెం
బీ సింగయ్య	నెల్లూరు	అద్దంకి
ఎం రంగసుబ్బరాయుడు	నెల్లూరు	హెచ్ఎంపాడు

పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్‌డీల బదిలీ

నేడో, రేపో ఉత్తర్వులు ఇచ్చే అవకాశం

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 24: జిల్లా పంచాయతీ కార్యాలయ పరిధిలో పనిచేస్తున్న మండలస్థాయి ఈఓఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శుల బదిలీలు భారీగా జరగనున్నాయి. ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో తదనుగుణంగా జిల్లా పంచాయతీ కార్యాలయంలోనూ బదిలీలకు శ్రీకారం చుట్టారు. జిల్లావ్యాప్తంగా 30మందికిపైగా ఈఓఆర్‌డీలు స్థానచలనం కానుండగా కార్యదర్శులు 400మంది వరకు మారనున్నట్లు తెలిసింది. బదిలీల ప్రక్రియ జిల్లా పంచాయతీ కార్యాలయంలో పూర్తయింది. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆ ఫైలుపై ఆమోద ముద్ర వేసిన వెంటనే అందరికీ ఆర్డర్లు జారీ చేయనున్నారు.

వైద్యరంగానికి ప్రాధాన్యం

● కనిగిరి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి ఎమ్మెల్యే, దాతల సహకారం అభినందనీయం ● కలెక్టర్ తమీమ్ అన్సారియా




తల్లీబిడ్డ సంరక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కనిగిరి, సెప్టెంబరు 24: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. మంగళవారం కనిగిరి ప్రాంతంలో కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో కలసి స్థానిక ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. డాక్టర్ ఉగ్ర తన సొంత నిధులతో ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డును అభివృద్ధి చేస్తున్న తీరును పరిశీలించి ప్రశంసించారు. ఆసుపత్రి అభివృద్ధికి దాతలు కూడా ముందుకు వచ్చి ప్రభుత్వానికి తోడుగా నిలవడం అభినందనీయమన్నారు. అప్పుడే పుట్టిన చిన్నారులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన ఆధునిక పరిజ్ఞానంతో కూడిన సాంకేతిక యంత్రాలను కలెక్టర్ పరిశీలించారు. వీటి కోసం ఇప్పటికే రూ11 లక్షలు వెచ్చించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. తల్లి, బిడ్డ సంరక్షణే ధ్యేయంగా కనిగిరి ప్రభుత్వాసుపత్రి రాష్ట్రంలోనే ముందుంజలో ఉండాలన్నదే తన సంకల్పంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ వార్డులను కలెక్టర్ పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యులు అందిస్తున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో జాన్‌ఇర్విన్, మున్సిపల్ చైర్మన్ గఫార్, సూపరింటెండెంట్ అబ్దుల్‌కలాం, టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, యడవల్లి శ్రీనివాసులురెడ్డి, గాయం తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం

కనిగిరి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే సమక్షంలో కలెక్టర్ అన్సారియాకు అందజేశారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం ఎమ్మెల్యే తీసుకుంటున్న చొరవ, పడుతున్న తపన తనను కదిలించిందని వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఇందులో తాము కూడా భాగస్వాములవటం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

బహుభాషా నేపథ్యగాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీబీ) పాట జీవించి ఉన్నంతకాలం చిరస్మరణీయుడే. సింహపురి బిడ్డగానేగాక గాయకుడిగా ఆయన ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళ, కన్నడ, హిందీ, భాషాభిమానుల్లో చెరగనిముద్ర వేసుకున్నారు. బుధవారం ఆయన వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం.



చిరస్మరణీయుడు గానగంధర్వుడు

పాటలాగా బాలూ అజరామరం

నేడు ఎస్పీబీ వర్ధంతి

నెల్లూరు (సాంస్కృతికం) : హరికథా విద్వాంసుడు పండితారాధ్యుల సాంబమూర్తి, శకుంతలమ్మకు 1946 జూన్ 4న నెల్లూరులోని కోనేటమ్మ కోటలో ఎస్పీ బాలు జన్మించారు. తెలుగు, తమిళం, కన్నడ, హిందీభాషలతోపాటు 16 భాషల్లో ఆయన 40వేలకుపైగా సినీ, భక్తి గీతాలు పాడి ప్రపంచ రికార్డు నెలకొల్పారు. 1981లో ఒకేరోజు కన్నడంలో 28 పాటలు పాడి మరో రికార్డు సృష్టించారు. నేపథ్యగాయకుడిగా, నటుడిగా, సంగీత దర్శకుడిగా, డబ్బింగ్ కళాకారుడిగా ఆయన కళామతల్లికి అందించిన సేవలు అనితరసాధ్యమని చెప్పాలి. కాగా 1966లో పద్మనాభం నిర్మించిన శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న చిత్రంతో సినీనేపథ్యగాయకుడిగా ఆరంగేట్రం చేసిన ఆయన, మరణించే వరకు పాటలు పాడారు. నటుల హావభావాల్లో పరకాయ ప్రవేశం చేసేవారు. మంచి గాత్రం ఆయనకు దేవుడిచ్చిన వరం. తెలుగు, తమిళ సినీ రంగంలోని సూపర్‌స్టార్‌లకు ఆయనే నేపథ్యగాయకుడు. డబ్బింగ్ కళాకారుడు. తెలుగు, తమిళ చిత్రాల్లో అతిథి పాత్రలను పోషించారు. ప్రేమికుడు, పవిత్రబంధం, ఆరో ప్రాణం, రక్షకుడు, దీర్ఘసుమంగళీభవ చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు.

'బాలు' గీతాలతో నిత్యస్మరణే!

ఎన్నో అవార్డులు, పురస్కారాలు

తెలుగు పాటలకుగానూ బాలు 25 నంది అవార్డులు అందుకున్నారు. కన్నడ, తమిళ, రాష్ట్రాల నుంచి 14 ఫిలింఫేర్ అవార్డులు, సౌత్ ఇండియా ఫిల్మింఫేర్ అవార్డును అందుకున్నారు. సాహిత్యానికి, పాటలు, పద్యానికి అతను అందించిన సేవలుకుగాను 2012లో ఎన్టీఆర్ జాతీయ అవార్డు, 2015లో కేరళ నుంచి హరివరాసనం, భారతీయ చలన చిత్ర మండలి నుంచి వ్యక్తిత్వ పురస్కారం, 2016లో 47వ ప్రపంచ చలన చిత్ర ఫెస్టివల్ ఆఫ్ ఇండియా అవార్డు, 2001లో పద్మశ్రీ అవార్డు, 2011లో పద్మభూషణ్ అవార్డులు అందుకున్నారు. ఆయన మరణానంతరం పద్మవిభూషణ్ అవార్డు అందుకున్నారు. 2020 వరకు ప్రముఖ నటులకు డబ్బింగ్ చెప్పారు. కమల్‌హాసన్, రజనీకాంత్, విష్ణువర్ధన్, సల్మాన్ ఖాన్, భాగ్యరాజ్, మోహన్, అనీల్‌కుమార్, గిరీష్‌కర్నాడ్, జెమినీ గణేషన్, అర్జున్ సర్జా, నగేష్, కార్తీక్, రఘువరన్, తదితర నటులకు డబ్బింగ్ చెప్పారు. కమల్‌హాసన్ నటించిన 10 పాత్రల విశ్వరూపం చిత్రంలో ఏడు పాత్రలకు ఎస్పీ బాలు డబ్బింగ్ చెప్పారు.

● ఆకాశమంత ఎదిగినా..

సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన బాలు స్వయంకృషితో ఆకాశమంత ఎత్తుకు ఎదిగారు. అయితే ఏనాడూ గర్వాన్ని ప్రదర్శించలేదు. ఆయన చదువుకున్న చదువుకు వృత్తికి ఎలాంటి సంబంధంలేదు. ఇంజనీరింగ్ చదివినా ఆయనకు పాటలు పాడడమే ఇష్టం. అందుకే గానానికే తన జీవితాన్ని అంకితమిచ్చారు. ఆయనకు గురువు ఎస్పీ కోదండపాణి. ఆయన స్వరపరిచిన శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న చిత్రంలో తొలిపాట పాడారు. ఆ తర్వాత ఏనాడూ గానం చేయడంలో వెన్ను చూపలేదు.

● టెలివిజన్ రంగంలోనూ..

బాలసుబ్రహ్మణ్యం సినీ రంగం నుంచి టెలివిజన్ రంగంలోకి ఆరంగ్రేటం చేశారు. రియాలిటీ షో, పాడుతాతీయగా.. కార్యక్రమాలకు హోస్ట్‌గా, న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఆ సమయంలో ఎంతోమంది వర్ధమాన గాయకులను వెలుగులోకి తీసుకువచ్చారు.

● సంగీత పాఠశాలకు ఎస్పీ గృహం

నెల్లూరు మధ్యపతివారివీధిలోని బాలు స్వగృహాన్ని ఆయన కంచి కామకోటి పీఠానికి ఇచ్చి, వేద పాఠశాల, సంగీత పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. అందులో ఇంకా కంచి కామకోటి పీఠాన్ని ఏర్పాటు చేయలేదు. మహమ్మారి కోవిడ్-19 బారినపడి 2020 సెప్టెంబరు 25న చెన్నైలో బాలసుబ్రహ్మణ్యం స్వర్గస్థులయ్యారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరులోని ప్రభుత్వ సంగీత పాఠశాలకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వ సంగీత పాఠశాలగా నామకరణం చేసింది. కానీ నిధులు మాత్రం మంజూరు చేయలేదు. కాగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నెల్లూరు శ్రీవెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో ఘంటసాల విగ్రహాన్ని ఘంటసాల అభిమాన సంఘం వారు ఏర్పాటు చేశారు.



తిప్పరాజువారి వీధిలో బాలు ఇల్లు

స్నేహానికి ప్రాణం ఇస్తారు ..



గాన గంధర్వుడు పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం స్నేహానికి ప్రాణం ఇస్తారు. బాల్యం నుంచి ఆయనతో నాకు స్నేహం ఉంది. జిల్లాలోని గాండ్ల, తెలికుల కులస్థులకు బాలసుబ్రహ్మణ్యం తండ్రి పండితారాధ్యుల సాంబమూర్తి కులగురువు. ఆయన తర్వాత బాలసుబ్రహ్మణ్యం కులగురువుగా వ్యవహించారు. హోటల్ మురళీకృష్ణ గ్రూపు వ్యవస్థాపకుడు గ్రోసు గోపాలయ్య కుమార్తెతో నాకు వివాహం అయ్యాక బాలసుబ్రహ్మణ్యం కుటుంబంతో గోపాలయ్య కుటుంబానికి సంబంధ బాంధవ్యాలు ఏర్పడ్డాయి. నవాబుపేటలో మాతా అన్నపూర్ణేశ్వరి వృద్ధుల ఆశ్రమం భవన నిర్మాణానికి నిధులు కోసం బాలసుబ్రహ్మణ్యం ఉచితంగా సంగీత విభావరి నిర్వహించారు. అలాంటి బాలు లేని లోటు తీర్చలేనిది.

- వీరిశెట్టి హజరత్‌బాబు, మురళీకృష్ణ హోటల్స్ ఎండీ

పాట రూపంలో ఉన్నారు..



ఎస్పీబీతో 1995 నుంచి పరిచయం ఉంది. పాడుతా తీయగా ప్రోగ్రాంలో ఆయన అందరి మనసులు దోచుకున్నారు. ఆ కార్యక్రమంలో ఎంతో మంది చిన్నారులను ఆయన గాయకులుగా తీర్చిదిద్దారు. ఆయన నెల్లూరు వస్తే మాకు పండుగే. వీరిశెట్టి హజరత్‌బాబు, తుంగా శివప్రభాత్‌రెడ్డితోపాటు నేనూ బాలుతో బాగా సన్నిహితంగా ఉండేవాళ్లం. బాలుకి నేను కనపడితే కమ్మరకట్ నాయుడు అని పిలిచేవారు. అలాంటి గాయకుడు మరొకరులేరు. ఎస్పీబీ తండ్రి విగ్రహ కమిటీ మెంబరుగా నేనున్నాను. వారి కుటుంబంలో అంతా నన్ను గౌరవిస్తారు. ఆయన లేని లోటు తీరనిది. అయినా పాట రూపంలో ఆయన బతికే ఉన్నారు.

- నలుబోలు బలరామయ్య నాయుడు, ఎస్పీబీ ఆత్మీయ మిత్రుడు

విధేయులకే పట్టం!

కార్పొరేషన్లలో జిల్లాకు సముచిత స్థానం ● తొలివిడతలోనే అన్ని సామాజిక వర్గాలకు అవకాశం



అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డిల ర్యాలీలో బాణసంచా పేల్చుతున్న టీడీపీ కార్యకర్తలు

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), సెప్టెంబరు 24 : ఎన్డీఏ కూటమికి పదికి పది అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానాన్ని ఇచ్చిన నెల్లూరు జిల్లాకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం దక్కింది. జిల్లాకు చెందిన నాయకులకు కీలకమైన రెండు కార్పొరేషన్ చైర్మన్ పోస్టులు దక్కగా, మరో ముగ్గురికి డైరెక్టర్ పదవులు వరించాయి. ఈ పదవుల్లో జిల్లా నుంచి అన్ని సామాజిక వర్గాలకు చోటు దక్కడం విశేషం. అగ్రవర్ణాలు, మైనారిటీలు, బీసీ, ఎస్టీ వర్గాలకు తొలివిడతలోనే పదవులు దక్కాయి. నామినేటెడ్ పోస్టుల్లో అన్ని వర్గాలకు అవకాశం కల్పించడం, కీలక నాయకులకు పదవులు కట్టబెట్టడం పట్ల కూటమి శ్రేణుల్లో సంతృప్తి వ్యక్తం అవుతోంది.



అనురాధ



తాళ్ల నరసింహస్వామి



పట్టాభిరామిరెడ్డి

● వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా అజీజ్



టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌కు ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ పదవి వరించింది. 2014 నుంచి 2024 వరకు పదేళ్లపాటు ఆయన పార్టీకి సేవలందించారు. 2014-19లో నెల్లూరు కార్పొరేషన్ మేయర్‌గా నగరాభివృద్ధికి, పార్టీ బలోపేతానికి కృషి చేశారు. 2019 ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగి ఓటమిని చవిచూశారు. అప్పటి నుంచి 2024 ఎన్నికల ముందు వరకు నెల్లూరు రూరల్ టీడీపీ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. 2022 నుంచి ఇప్పటివరకు నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టికెట్టు దక్కకపోయినా పార్టీ కోసం శక్తివంచన లేకుండా కృషి చేశారు. టీడీపీ అభ్యర్థుల గెలుపు కోసం జిల్లావ్యాప్తంగా ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అబ్దుల్ అజీజ్‌కు కీలక పదవి దక్కుతుందని అందరూ ఊహించారు. అనుకున్నట్టుగానే ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ పదవి ఆయన్ను వరించింది. రాష్ట్రంలో రైల్వే తరువాత విశాలమైన భూభాగం కలిగిన సంస్థ వక్ఫ్‌బోర్డు. ఈ సంస్థ ఆస్తుల విషయంలో అనేక వివాదాలు నడుస్తున్నాయి. సమర్థుడైన అబ్దుల్ అజీజ్ ఈ వివాదాలను పరిష్కరించి, వక్ఫ్‌బోర్డు భూములు పరిరక్షిస్తాడన్న నమ్మకంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పదవీ బాధ్యతలు అప్పగించారని టీడీపీ సీనియర్ నాయకులు అంటున్నారు. కాగా, అబ్దుల్ అజీజ్‌కు పదవి దక్కడంతో ఆయన అభిమానులు, టీడీపీ శ్రేణులు మంగళవారం రాత్రి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాజానాయుడు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కేకు కట్ చేశారు.

● టిడ్కో చైర్మన్‌గా అజయ్‌కుమార్



అజయ్‌కుమార్‌కు అభినందనలు తెలుసుతున్న సుజయ్‌బాబు

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అత్యంత నమ్మకస్తుడు, జనసేన కేంద్ర మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్‌కు ప్రతిష్ఠాత్మకమైన టిడ్కో చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈయన నెల్లూరు వాసి. ప్రముఖ న్యాయవాది అనంతరామయ్య కుమారుడు. పవన్‌కల్యాణ్ ఆశయాలకు ఆకర్షితుడై జనసేన పార్టీలో చేరారు. పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషి నేపథ్యంలో ఆయన పవన్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా మారారు. పార్టీలో కీలక నాయకుడిగా, నిజాయతీపరుడిగా గుర్తింపు పొందారు. ఈ క్రమంలో జనసేన కోటా కింద టిడ్కో చైర్మన్ పదవి అజయ్‌కుమార్‌కి దక్కింది.

● ముగ్గురికి డైరెక్టర్ పోస్టులు

జిల్లాకు చెందిన ముగ్గురు నాయకులకు రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ పోస్టులు దక్కాయి. మంత్రి నారా లోకేష్‌బాబుకు సన్నిహితుడైన వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డికి ఏపీ సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దక్కింది. అలాగే బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన తాళ్ల నరసింహస్వామి పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈయన తెలుగుదేశంలో సీనియర్ కార్యకర్త. నరసింహస్వామి కుమార్తె బుచ్చి నగర పంచాయతీ కౌన్సిలర్‌గా ఉన్నారు. చేనేత రంగంలో క్రియాశీలకంగా ఉన్నారు. ఏపీ షెడ్యూల్ ట్రైబ్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కావలి నియోజకవర్గం అల్లూరు మాజీ సర్పంచు తిరువేది అనురాధ నియమితులయ్యారు. సుదీర్ఘ కాలంగా టీడీపీ కార్యకర్తగా కొనసాగుతున్నారు.

హలం పట్టి.. పొలం దున్ని!



కొడవలూరు : రామన్నపాళెంలో పొలం దున్నుతున్న కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

జిల్లావ్యాప్తంగా మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ఎంతో ఆర్భాటంగా ప్రారంభమైంది. ప్రతి మండలంలోనూ రెండేసి గ్రామాల్లో అధికారులు రైతు సేవా కేంద్రాల్లో సదస్సులు నిర్వహించి, రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం సాగులో ఉన్న వరి, వేరుశనగ, పత్తి, కూరగాయల పంటలను పరిశీలించి, రైతులకు సూచనలు ఇచ్చారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కొడవలూరు మండలం రామన్నపాలెంలో నాగలిపట్టి పొలం దున్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జలదంకి మండలం రామవరప్పాడులో వ్యవసాయశాఖ రూపొందించిన పోస్టరును ఆవిష్కరించి, కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలోని కావలి, కందుకూరు ఎమ్మెల్యేలు డీవీ కృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులు వివిధ గ్రామాల్లో జరిగిన 'పొలం పిలుస్తోంది'లో పాల్గొన్నారు. వ్యవసాయశాఖ, దాని అనుబంధ శాఖల అధికారులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అడుగంటిన 'రాళ్లపాడు' ప్రాజెక్టు

● సాగు, తాగునీటికి ఇబ్బందులు తప్పవేమో! ● 'సోమశిల' నీరే శరణ్యం



లింగసముద్రం, సెప్టెంబరు 24 : వంద గ్రామాలకు పైగా సాగు, తాగునీరు అందించి రాళ్లపాడు ప్రాజెక్టు అడుగంటింది. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 6.6 అడుగుల నీటిమట్టం ఉంది. ఇది నాలుగు అడుగులకు పడిపోతే డెడ్ స్టోరేజీకి చేరిపోతుంది. వర్షాలు కురవక ఎగువ నుంచి ప్రవాహం లేకపోవడంతో డ్యాంలో ఉన్న నీరు పచ్చగా మారింది. ఈ నీటినే ఫిల్టర్ చేసి గుడ్లూరు, రాళ్లపాడు-రోళ్లపాడు, చుండి- చెర్లోపాలెం మంచినీటి పథకాల ద్వారా గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. అయినా నీరు పచ్చగా ఉంటోందని ప్రజలు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో నీటి అవసరాలకు సోమశిల రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను అందించి ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం సోమశిలలో 52 టిఎంసీల వరకు నీరు ఉంది వాస్తవానికి సోమశిల నుంచి రాళ్లపాడు ప్రాజెక్టుకు 1.5 టిఎంసీల నీరు రావాల్సి ఉంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమశిల ప్రాజెక్టును సందర్శించినప్పుడు, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రాళ్లపాడుకు నీరిచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు కూడా చొరవ తీసుకుని రాళ్లపాడుకు నీటిని అందించి, దాహం తీర్చాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.



మంచినీటి పథకం నుంచి పచ్చగా వచ్చిన నీరు

అదే ఉత్కంఠ!

- కొనసాగుతున్న బదిలీలు
- ఇంకా పలు శాఖల్లో పూర్తికాని ప్రక్రియ
- గడువు ముగిసినా వెలువడని జాబితాలు
- ఎమ్మెల్యేల లేఖలతో ఇబ్బందులు

నెల్లూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ ప్రహసనంగా మారింది. ప్రభుత్వం దాదాపు నెలన్నర సమయం ఇచ్చినా ఇంకా చాలా శాఖలు బదిలీల ప్రక్రియను పూర్తి చేయకపోతున్నాయి. పంచాయతీ విభాగం, జిల్లా పరిషత్, డీఆర్‌డీఏ, ఇరిగేషన్, సచివాలయాలు వంటి శాఖలకు సంబంధించి ఇంకా బదిలీలు పూర్తికాలేదు. బదిలీలకు ఈ నెల 22 వరకు ప్రభుత్వం గడువు ఇచ్చినా నేటికీ అది అసంపూర్తిగానే ఉంది. ఇందుకు ఆయా శాఖల అధికారుల పనితీరు ఒక కారణం కాగా, మరో కారణం ఎమ్మెల్యేల నుంచి సిఫార్సు లేఖలు ఇబ్బడి ముబ్బడిగా రావడం. చాలా వరకూ ఎమ్మెల్యేల కార్యాలయాల నుంచే సిఫార్సుల జాబితా ఆయా శాఖలకు చేరింది. అయితే తొలుత ఒక పోస్టుకు ఒక లెటర్ ఇచ్చాక.. మళ్లీ కొన్ని రోజులకు మరొకరికి అదే పోస్టుకు లెటర్ ఇచ్చారు. ఇలా ఒక్కో పోస్టుకు రెండు, మూడుపేర్లు రావడంతో గందరగోళంగా మారినట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. బదిలీలు పూర్తయిన రెవెన్యూ వంటి శాఖలకు కూడా ఈ సిఫార్సుల సమస్య తలనొప్పిగా మారింది. ఇదిలా ఉండగా పంచాయతీ విభాగం పరిధిలో సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి సుమారు 320 మందికి చాలా రోజుల క్రితమే బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. కానీ ఇంత వరకు బదిలీలు పూర్తి కాలేదు. జిల్లా పరిషత్‌లోనూ ఇదే పరిస్థితి. ఎంత మంది బదిలీ అవుతున్నారన్న సంఖ్యను వెలువరించారే తప్ప ఎవరెవరు ఎక్కడెక్కడకు బదిలీ అవుతున్నారన్నది మాత్రం వెల్లడించలేదు. డీఆర్‌డీఏలో కూడా సుమారు వంద మంది ఉద్యోగుల వరకూ బదిలీ అవ్వాల్సి ఉందని సమాచారం. కానీ ఒక కొలిక్కి రాలేదు. ఇరిగేషన్‌లో బదిలీలు జరిగినట్లు ఈ నెల 22వ తేదీనే ఉత్తర్వులు వెలువడ్డాయి. కానీ ఇంత వరకు బదిలీ చేసిన వారి జాబితా వెలుగుచూడలేదు. ఈ నేపథ్యంలో వందల మంది ఉద్యోగులు బదిలీ ఆర్డర్ల కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

అంగన్‌వాడీలకు మహర్దశ

● మౌలిక వసతుల కోసం రూ.2.61 కోట్ల మంజూరు



నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 24 : సమస్యలతో కునారిల్లుతున్న అంగన్వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టనుంది. ఈ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పనకు కూటమి ప్రభుత్వం రూ.2.61 కోట్లకుపైగా మంజూరు చేసింది. సొంత భవనాలు ఉన్న అంగన్వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి, తాగునీటి వసతి కల్పించడానికి ఈ నిధులు ఖర్చు చేయను న్నారు. ఒక్కో అంగన్వాడీ కేంద్రంలో మరుగు దొడ్డి నిర్మాణానికి రూ.36వేలు వంతున ఖర్చు చేయనున్నారు. ఈ లెక్కన 486 కేంద్రాలలో 1,74,96,000 రూపాయలు వెచ్చించనున్నారు. అలాగే మంచినీటి వసతికి రూ.17వేల వంతున మంజూరవగా, 507 కేంద్రాలలో 86,19,00 రూపాలు ఖర్చు చేయనున్నారు. ఇక జిల్లాలో 2,934 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా, సొంత భవనాలు కలిగినవి 1037, అద్దె భవనాల్లో 732 కేంద్రాలు నడుస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, ఇతర ప్రభుత్వ భవనాల గదుల్లో (రెంట్ ఫ్రీ) 1,165 కేంద్రాలు ఉన్నాయి. అద్దెలేని భవనాలు అంటే అంగన్వాడీల నిర్వహణ కార్యకర్తలకు తలకు మించిన భారంగా మారింది. ఇక్కడ కనీస వసతులు లేవు. సొంత భవనాల్లోనూ గత ప్రభుత్వం చేపట్టిన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ దశలో కూటమి ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు పూనుకుని వాటి బాగోగులపై దృష్టి సారించి, నిధులు విడుదల చేసింది. ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ మాట్లాడుతూ సొంత భవనాల్లో నడుస్తున్న కేంద్రాలలో మరుగుదొడ్లు, మంచినీటి వసతి కల్పించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేపడతారని వెల్లడించారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

కావలి టౌన్, సెప్టెంబరు 24: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్న పాతూరులోని మున్సిపల్ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు, ఎన్‌సీసీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న షేక్ మస్తాన్‌వలిని మంగళవారం పాఠశాల సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ చైర్మన్ రమణమ్మ, సభ్యులు శ్యాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాలకొండ డిప్యూటీ కమిషనర్ బదిలీ

వలేటివారిపాలెం, సెప్టెంబరు 24 మాలకొండ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావును బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన స్థానంలో పెంచలకోన నరసింహస్వామి సాగర్‌బాబును నియమించారు. సాగర్‌బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు. శ్రీనివాసరావు నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల కమిషనర్‌గా బదిలీ చేశారు.

సీసీ కెమెరాలు ఏర్పాటుకు విరాళాలు

కందుకూరు : పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రూ.లక్ష విరాళం అందజేశారు. పట్టణ వ్యాపారులు, ఇతరవర్గాల ప్రజలు ఈ కార్యక్రమానికి తమవంతు చేయూతనివ్వాలన్న పిలుపుతో మంగళవారం పులువురు విరాళాలు అందజేశారు. వారిలో వీపీజీ జ్యూయలర్స్ సుకుమార్ రూ.50వేలు, కాకుమాని ప్రవీణ్ రూ.25వేలు, చీదెళ్ల శ్రీను అండ్ బ్రదర్స్ రూ.10వేలు, ఆరికట్ల ప్రసాద్ రూ.10వేలు, నూకల సుబ్బారావు రూ.10వేలను ఎమ్మెల్యేకు అందజేశారు.

గుడ్లూరు రోడ్డు వద్ద ఓవర్‌బ్రిడ్జి నిర్మించాలి

కందుకూరు, సెప్టెంబరు 24: జాతీయ రహదారిలో భాగంగా గుడ్లూరు రోడ్డు క్రాసింగ్ వద్ద ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పోకూరి మాలకొండయ్య డిమాండ్ చేశారు. మంగళవారం వారు కందుకూరు సీపీఐ సమితి సభ్యుల ఆధ్వర్యంలో జాతీయ రహదారి పనులను పరిశీలించి మాట్లాడారు. కొండముడుసుపాలెం సమీపంలో గుడ్లూరు రోడ్డు క్రాసింగ్‌లో ఓవర్‌బ్రిడ్జి లేకుండా పనులు చేస్తుండటంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఆనంద్‌మోహన్, షేక్ హుసేన్, గౌడపేరు రాము, హరిబాబు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలుకు బహిరంగ వేలం

బిట్రగుంట, సెప్టెంబరు 24: కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ భూముల కౌలుకు ఈ నెల 30న నూతన కార్యాలయంలలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రాధాకృష్ణ తెలిపారు. మూడేళ్ల పాటు కాల వ్యవధి ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనే వారు దేవాదయ శాఖ నిర్ణయించిన షరతులు, నియమాలకు తెలుసుకుని పాల్గొనాలన్నారు.

కందుకూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

కందుకూరు, సెప్టెంబరు 24: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పార్టీలకు అతీతంగా కందుకూరు అభివృద్ధి మండలి పనిచేస్తుందని మాజీఎమ్మెల్యే దివి శివరాం, వివిధ ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్‌హాలులో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, మాజీప్రజాప్రతినిధులు పాల్గొని అభివృద్ధి, ప్రజా సమస్యలపై అంశాలపై చర్చించారు. ప్రధాన సమస్యలుగా రాళ్లపాడు రిజర్వాయరు అభివృద్ధి, ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల రైతులు, సాగు, తాగునీరు సరఫరా అవుతున్న గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. గత అనుభవాల దృష్ట్యా ఈ మండలి నిర్మాణాత్మక పాత్ర పోషించేలా మేథావుల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుని పనిచేయాలని తీర్మానించారు. అక్టోబరు 14న తిరిగి అభివృద్ధి మండలి సమావేశాన్ని విస్తృతస్థాయిలో నిర్వహించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. సమావేశంలో టీడీపీ, వైసీపీ, సీపీఐ, కాంగ్రెస్ పార్టీలతో పాటు వివిధ ప్రజాసంఘాలకు చెందిన నేతలు మహేశ్వరరావు, మాలకొండయ్య, కాకుమాని మాధవరావు, పాలేటి కోటేశ్వరరావు, షేక్ రఫీ, ముప్పవరపు కిషోర్, నరేష్, పొడపాటి శ్రీను, మల్లికార్జునరావు, అయ్యన్న, తోకల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం

బిట్రగుంట : కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లను మంగళవారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో రాధాకృష్ణ, అర్చకులు సత్యనారాణాచార్యులు ఆయను మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజాభిషేకాల అనంతరం సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం తెలుపుతు జనసైనికులతో కలసి దీక్ష చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తిరుమతశెట్టి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి గంగపట్ల సురేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

గుడ్లూరు, సెప్టెంబరు 24: ఎలాంటి అనుమతులు లేకుండా లింగసముద్రం మండలం పెదపవని ఉప్పుటేరు వాగు ఇసుకను అక్రమంగా ఇతర మండలాలకు తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం తెల్లవారు జామున గుడ్లూరు పోలీసులు నరసాపురం రహదారిపై గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. ముగ్గురు డ్రైవర్లనుని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కావలి రూరల్, సెప్టెంబరు 24: రుద్రకోట వడ్డిపాలెంలోని పేకాట స్థావరంపై మంగళవారం ఎస్ఐలు బాజిబాబు, బాలక్రిష్ణలు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 5గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.4,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సీఐ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు ఈ దాడులు చేపట్టామన్నారు.

ఆర్డీవో ఆకస్మిక తనిఖీ

అల్లూరు, సెప్టెంబరు 24 : తహసీల్దారు కార్యాలయాన్ని మంగళవారం కావలి ఆర్డీవో శీనానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సామాజిక తనిఖీల్లో భాగంగా అల్లూరుకు రికార్డులను పరిశీలించానన్నారు. భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించమని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ పంపుసెట్‌ను సద్వినియోగం చేసుకోరూ..!



సంగం మండలం పల్లిపాళెంలో గత టీడీపీ హయాంలో గ్రామస్థుల తాగునీటి కోసం రూ. 7.5 లక్షలతో సోలార్ పంప్ సెట్ ఏర్పాటు చేశారు. అనంతరం వైసీపీ హయాంలో ఇది మరమ్మతులకు గురైంది. అయితే ఎవరూ పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో జల్‌జీవన్ మిషన్ మంజూరు కావడంతో పైపులైన్లు, కుళాయిలు వేశారు. దీంతో సోలార్ పంప్‌సెట్ నిరుపయోగంగా మారింది. ఏదైనా ఇతర అవసరాలకు దీన్ని వినియోగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- సంగం

వీధి లైటు వెలిగితేనేం.. బిల్లు మేం కడతామా?



వలేటివారిపాలెం మండలం అంకభూపాలపురంలో వీధిలైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా లైట్లు వెలుగుతూనే ఉంటాయి. వీటి బిల్లుల భారం పంచాయతీపై పడుతోంది. వాటి కరెంట్ బిల్లు లు మేము కడతామా వెలగని అన్న చందంగా స్థానికులు వాటిని చూస్తూ ముందుకు వెళతున్నారు. సంబంధిత పంచాయతీ అధికారులు వీటిని పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి అనీల్‌ను వివరణ కోరగా థర్డ్ వైరు లేకనే రాత్రిపగుళ్లు వెలుగుతున్నాయని, థర్డ్ వైరుకు పంచాయతీ నుంచి నగదు విద్యుత్ అధికారులకు చెల్లించినా థర్డ్ వైరు రాలేదన్నారు.

-వలేటివారిపాలెం

వరద బాధితులకు విరాళం



ఉదయగిరి రూరల్ : కరస్పాండెంట్ సుధాకర్‌కు నగదు అందజేస్తున్న ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి



కావలి : ఎంఈవోలకు డీడీ అందజేస్తున్న విద్యార్థులు



ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 24: విజయవాడ వరద బాధితుల కోసం స్థానిక హోలీఏంజల్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం రూ.1.10 లక్షల విరాళాలను సేకరించింది. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఆ నగదును కరస్పాండెంట్ సుధాకర్, హెచ్ఎం కరుణకుమారికి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కావలి రూరల్ : మన్నంగిదిన్నె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గ్రామస్థుల సహకారంతో వరద బాధితుల సహాయార్థం రూ.8వేలు సేకరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఏపీ రత్నం, సీఆర్పీ హేమామాలిని పాల్గొన్నారు.

వాటర్ డిస్పెన్సర్ వితరణ

కావలి రూరల్, సెప్టెంబరు24: చలంచర్ల పంచాయతీలోని పెద్దవరం పాఠశాలకు విశాఖపట్నంకు చెందిన వ్యాపారవేత్త ఇరువూరి మాల్యాద్రి వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మంగళవారం వాటర్ డిస్పెన్సర్‌ను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు బి.గోవిందయ్య, సిహెచ్. వెంకట సుబ్బయ్య, విద్యాకమిటీ చైర్మన్ మహేంద్ర, హెచ్ఎం మధుసూధన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 24: పంటల సాగులో విచక్షణారహితంగా పురుగు మందులు వాడకం తగదని, సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం లాభదాయకమని మండల వ్యవసాయశాఖాధికారి కిషోర్‌బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని కరటంపాడు, బీ చిరువెళ్ల గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కరటంపాడు పశువైద్యశాల డాక్టర్ కృష్ణయ్య, ఏపీసీఎన్‌పీ సిబ్బంది, వీఏఏడబ్ల్యూవోలు పాల్గొన్నారు

కందుకూరు: పలుకూరు, మహదేవపురం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి రాము ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి ఏవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వెంకటేష్, ప్రకృతి వ్యవసాయం అధికారిణి సునీత, కేవీకే శాస్త్రవేత్త వివేక్, కామత్, డ్వామా ఏపీడీ బాబూరావు, ఉద్యాన శాఖ అధికారి బ్రహ్మసాయి, మార్కెటింగ్ శాఖ అధికారి ఖాసిం తదితరులు పాల్గొన్నారు. .

ఉదయగిరి రూరల్ : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని గండిపాళెం, గుడినరవ గ్రామాల్లో సాగులో ఉన్న పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్, పంచాయతీ కార్యదర్శి అమర్నాథ్‌రెడ్డి, ఏఈవో రాజశేఖర్‌రెడ్డి, వీఏఏ ఫయాజ్, అనుబంధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు : గ్రామంలోని 1,2 సచివాలయాల పరిధిలో మంగళవారం మండల వ్యవసాయాధికారి వెంకటసుబ్బారెడ్డి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. బొప్పాయి పంటను పరిశీలించి రైతుకు సలహాలిచ్చారు.

ఏఎస్‌పేట : మండలంలోని అనుమసముద్రం, చందులూరుపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి రజిని, ఉద్యానవన అధికారిణి పీ లక్ష్మిఏఈవో కే చిరంజీ వివీఏఏలు జీ రమవై భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం : మండలంలోని పబ్బులేటిపల్లి, చిన్ననాగంపల్లి గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి పీ చెన్నారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు వ్యవసాయం శాస్త్రవేత్త డాక్టర్ సురేఖాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పబ్బులేటిపల్లిలో సాగులో ఉన్న వరి, పత్తి పైర్లను, చిన్ననాగంపల్లిలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ మాలశ్రీ,ఏఎంసీ యార్డ్ అసిస్టెంట్ చిరంజీవి, వీఏఏ కవిత, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఆర్ పురం : పత్తి పంటను పరిశీలిస్తున్న డాక్టర్ సురేఖాదేవి,వ్యవసాయాధికారి చెన్నారెడ్డి తదితరులు

వరికుంటపాడు : మండలంలోని విరువూరు, పెద్దిరెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో రైతులకు మండల టీడీపీ కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రావెళ్ల నాగేంద్ర, వైస్ ఎంపీపీ మధు, సర్పంచి మహేష్, ఉద్యానశాఖాధికారి జయశ్రీ, వీఏఏలు పాల్గొన్నారు.

లింగసముద్రం : పెదపవని, ముత్యాలపాడు రైతుసేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య, రామిశెట్టి మాలకొండయ్య, పాల్గొన్నారు.

కొండాపురం: వ్యవసాయశాఖ ద్వారా వచ్చే పథకాలపై రైతులు అవగాహన పెంచుకోవాలని వ్యవసాయశాఖ అధికారి చంద్రభాను తెలిపారు. గానుగపెంట, తూర్పుఎర్రబల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈవో ఈశ్వరాచారి, వీఏఏ రవి, చంద్రశ్రీధర్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో కావలిని ప్రథమస్థానంలో నిలబెడతా : ఎమ్మెల్యే

కావలి, సెప్టెంబరు 24: సీఎం చంద్రబాబు పాలనలో కావలి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలుపుతానని ఎమ్మెల్యే డీవీ క్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణ 13వ వార్డులో మంగళవారం సాయంత్రం కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలనలో సాధించిన విజయాలను ఎమ్మెల్యే ఇంటింటికి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. నియోజకవర్గాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. కావలిని గంజాయి హబ్‌గా మార్చారని మండిపడ్డారు ఇప్పటికే రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించామన్నారు. తీర ప్రాంతంలో పరిశ్రమలకు అవసరమైన భూసేకరణ, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, రామాయపట్నం పోర్టు నిర్మాణాలు పూర్తి కావస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్, డీఈ సాయిరాం, నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతిబాబూరావు, జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్, పొబ్బా సాయి విఠల్, సిద్ధూ, బీజేపీ నేతలు సీవీసీ సత్యం, కే. బ్రహ్మనందం పాల్గొన్నారు.





జలదంకి: రామవరప్పాడులో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల దంపతులు, కావలి: కరపత్రాన్ని అందచేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

రామవరప్పాడు అబివృద్ధికి కృషి

జలదంకి : స్థానిక నాయకులు, సర్పంచి, ప్రజల సహకారంతో రామవరప్పాడు అబివృద్ధికి కృషి చేస్తామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. ఇది మంచిప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మంగళవారం రామవరప్పాడులో పర్యటించి వందరోజుల పాలనపై సతీమణితో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ ఉన్నం సరస్వతి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ప్రభుత్వ పాలనతీరును ఎమ్మెల్యే వివరించారు. అనంతరం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఎంపీడీవో చంద్రశేఖర్, నేతలు మధురెడ్డి, బాస్కర్‌రెడ్డి, ఉన్నం రవి, కంచర్ల రామచంద్రయ్య, వర్దినేని మురళిపాల్గొన్నారు.



కళవళ్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

వలేటివారిపాలెం: పేదలకు సంక్షేమం, అబివృద్ధి ఫలాలు అందించడమే సీఎం చంద్రబాబు ప్రధాన లక్ష్యం అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. కళవళ్లలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, పరిటాల భాస్కర్‌రావు, స్వర్ణ చిననాంచారయ్య, మోదేపల్లి లక్ష్మీనారాయణ, మోదేపల్లి వెంకటనరసింహం, పాల్గొన్నారు.

రేపు ఇస్కపల్లిలో 'ఇది మంచి ప్రభుత్వం' ముగింపు

అల్లూరు : ఇది మంచి ప్రభుత్వం ముగింపు కార్యక్రమాన్ని ఇస్కపల్లిలో గురువారం నిర్వహించనున్నట్లు నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రలు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో పీ శ్రీనివాసులురెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, తోట శ్రీహరి, బిట్రగుంట చైతన్య, కృష్ణ చైతన్య, ఊటు శ్రీకాంత్, బిట్రగుంట వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం : అన్నెబోయినపల్లి గ్రామ సమీపంలోని మన్నేరు వాగులో నుంచి అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను లింగసముద్రం పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఇసుక నింపుకుంటున్న మూడు ట్రాక్టర్లను గ్రామ శివారులో ఎస్ఐ షేక్ మహబూబ్ సుబాని, సిబ్బందితో దాడి చేసి మూడు ట్రాక్టర్లను, డ్రైవర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముగ్గురు డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

టపాసుల గోదాము తనిఖీ : జలదంకి : జమ్మలపాలెంలోని టపాసుల గోడౌన్‌ను మంగళవారం సాయంత్రం కలిగిరి సీఐ వెంకటనారాయణ తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల కోసం ఏర్పాటు చేసిన పరికరాలను పరిశీలించారు.

ఎస్టీ కాలనీకి తాగునీటి వసతి

అనంతసాగరం, సెప్టెంబరు 24: స్థానిక ఎస్టీ కాలనీలో తాగునీటి వసతి లేక ఇబ్బంది పడుతుండగా, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి చేయూతనందించారు. సొంత నిధులతో మంగళవారం తన అనుచరులతో మినరల్ వాటర్ పంపిణీకు చర్యలు చేపట్టారు. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మెట్టుకూరు కృష్ణారెడ్డి, ఎంపీడీవో మధుసూదన్‌రావు, ఎంపీటీసీ రాపూరు సుజాతమ్మ, రాపూరు సుబ్బారెడ్డి దతితరులు పాల్గొన్నారు.

టపాసుల గోదాము పరిశీలన

వింజమూరు, సెప్టెంబరు 24 : కలిగిరి సీఐ వెంకట రమణ, వింజమూరు ఎస్ఐ వీరప్రతాప్ మంగళవారం పట్టణంలోని టపాసుల గోదామును పరిశీలించారు. గోదాములో టపాకాయల రక్షణకు సౌకర్యాలు ఉన్నాయా.. లేవా? పరిశీలించారు. గోదాము నిర్వాహకుడికి లైసెన్సు ఉందా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. టపాకాయల అమ్మకం రోజున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు ఆదేశించారు.

తక్కెళ్లపాడులో వైద్య శిబిరం

వింజమూరు, సెప్టెంబరు 24: మండలంలోని తక్కెళ్లపాడులో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా, గ్రామాల్లో విషజ్వరాలు వ్యాపించకుండా వైద్య సిబ్బంది ఈ శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్థులకు బీపీ చెకప్ చేసి, జ్వరాలు ఉన్నవారికి మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శివరాణి, పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య, మాజీ ఎంపీటీసీ రొడ్డా కొండయ్య, టీడీపీ నేత పెద్దయ్య, ఆశా కార్యకర్తలు నయోమి, అమ్ములు, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర



సంగం, సెప్టెంబరు 24: మండలంలోని మర్రిపాడుకి చెందిన కొంతమంది యువకులు, పెద్దలు పాదయాత్రగా మంగళవారం తిరుమలకు బయలుదేరి వెళ్లారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో గ్రామస్థులు సుభిక్షంగా ఉండాలని ఆ ఏడుకొండలస్వామికి వేడుకొంటూ పదేళ్లుగా పాదయాత్ర చేస్తున్నారు. అందులో భాగంగా సుమారు 50 మంది గ్రామస్థులు యాత్ర చేపట్టారు. ఉదయం 10 గంటలకు సంగం చేరుకున్నారు. పొదలకూరు, రాపూరు, వెంకటగిరి, ఏర్పేడు మీదుగా తిరుమలకు చేరుకుంటారు.

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 24: దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రెండు బాణసంచా గోదాములు, విక్రయ, తయారు చేసే కేంద్రాలను తనిఖీ చేసి లైసెన్సులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అనుమతుల్లేకుండా బాణసంచా విక్రయించినా, నిల్వ ఉంచినా చర్యలు తప్పవన్నారు.

దుత్తలూరు : మండలంలోని వెంకటంపేటలోని బాణసంచా తయారీ, విక్రయ కేంద్రాన్ని మంగళవారం ఎస్ఐ ఆదిలక్ష్మి తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర రికార్డులు, లైసెన్సును పరిశీలించారు.

కళాశాలలో పరిశుభ్రత కార్యక్రమాలు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 24: స్థానిక మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ ప్రభుత్వ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సేవాభావం, క్రమశిక్షణ అలవర్చుకొని సమాజంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో చెత్తాచెదారాన్ని ఏరివేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు గోపికృష్ణ, కిషన్‌తేజ, శోభ, మాధవి, రాజేశ్వరి, అశోక్, సూర్య పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం యాగాలు

సంగం, సెప్టెంబరు 24: ఋషులు లోక కల్యాణార్థం యాగాలు, కుంభాభిషేకాలు నిర్వహిస్తుంటారని తమిళనాడులోని వారాహి శక్తిపీఠం పీఠాధిపతి యాగరుషి వారాహి గురుజీ పేర్కొన్నారు. మంగళవారం ఆయన సంగం తిరుమనకొండలోని శ్రీరాజరాజేశ్వరిదేవి సమేత కాశీవిశ్వేరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం భక్తులకు ఉపదేశించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, సెప్టెంబరు 24 : మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల మృతి చెందిన ఐదుగురికి (ఒక్కొక్కరికి రూ.10,000 వంతున) రూ. 50వేలను సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మంగళవారం అందజేశారు. 4వ వార్డులోని షేక్ ఖాదర్‌బాష, 8వ వార్డులో శీలా సుభద్రదేవి, 18 వార్డులోని మల్లె చిన్నమ్మ, చెలమచర్ల వెంకటయ్య, 22వ వార్డు పరిధిలోని డక్కా పోలమ్మ కుటుంబాలను వారు పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, శేషారెడ్డి, ట్రస్ట్ సభ్యులు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **జలదంకి :** లక్ష్మీపురం సమీపంలో ట్రాక్టర్ ప్రమాదంలో మృతిచెందిన కోదండరామాపురం వీఆర్ఏలు వంకదారి మాల్యాద్రి, వడ్డే శ్రీనివాసులు కుటుంబాలను మంగళవారం తహసీల్దార్ హేమంత్‌కుమార్ పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున తక్షణసాయంగా ఒక్కో కుటుంబానికి రూ.10వేలు అందజేశారు. మృతుల కుటుంబాల్లో అర్హులైన వారుంటే వారికి వీఆర్ఏ ఉద్యోగం ప్రభుత్వం ఇవ్వనుందని చెప్పారు. కార్యక్రమంలో డీటీ భరత్, ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వో బాలకోటయ్య పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన

సంగం, సెప్టెంబరు 24: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సీఐ వేమారెడ్డి గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఇతర చట్టాలపై మంగళవారం అవగాహన కల్పించారు. పాఠశాలలో రెండు రోజుల కిందట గుర్తుతెలియని ఆకతాయిలు టాయిలెంట్ సింక్‌లను ధ్వంసం చేయడంపై హెచ్ఎం బుజ్జయ్య సీఐకి వివరించారు. పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్య తీసుకోవాలి

కావలి, సెప్టెంబరు24: తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన అప్పటి టీటీడీ చైర్మన్లు, ఈవోలపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ సీవీసీ సత్యం, పట్టణ అధ్యక్షుడు బ్రహ్మనందంలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జర్నలిస్ట్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. శ్రీవారి భక్తులను మనోభావాలను దెబ్బతిసిన వారిపై విజిలెన్స్ విచారణ జరిపించాలన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి మందా కిరణ్, ఉపాధ్యక్షుడు సుందరశెట్టి సుజిత్, నేతలు వెంకటరెడ్డి, రాకేష్, ప్రసన్న పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో నిరసన సబబు కాదు : సీఐ

కలిగిరి, సెప్టెంబరు 24: రావులకొల్లు ఆశావర్కర్ పందిటి విజయమ్మను విధుల నుండి తప్పించడంతో ఆశావర్కర్లతో పాటు సీఐటీయూ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు మూడురోజులుగా స్థానిక పీహెచ్‌సీలో నిరసనలు చేపట్టడం సబబు కాదని కలిగిరి సీఐ వెంకట నారాయణ అన్నారు. మంగళవారం ఆయన ఎస్ఐ ఉమాశంకర్‌లు తమ సిబ్బందితో కలిసి పీహెచ్‌సీ వద్దకు వెళ్లి యూనియన్ నాయకులు, ఆశా వర్కర్లతో చర్చలు జరిపారు. అనంతరం స్థానిక వైద్యాధికారి, డీఎంహెచ్‌ఓలతో ఫోన్లో మాట్లాడారు.

పంటకాలువకు గండి

కొండాపురం, సెప్టెంబరు 24: మోపాడు రిజర్వాయరు నుండి మండలానికి వచ్చే కాలువకు గండి పడటంతో నీరు మన్నేరు వాగులోకి చేరుతుంది. గండి విషయంపై రిజర్వాయరు ఏఈ శ్రీనివాసులును వివరణ కోరగా ఎవ్వరో గుర్తుతెలియని వ్యక్తులు కాలువకు గండి కొట్టారని ఈ విషయంపై ఉన్నతాధికారులు ఫిర్యాదు చేస్తామన్నారు. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతామన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతిపై విచారణ

బిట్రగుంట, సెప్టెంబరు 24: అల్లిమడుగు సంఘానికి చెందిన బీ శంకర్ ఈనెల 2వ రాత్రి పాముకాటుతో మృతి చెందాడు. కోవూరుపల్లి పీహెచ్‌సీలో చికిత్స అందక పోవడం వల్లే శంకర్ మృతి చెందాడని వస్తున్న వార్తలకు జిల్లా అధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత మంగళవారం గ్రామంలో విచారణ చేపట్టారు.

27న జాబ్‌మేళా

ఉదయగిరి రూరల్ : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయింట్ ఆఫీస్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో 27న స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఏ.నరసింహులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.